ఖమ్మం జిల్లా

# బంజారా పండుగలు



డా॥ జి.వెంకట లాల్

# ఖమ్మం జిల్లా బంజారా పండుగలు

**డా॥ జి. వెంకట లాల్**

**ప్రథమ ముద్రణ : సెప్టెంబర్, 2016**

**ISBN : 978-93-5265-633-2**

© సర్వహక్కులు రచయితవి

వెల : 100/-

కాపీల కొరకు :
**డా॥ జి. వెంకట లాల్**
పెద్దకిష్టాపురం(గ్రామం),
గార్ల మండలం,
మహబూబాబాద్ జిల్లా.
తెలంగాణ రాష్ట్రం
సెల్ : 9949264650

కవర్‌పేజి డిజైన్ & డిటిపి :
**కె. లక్ష్మీనారాయణ**
మామిళ్ళగూడెం, ఖమ్మం.

ప్రింటర్స్ :
దీప్తి పబ్లికేషన్స్, తెనాలి.

# కృతజ్ఞతలు

వెంకటలాల్ నీవు యం.ఆర్.పి.కి అప్లయ్ చేసుకో నీకు తప్పక వస్తుందని ప్రోత్సహించి ఈ పరిశోధనకు పురికొల్పిన మా కళాశాల ప్రిన్సిపాల్ డా॥ యస్.మాధవరావుగారికి, తెలుగు శాఖాధ్యక్షురాలు డా॥ బి.మాధురి గారికి, ధరఖాస్తు చేసుకున్న వెంటనే మైనర్ రిసెర్చ్ ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చి, ఆర్థిక సహాయాన్ని అందించిన యు.జి.సి. (సెరో) హైదరాబాదు వారికి కృతజ్ఞతలు.

నా పరిశోధనకు వస్తు సామాగ్రిని, విషయ సేకరణకు ఓపికతో వాగ్రూపంలో సమాచారాన్ని అందించిన బంజారా వక్తలు, పెద్దలకు, ప్రత్యేకంగా ఖమ్మం జిల్లాలోని కొన్ని తండాల నాయకులు, పెద్దలు, ఆడపడుచులకు పేరు పేరున (ఈ పేర్లు ఆధారగ్రంథ సూచిలో పేర్కొన్నాను) కృతజ్ఞతలు. బంజారుల ఆచార వ్యవహారాలపై పరిశోధన చేసిన చినీయానాయక్.బి., జీవలా నాయక్. నూన్సావత్, బాలాజీ దాసు. రాఠోడ్, గోనా నాయక్.యం, శంకరయ్య. జనపాల, సూర్యాధనుంజయ్, సిల్మానాయక్ మొదలైన పూర్వ పరిశోధకుల గ్రంథాల నుండి చాలా వరకు విషయ సేకరణ చేసాను. అందుకు అందరికి కృతజ్ఞుడ్ని.

ఆంగ్లంలో ఉన్న విషయాన్ని అనువాదం చేసి సహకరించిన నాతోటి ఆంగ్లోపన్యాసకురాలు శ్రీమతి భవానీ గారికి, ఇంటర్నెట్‌కు సహకరించిన మోహన్‌రావు, సుధీర్, కార్తీక్ గార్లకు, యు.జి.సి. వారికి ఉత్తర ప్రత్యుత్తరాలకు సహకరించిన టైపిస్ట్ అనిల్‌గారికి, ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహాయాన్ని అందించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి, నా విద్యార్థి మిత్ర బృందానికి కృతజ్ఞతలు.

నాకు ఫలాన పుస్తకం కావాలి అని ఫోన్లో చెప్పిన వెంటనే లైబ్రరీలకు, పుస్తక షాపులకు వెళ్ళి పుస్తకాలు సేకరించి పంపిన నా చిన్నయ్య ప్రసాద్(హైదరాబాదు), మిత్రులు బి.శ్రీధర్ (కేంద్రీయ విశ్వ విద్యాలయం, హైదరాబాదు), బి.కృష్ణ(కొత్తగూడెం), ఎ.సిల్మా నాయక్ (హైదరాబాదు) గార్లకు

కృతజ్ఞుణ్ణి. ఫోన్లోనే బంజార పండుగల గురించి ఎంతో ఓపికతో సమాచారాన్ని అందించిన పార్వతి, కిషన్ (బర్లగూడెం), తులసి, బద్రి, మూన్యానాయక్ (పెద్ద కిష్టాపురం) గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు.

విషయ సామాగ్రిని సేకరించటానికి తమవంతు సహకారాన్ని అందించిన నా తల్లి శ్రీమతి తులసి, పెద్ద అన్నవదినలు శ్రీనివాస్, విజయ, చిన్న అన్నావదినలు ప్రసాద్, సునీత, చిన్న అక్కాబావలు పార్వతి, కిషన్, పెద్ద అక్కాబావలు భారతి, శంకర్, నా భార్య జి.గీతాంజలి గార్లకు, వయసులో చిన్న వాడైనప్పటికి నాకు వస్తు సామాగ్రిని అందించి సహాయ మందించిన నా కుమారుడు జీవితేశ్, నా మిత్రులు ఎల్.దేవ్లా (డిప్యూటి జైలర్, ఖమ్మం) డా॥ బి.బొంద్యాలు (సిద్దారెడ్డి కళాశాల, ఖమ్మం), బి.శంకర్ (డెవలప్‌మెంట్ ఆఫీసరు, ఎల్.ఐ.సి. ఖమ్మం) గార్ల కృషి ఎన్నటికి మరిచిపోలేను.

ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహకరించిన బంధు, మిత్ర, విద్యార్థి మిత్రులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు. డి.టి.పి.ని అందంగా చిత్రించిన కె.లక్ష్మీనారాయణ-లలిత, ఖమ్మంగార్లకు కృతజ్ఞతలు. అచ్చేసిచ్చిన దీప్తి పబ్లికేషన్స్ డా॥ ఏ.ఆంజనేయులు, తెనాలి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

**డా॥ జి.వెంకట లాల్.**

# ఉపోద్ఘాతం

భారతదేశంలో గిరిజనులు వివిధ సంస్కృతులు, సంప్రదాయాలను కలిగి వున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 33 గిరిజన తెగలున్నాయి. వీరిలో బంజార తెగ ప్రధానమైంది. భారతదేశంలోని 17 రాష్ట్రాలలో, ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాలలో బంజారా తెగవారు నివసిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బంజారులు ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలను కలిగి వున్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లా బంజారులు జరుపుకునే పండుగలు ఒక ప్రత్యేకతను కలిగి వున్నాయి. ఖమ్మం జిల్లా బంజారులు ఈ పండుగలను జరుపుకునే విధానం ప్రత్యేకమైంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఆధునిక సమాజంలో మార్పుల వల్ల భారతజాతితో పాటూ, బంజార తెగవారు కూడా తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నారు. బంజారుల సంస్కృతి, సంప్రదాయాలలో, ఆచార వ్యవహారాలలో, జీవనశైలిలో, పండుగలలో ఎంతో మార్పులు సంభవిస్తున్నాయి. బంజారుల సంస్కృతిలో భాగంగా నిర్వహించుకునే పండుగలను పరిరక్షించి రాబోయే తరాల వారికి అందించవలసిన ఆవశ్యకత ఉంది.

ప్రపంచ వ్యాప్తంగా అనేక గిరిజన తెగలున్నప్పటికి, బంజార తెగ ప్రధాన తెగ. వీరి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, వేషభాషలు అంతా కూడా అన్ని ప్రాంతాలలో కొద్ది మార్పులతో కన్పిస్తాయి. అమెరికాలో జిప్సీలన్నా, ఆంధ్ర, రాయలసీమలలో సుగాలీలన్నా, తెలంగాణలో బంజార, లంబాడీలన్న ఒకటే. ఖమ్మం జిల్లాలో లంబాడీలన్న పేరే చెలామణిలో ఉన్నప్పటికి, రాష్ట్రం అంతా 'బంజార' అనే పదం చెలామణిలో ఉన్నందున నా పరిశోధన అంశాన్ని **'ఖమ్మం జిల్లా బంజారా పండుగలు'** అనే శీర్షికను ఎంచుకున్నాను.

బంజారుల మీద, వారి ఆచార వ్యవహారాల మీద పూర్వ పరిశోధన గ్రంథాలున్నాయి. బాలాజీ దాసు. రాథోడ్ (1982), చీనియా నాయక్.బి(1998),

గోనా నాయక్.యం(2002), సూర్యాధనుంజయ్(2009), శంకరయ్య జనపాల (1995), సిల్మా నాయక్ (2011), వెంకట లాల్.జి (2011) పరిశోధన గ్రంథాలు మాత్రమే లభ్యమవుతున్నాయి. కాబట్టి **'ఖమ్మం జిల్లా బంజారా పండుగలు'** అనే అంశాన్ని స్వీకరించటం జరిగింది. ఆధునిక సమాజంలో అంతరించిపోతున్న తమ సంస్కృతి సంప్రదాయాలలో భాగమైన ఈ పండుగలను బంజార సమాజానికి, ముందుతరం బంజారులకు అందించటమే ఈ పరిశోధన లక్ష్యం.

**'ఖమ్మం జిల్లా బంజారా పండుగలు'** అనే ఈ పరిశోధన వ్యాసాన్ని మూడు అధ్యాయాలుగా విభజించాను. మొదటి అధ్యాయంలో ఖమ్మంజిల్లా భౌగోళికాంశాలు, చరిత్రనూ, రెండవ అధ్యాయంలో బంజారుల పుట్టుక - చరిత్రనూ, మూడవ అధ్యాయంలో ఖమ్మంజిల్లా బంజారా పండుగలలో ప్రధాన, అప్రధాన పండుగలను వివరించటం జరిగింది.

ఈ పుస్తకంలోని విషయ సామాగ్రిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభజన జరగక ముందు సేకరించింది. కావున యధావిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సమాచారాన్ని మాత్రమే ముద్రిస్తున్నాను.

**డా॥ జి. వెంకట లాల్.**

## విషయసూచిక


| విషయసూచిక | |
|---|---|
| కృతజ్ఞతలు | 3 |
| ఉపోద్ఘాతం | 5 |
| 1. ఖమ్మం జిల్లా భౌగోళికాంశాలు - చరిత్ర | 8 |
| 2. బంజారుల పుట్టుక - చరిత్ర | 37 |
| 3. ఖమ్మం జిల్లా బంజారా పండుగలు | 71 |
| 4. ముగింపు | 126 |
| 5. ఆధార గ్రంథాలు | 128 |
| 6.విషయ సామాగ్రిని అందించిన వ్యాఖ్యాతలు | 132 |
| 7. అనుబంధం -1 | 134 |
| 8. అనుబంధం - 2 | 136 |

# 1. ఖమ్మం జిల్లా చరిత్ర - భౌగోళికాంశాలు

ఆంధ్రప్రదేశ్‌లో చారిత్రాత్మకంగా, పౌరాణికంగా ప్రాముఖ్యం కలిగిన జిల్లాలో ఖమ్మం జిల్లా ఒకటి. తెలంగాణ ప్రాంతంలో గల పది జిల్లాలలో అన్ని రంగాలలో ముందు వరుసలో ఉండి ప్రగతిపథంలో పయనిస్తున్న జిల్లా ఖమ్మం జిల్లా. పవిత్ర గోదావరి తీరంలో శ్రీరాముడు వెలసిన భద్రాద్రి (భద్రాచలం), సింగరేణి బొగ్గు గనులకు పుట్టినిల్లు అయిన ఇల్లందు పట్టణాలు ఖమ్మం జిల్లాలోనే ఉన్నాయి. మహాభారతంలోని అరణ్యావాస ఘట్టాలు, భద్రాచల పరివాహక ప్రాంతాలలో జరిగాయి. మహాభారతంలో అజ్ఞాతవాసం ఘట్టాలు జరిగిన నేలకొండపల్లి గ్రామం (ప్రాంతం) ఈ జిల్లాలోనే వుంది. వాగ్గేయకారుడైన భక్తరామదాసు ఈ నేలకొండపల్లి గ్రామంలోనే జన్మించాడు. నేలకొండపల్లి గ్రామం బౌద్ధమత ప్రచారాలకు స్థావరమైంది. ఇక్కడ నిర్మించిన బౌద్ధస్తూపం ప్రసిద్ధిగాంచింది.

1946 సంవత్సరంలో బాపూజీ మహాత్మాగాంధీ ఖమ్మంలో జరిగిన బహిరంగసభలో పాల్గొన్నారు. "మత సామరస్యం, హరిజన సేవ, ఖద్దరు వస్త్రాలు, హిందీ భాషా ప్రాముఖ్యం తదితర అంశాలపై ఆయన ప్రసంగించారు"(స్తంభాద్రి సంబరాలు ప్రత్యేక సంచిక 2007 : 23) "చివరి నైజాం నవాబు పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు నాయకత్వంలో వీరోచితంగా జరిగిన సాయుధ రైతాంగ పోరాటానికి కాకలు దీరిన యోధులను, నాయకులను అందించిన ప్రాంతంగా ఖమ్మం చరిత్రలో నిలిచిపోయింది"(వికీపీడియా, ఖమ్మం జిల్లా : 1). కమ్యూనిస్టుల గడ్డగా వెలిసిల్లుతుంది. ఇంత గొప్పదైన ఖమ్మం జిల్లా భౌగోళికాంశాలను, చరిత్రను తెలుసుకోవటం ఎంతైనా అవసరం ఉంది.

## 1.2. ఖమ్మం జిల్లా భౌగోళికాంశాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఖమ్మం జిల్లా ఈశాన్య ప్రాంతంలో వుంది. ఖమ్మం జిల్లా భౌగోళికంగా 16.45 - 18.35 డిగ్రీలు ఉత్తర అక్షాంశాలు మరియు 79.47-80.47 డిగ్రీలు తూర్పు రేఖాంశాల మధ్య తెలంగాణ ప్రాంతంలో ఉంది. ఈ జిల్లా 16,029

చదరపు కిలో మీటర్ల (6.189 చదరపు మైళ్ళ) విస్తీర్ణంలో వ్యాపించి వుంది.

ఈ జిల్లాకు ఉత్తరాన చత్తీస్‌గడ్ రాష్ట్రం, నైరుతి దిశలో నల్గొండ జిల్లా, తూర్పున ఉభయ గోదావరి (తూర్పు, పడమర గోదావరి) జిల్లాలు, దక్షిణాన కృష్ణాజిల్లా, ఈశాన్యంలో ఒరిస్సా రాష్ట్రం మరియు పశ్చిమంలో వరంగల్ జిల్లా సరిహద్దులు, ఎల్లలుగా ఉన్నాయి.

2011 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ జనాభా 1,21,01,93,422 వుంటే ఇందులో పురుషులు 62,37,24,248, స్త్రీలు 58,64,69,174గురు ఉన్నారు. స్త్రీ, పురుష నిష్పత్తి ప్రతి 1000 మంది పురుషులకు 940 చొప్పున స్త్రీలు ఉన్నారు.

2011 జనాభా లెక్కల ప్రకారం ఖమ్మం జిల్లా మొత్తం జనాభా 27,98,214 వుంటే ఇది రాష్ట్ర జనాభాలో 3.31 శాతంగా వుంది. ఇందులో పురుషులు 13,91,936, స్త్రీలు 14,06,278 మంది వున్నారు. 2001 నుండి 2011 వరకు 8.50 శాతం వృద్ధి రేటు జరిగింది. జన సాంద్రత ప్రతి చదరపు కిలో మీటరుకు 175గా వుంది. స్త్రీ, పురుష నిష్పత్తి ప్రతి 1000 మంది పురుషులకు 1010 స్త్రీలు వున్నారు.

అదే విధంగా ఖమ్మం జిల్లా అక్షరాస్యులు 16,56,686 మంది ఉంటే, ఇందులో 9,18,880 మంది పురుషులు, 7,37,806 మంది స్త్రీలున్నారు. ఇది జిల్లా మొత్తం జనాభాలో 65.46 శాతం. మొత్తం అక్షరాస్యులకు, 73.20 శాతం పురుషులు, 57.85 శాతం స్త్రీలున్నారు.

0-6 సంవత్సరాల పిల్లలు 2,67,553 మంది వుంటే ఇందులో 1,36,637 మంది మగ పిల్లలు, 1,30,916 మంది ఆడ పిల్లలున్నారు. ఇది జిల్లా మొత్తం జనాభాలో 9.56 శాతంగా, స్త్రీ, పురుష నిష్పత్తి (0-6) 958 స్త్రీలు ప్రతి 1000 మంది పురుషులకు ఉన్నారు.

అదే విధంగా 2001 జనాభా లెక్కల ప్రకారం జిల్లా గ్రామీణ జనాభా 20,68,066 మంది వున్నారు. ఇది జిల్లా మొత్తం జనాభాలో 80 శాతం, రాష్ట్ర జనాభాలో 3.73 శాతంగా వుంది. 9 పట్టణాలలో విస్తరించిన పట్టణ జనాభా

5,10,861 మంది వున్నారు. ఇది జిల్లా మొత్తం జనాభాలో 20 శాతంగా, రాష్ట్ర మొత్తం జనాభాలో 2.46 శాతంగా వుంది. షెడ్యూల్ కులాల (యస్.టి.) జనాభా 12,44,376 మంది వున్నారు. ఇది జిల్లా మొత్తం జనాభాలో 16.54 శాతంగా, రాష్ట్ర మొత్తం జనాభాలో 3.46 శాతంగా వుంది. షెడ్యూలు తెగల (యస్.టి.) జనాభా 6,82,617 మంది వున్నారు. ఇది జిల్లా మొత్తం జనాభాలో 26.47 శాతంగా, రాష్ట్ర మొత్తం జనాభాలో 13.59 శాతంగా వుంది.

## 2011 జనాభా లెక్కల పట్టిక

| జిల్లా జనాభా | | 0-6 | అక్షరాస్యులు | స్త్రీ పురుష నిష్పత్తి | జన సాంద్రత | వృద్ధిరేటు |
|---|---|---|---|---|---|---|
| మొత్తం | 27,98,214 | 2,67,553 | 16,56,686 | 1010:1000 | 175 | 8.50 |
| పురుషులు | 13,91,936 | 1,36,637 | 9,18,880 | | | |
| స్త్రీలు | 14,06,278 | 130,916 | 7,37,806 | | | |
| జిల్లా మొత్తం | 3.31 | | | | | |
| జనాభాలో శాతం | (రాష్ట్ర మొత్తం జనాభా) | 9.56 | 65.46 | | | 8.50 (2010-11) |

**Source : 2011** జనాభా లెక్కలు.

**1.1.1. నదులు :** ఖమ్మం జిల్లాలో గోదావరి, శబరి, కిన్నెరసాని, వైరా, పాలేరు, మున్నేరు, తాలిపేరు, బేతుపల్లి, లంకాసాగర్ నదులు ప్రవహిస్తూ ఉన్నాయి. గోదావరి నది దక్షిణ భారతదేశంలోనే పెద్దది. గోదావరి ఖమ్మం జిల్లాలో వాజేడు మండలం, టేకులగూడెం వద్ద ప్రవేశించి, వేలేరుపాడు మండలం పేరంటాలపల్లి వద్ద పాపికొండలు వరకు ప్రవహిస్తుంది. ఈ నది ఖమ్మం జిల్లాలో మొత్తం 180 కిలో మీటర్ల వరకు ఆగ్నేయ దిశలో ప్రవహిస్తుంది. గోదావరికి ముఖ్యమైన ఉపనది ఐన శబరినది ఒరిస్సాలో పుట్టి చింతూరు మండలంలో ప్రవేశించి కూనవరం దగ్గర గోదావరిలో కలుస్తుంది. వైరానది కృష్ణా జిల్లాలో మున్నేరులో కలుస్తుంది. తాలిపేరు నది చర్ల దుమ్ముగూడెం ద్వారా ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. పాలేరు నది తిరుమలాయపాలెం మండలం ద్వారా ప్రవేశించి కృష్ణానదిలో కలుస్తుంది. ఇవేకాక వందల సంఖ్యలో ఏర్లు, వాగులు ప్రవహిస్తూ జల సంపదను అందిస్తున్నాయి.

**1.1.2. వాతావరణం :** ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక ఉష్ణోగ్రత కలిగిన ప్రాంతాల్లో ఖమ్మం జిల్లా ఒకటి. ఖమ్మం జిల్లాలో ఉష్ణోగ్రత సాధారణంగా ఉన్నప్పటికి మే నెలలో 49.5 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత పెరుగుతుంది. సాధారణ వర్షపాతం 1124 మిల్లీ మీటర్లుగా నమోదవుతుంది. 2008-2009 సంవత్సరంలో మొత్తంలో సగటున 88% వర్షపాతం ఈశాన్య ఋతుపవనాల వల్ల వచ్చాయి.

**1.1.3. నేలలు:** ఖమ్మం జిల్లాలో అధిక శాతం ఇసుక నేలలు ఉన్నాయి. గోదావరి, మధిర పరీవాహక ప్రాంతాల్లో నల్లరేగడి నేలలు ఉన్నాయి. "జిల్లాలో 43% చెలక, 28% దుబ్బ, 29%నల్లరేగడి మట్టి కలదు"(ఖమ్మం హ్యాండ్ బుక్, 2009 : I)ఖమ్మం జిల్లాలో ఈ నేలలలో వరి, జొన్న, కంది, పెసర, వేరుశనగ, చెరకు, నువ్వులు, మినుము, పత్తి, మిర్చి, పొగాకు మొదలైన అనేక పంటలు విస్తారంగా పండుతాయి.

**1.1.4. అడవులు :** ఖమ్మం జిల్లాలో దట్టమైన అడవులు ఉన్నాయి. జిల్లా భూభాగంలో 7,59,438 హెక్టార్ల విస్తీర్ణం అడవి ప్రాంతంగా ఉంది. ఇది జిల్లా భూభాగంలో 4% విస్తీర్ణంలో అడవి ప్రాంతం విస్తరించి వుంది. ఈ అడవి ప్రాంతం నుండి అమూల్యమైన వన సంపద మనకు లభిస్తుంది. టేకు, నల్లమద్ది, వెదురు, సండ్ర, చింత మొదలైన వృక్షజాతులెన్నో ఇక్కడ కనిపిస్తాయి. మద్దిగుట్ట, రాజుగుట్ట, ఎఱ్ఱగుట్ట మొదలైన కొండలు ఈ జిల్లాలోనే వున్నాయి.

**1.1.5. పరిశ్రమలు :** ఖమ్మం జిల్లాలో ఎన్నో పరిశ్రమలకు సంబంధించిన కర్మాగారాలు నెలకొల్పబడ్డాయి. పాల్వంచలో కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రం, మోతుగూడెంలో జల విద్యుత్ కేంద్ర ఉన్నాయి. పరిశ్రమలకు ప్రాణాధారమైన విద్యుశ్చక్తిని ఈ రెండు కేంద్రాలు సరఫరా చేస్తున్నాయి.

మణుగూరు వద్ద నిర్మించిన భారజల కర్మాగారం, ఇల్లందు, కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి పట్టణాలలోని సింగరేణి కాలరీస్, సారపాకలోని భద్రాచలం పేపర్ బోర్డు, పాల్వంచలో నెలకొల్పబడిన స్పాంజ్ ఐరన్ కర్మాగారం, కల్లూరు దగ్గర నిర్మించబడిన కైలాష్ చక్కెర ఫ్యాక్టరీ, పాల్వంచలో నిర్మించిన నవభారత్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారం, నేలకొండపల్లి దగ్గర పాలేరు సహకార చక్కెర ఫ్యాక్టరీ, పాల్వంచలో నిర్మించబడిన ఏ.పి. స్టీల్ కర్మాగారం మొదలైన ముఖ్యమైన పరిశ్రమలెన్నో ఈ జిల్లాలో ఉన్నాయి.

కూసుమంచి సమీపంలో తెలంగాణ పేపర్ మిల్స్, అశ్వారావుపేట సమీపంలోని ఆదివాసి పేపర్ మిల్స్, కొత్తగూడెం సమీపంలోని బేరియం కెమికల్స్, మైలారం సమీపంలోని కాపర్ ప్రాజెక్టు, అశ్వారావుపేటలోని స్పిన్నింగ్ మిల్లు, బయ్యారం మైన్స్ మొదలైనవి కూడా ఎంతో ప్రాముఖ్యతను పొందాయి.

నేత పరిశ్రమలు, సిమెంటు ఫ్యాక్టరీలు, టైల్స్ ఫ్యాక్టరీలు, గ్రానైట్స్ ఫ్యాక్టరీలు కూడా ఈ జిల్లాలో ప్రసిద్ధి గాంచాయి.

**1.1.6. నీటి పారుదల ప్రాజెక్టులు :** ఖమ్మం జిల్లాలో 4 మధ్యతరహా నీటి పారుదల ప్రాజెక్టులు ఉన్నాయి.

1. వైరా ప్రాజెక్టు : వైరా నదిపై నిర్మించిన ఈ ఆనకట్ట పొడవు 1,320 అడుగులు. ఇది వైరా గ్రామం మరియు మండలం దగ్గర ఉంది. దీని మూలంగా 17,396 ఎకరాల భూమికి సాగునీరు అందుతుంది.

2. పాలేరు ప్రాజెక్టు : ఇది ఒక మధ్యతరహా ప్రాజెక్టు. ఖమ్మం పట్టణానికి 30 కి.మీ. దూరంలో పాలేరు నదిపై కట్టబడింది. 1928లో 20.7 లక్షల రూపాయలతో కట్టబడింది. 1,09,694 ఎకరాలకు నీరు అందిస్తుంది. తర్వాత దీనిని నాగార్జునసాగర్ ఎడమ కాలువ బాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుతున్నారు.

3. లంకాసాగర్ ప్రాజెక్టు : పెనుబల్లి మండలం అడవిమల్లెల వద్ద కొత్తలేరుపై కట్టబడిన నీరు నిలువ రిజర్వాయర్. దీనిని 101 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించారు. దీని ఆయకట్టు 7,353 ఎకరాలు. అందులో 6,800 ఎకరాలకు ఇది జలవనరుగా ఉంది.

4. కిన్నెరసాని ప్రాజెక్టు : కిన్నెరసాని నదిపై పాల్వంచ మండలంలోని యానంబైలు వద్ద రిజర్వాయర్ నిర్మించారు. ఈ ప్రాజెక్టు వ్యవసాయ భూములకు, విద్యుత్ ఉత్పత్తికేకాక పాల్వంచ, కొత్తగూడెం పట్టణ ప్రజలకు తాగునీరు కూడా అందిస్తుంది.

5. ము(క్క)ఖమామిడి ప్రాజెక్టు : గోదావరి ఉపనది అయిన పాములేరుపై ముక్కమామిడి వద్ద 1981లో పూర్తి చేయబడింది. వ్యయం 113.93 లక్షల రూపాయలు. ఆయకట్టు 3,262 ఎకరాలు.

6. పెద్దవాగు ప్రాజెక్టు : ఇది అశ్వారావుపేట మండలం గుమ్మడిపల్లి వద్ద పెద్దవాగుపై కట్టారు. 1987లో 810 లక్షల వ్యయంతో పూర్తయిన ఈ ప్రాజెక్టు ఆయకట్టు

16,005 ఎకరాలు. అందులో 6,501 ఎకరాలు అభివృద్ధి చేసారు.

7. ఎల్.టి. బయ్యారం : మున్నేరు నదిలో కలిసే ఒక వాగుపై కట్టిన ప్రాజెక్టు ఇది. దీని ఆయకట్టు 6005 ఎకరాలు.

8. తాలిపేరు ప్రాజెక్టు : ఇది ఒక మధ్యతరహా నీటిపారుదల పథకం. ఇది తాలిపేరు నది మీద చర్ల మండలంలోని పెదమిడిసిలేరు గ్రామం వద్ద నిర్మించబడింది. ఇది సుమారు 24.710 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది.

ఖమ్మం జిల్లాకు 1982వ సంవత్సరం వరకు సరియైన సాగునీరు వసతి లేదు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా వున్న కాలంలో సాగర్ నీరు లభించింది.

**1.1.7. గిరిజన సంక్షేమం :** ఖమ్మం జిల్లాలో అధికశాతం గిరిజనులే ఉన్నారు. వీరి అభివృద్ధి కోసం "ప్రభుత్వ గిరిజన సమీకృత అభివృద్ధి సంస్థ" (ఐటిడిఏ) భద్రాచలంలో ఏర్పాటు చేయబడింది. దీని ద్వారా అనేక పథకాలు అమలు చేసి గిరిజనుల అభివృద్ధి చేస్తున్నారు. జిల్లాలో అధికశాతం నిరక్షరాస్యులు, గిరిజనులున్నారు. కావున వారిని అక్షరాస్యులను చేయటం కొరకు 25 ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాలు, 20 ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాలు, 20 ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాలు, 50 ఆశ్రమ బాలుర వసతి గృహాలు, 24 ఆశ్రమ బాలికల వసతి గృహాలు ఏర్పాటు చేశారు. ఈ వసతి గృహాల ద్వారా స్కూలు లేని చోట నుండి గిరిజనులు వచ్చి విద్యను అభ్యసిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్నారు.

ఇంకా ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల ద్వారా విద్యనభ్యసిస్తున్నారు. వీరికి స్కాలర్‌షిప్‌లను, స్టయిఫండ్ రూపంలో ఐటిడిఏ ద్వారా సహాయం అందుతుంది. వీటితో పాటు అనేక గిరిజన అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా గిరిజనుల అభివృద్ధి అంతంత మాత్రమే అనవచ్చు.

## 1.2. ఖమ్మం జిల్లా చరిత్ర (స్తంభాద్రి సంబరాలు ప్రత్యేక సంచిక, 2007: 1)

ఖమ్మం ప్రాంతాన్ని కీ.శ. 591వ సంవత్సరంలో మహాదేవ వర్మ అనే అధికారి పాలించాడు. ఇతను ఏ రాజుకు ప్రతినిధిగా వున్నాడో తెలియదు. మహాదేవ వర్మకు తొమ్మిదవతరం వాడైన మహాదేవ రాజు క్రీ.శ. 950వ సంవత్సరంలో

రాజ్యపాలన చేస్తూన్న సమయంలో ఓరుగల్లు నుండి రంగారెడ్డి, లక్ష్మారెడ్డి, వెల్మారెడ్డి అనే శూర శిఖామణులు తమకు లభించిన గుప్తధనంతో ఇక్కడికి వచ్చి ఖమ్మం మెట్టును ఆక్రమించి, ఖమ్మం పట్టణానికి నడిబొడ్డులో వున్న ఒక బ్రహ్మాండమైన రాయిపైన ఒక గొప్ప ఖిల్లా (దుర్గాన్ని)ని నిర్మించారు. అదే విధంగా ఈ జిల్లాకు దగ్గరలో ఒక పెద్ద చెరువును నిర్మించారు. దీనికి 'లకారం' చెరువు అని పేరు. ఈ చెరువు నేటికి మంచి స్థితిలో ఉండి, ఖమ్మం ప్రజలకు ఎన్నో విధాల తోడ్పడుతుంది. ఖమ్మం ఖిల్లా నిర్మాణం దాదాపు పది సంవత్సరాలు పట్టినట్లు, దాని చుట్టు గల బురుజులు విశాలమైన గోడలు ఈ కాలంలో పూర్తి చేసారు. ఈ ఖిల్లా ప్రవేశ మహోత్సవం క్రీ.శ. **1006**వ సంవత్సరంలో జరిగినట్లు చారిత్రకాధారాలున్నాయి.

ఈ రెడ్డి రాజులు దాదాపు **300** సంవత్సరాలు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. గజపతి రాజులు ఈ ప్రాంతంపై దండయాత్రలు చేసారు. నందపాణి, కాళ్ళూరు, గూడూరు అనే మూడు వంశాల వారు ఈ ప్రాంతాన్ని పాలించారు. ఆ తర్వాత ఈ ప్రాంతం కాకతీయ రాజుల వశమైంది. వారి కాలంలో ఈ ప్రాంతమంతా మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగొందింది. వారి పతనానంతరం 'షితాబుఖాను' అనే బిరుదున్న సీతాపతిరాజు ఈ ప్రాంతాన్ని దక్షతతో పాలించటమే కాకుండా కాకతీయ రాజ్య పాలకుల ఘనకీర్తిని దశదిశల వ్యాప్తి జేసారు. ఆ తర్వాత ఆంధ్ర మహావీరులని ప్రఖ్యాతిగాంచిన కాపానాయుడు, ప్రోలానాయుడు అనేవారు కాకతీయ రాజుల పట్ల ఉన్న ప్రభు భక్తితో ఆ రాజ్య కీర్తిని, ఆ రాజుల కీర్తిని దశదిశలా వ్యాపింపచేశారు. క్రీ.శ. **1512**వ సంవత్సరంలో గోల్కొండ సుల్తానులు ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారు. 'ఆసఫ్ జాహి' అనే నిజాం రాజు ఈ ప్రాంతాన్ని పాలించారు.

ఖమ్మం ఖిల్లాకి జాఫర్‌బేగ్ అనే అధికారిని నియమించారు. ఇతను క్రీ.శ. **1761-1808** వరకు పాలించాడు. అతని తర్వాత రెండవ జాఫరుద్దౌలా అనే ఒక మహాశూరుడు, క్రూరుడు, హింసా ప్రవృత్తి కలవాడు ఈ ప్రాంతానికి రాజుగా నియమింపబడ్డాడు. ఇతను తన దుష్ట ప్రవర్తనతో ధంసా అని పేరు పొందారు.

ధంసా అంటే ధ్వంసం చేయువాడు. అతని గుర్తుగా ఖమ్మం దగ్గరలో ధంసలాపురం అనే గ్రామాన్ని నిర్మించాడు. అది నేటికి ఆ పేరుతోనే పిలువబడుతుంది. క్రీ.శ. 1891వ సంవత్సరంలో నిజాం ప్రభువు ఈ ఖిల్లాని నవాబుషౌకత్ జంగ్ పూర్వీకులకు జాగీరుగా ఇచ్చాడు. హైదరాబాద్ రాష్ట్రంలో ఇండియా గవర్నమెంటు 14.9.1948వ సంవత్సరంలో పోలీసు చర్య జరిపిన తర్వాత జాగీర్దారీ విధానం రద్దు అయ్యే వరకు ఈ ప్రాంతం ఆ జాగీర్దారు ఆధీనంలో వుండేది.

### 1.2.1. ఖమ్మం చరిత్ర :

ఖమ్మానికి చారిత్రక ఆధారాలే కాకుండా పౌరాణిక ఆధారాలున్నాయి. "ఖమ్మం ప్రస్తావన మొట్టమొదట వరాహపురాణంలో కనిపిస్తున్నది. ఈ వరాహపురాణాన్ని వ్రాసిన కవి 'హరిభట్టు'. ఈయన 14, 15 శతాబ్దాల మధ్య కాలంలో జీవించి పేరుగాంచిన కవి. వరాహపురాణంలో దీనిని "స్తంభాద్రి పురము" అని పేర్కొన్నారు"(స్తంభాద్రి సంబరాలు ప్రత్యేక సంచిక 2007 : 3)

ఖమ్మానికి స్తంభాద్రి అనే పేరు రావటానికి కూడా ఒక కథ ఉన్నది. శ్రీ మహా విష్ణువు నరసింహావతారంలో హిరణ్యకశిపుడనే రాక్షసుణ్ణి సంహరించి ఆయన కుమారుడు విష్ణు భక్తి తత్పురుడయిన ప్రహ్లాదుడిని కాపాడిన సంగతి మనందరికి తెలిసిన కథే. అయితే ఆనాడు స్తంభం నుండి ఉద్భవించిన స్వామియే ఈ కొండపైన ఉన్న గుహలో వెలిసినాడట. అందుచేత ఈ కొండకు స్తంభాద్రి అనే పేరు వచ్చిందట. అంతేకాక ఈ కొండ స్తంభం ఆకారంలో ఉంటుంది కాబట్టి దీనికి స్తంభాద్రి అనే పేరు వచ్చిందట అని మరో వాదం ఉంది. ఈ నరసింహాలయం త్రేతాయుగం నాటిదని నమ్మకం.

ఖమ్మం నిజ నామం కమ్మం మెట్టు, కంబము మెట్టుగా పిలువబడింది. ఉర్దూ భాషలో 'కంబ' అంటే రాతి స్తంభం అని అర్థం. తర్వాత ఉచ్చారణ సౌలభ్యం కొరకు ఖమ్మం మెట్టుగాను, అదే విధంగా 1953వ సంవత్సరంలో ఖమ్మం మెట్టు జిల్లాను 'ఖమ్మం జిల్లా'గా గెజెటు ద్వారా మార్చారు.

ఈ విధమైన పౌరాణిక, చారిత్రకాధారాలున్న ఖమ్మం పట్టణాన్ని క్రీ.శ. 1512లో గోల్కొండ సుల్తాను వశపరుచుకున్నాడు. తర్వాత ఇది అసఫ్ జాహి

వంశస్థులు వశం అయింది. ఈ వంశంలో పేరుగాంచిన 'జాఫర్ బేగ్' క్రీ.శ. 1808 సంవత్సరాల వరకు అధికారిగా ఉండి ఖమ్మం పట్టణాన్ని పాలించాడు.

జిల్లా చరిత్ర సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పటంతో పాటుగా సుందరమైన ఈ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలకు ప్రాభవాన్ని చేకూర్చడమే లక్ష్యంగా 2005 నుండి ప్రతి సంవత్సరం జనవరి - మార్చి నెలల మధ్య 3 రోజుల స్తంభాద్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

### 1.2.2. ఖమ్మం జిల్లా పూర్వ చరిత్ర

ఖమ్మం జిల్లా వేరు వేరు కాలాలలో వివిధ విధాలుగా మార్పులకు గురి అయింది. క్రీ.శ. 1299కి పూర్వమే ఖమ్మం మెట్టు జిల్లాకు ప్రధాన కేంద్రంగా మిక్కిలి శోభతో వర్ధిల్లుతూ కీర్తి ప్రతిష్టలతో వర్ధిల్లింది. "గోల్కొండ సుల్తాను అబుల్‌హసన్ తానీషా కాలంలో గోల్కొండ రాజ్యాన్ని 21 సర్కాలుగాను, 356 పరగణాలుగాను విభజించారు. ఆ తర్వాత స్వాతంత్ర్యం ప్రకటించుకున్న ఆసఫ్‌జాని జాం ఉల్‌ముల్కు క్రీ.శ. 1867వ సంవత్సరంలో సాలార్‌జంగ్ మహామంత్రిగా వున్న సమయంలో ఈ నిజాం రాష్ట్రాన్ని 4 డివిజన్లుగా 17 జిల్లాలుగాను విభజించారు. అప్పటి తూర్పు డివిజన్‌లో ఖమ్మం మెట్టు జిల్లాగా ఉండేది. అయితే ఆనాడు వరంగల్లు జిల్లా ప్రసక్తి లేదు. అప్పుడు అది ఖమ్మం మెట్టు జిల్లాలో అంతర్భాగమైపోయింది. ఆ తర్వాత 1905వ సంవత్సరంలో జిల్లాల పునర్విభజన జరిగినపుడు వరంగల్, కరీంనగర్, ఆదిలాబాదు జిల్లాలతో కలిపి దానికి వరంగల్లును సుబాకేంద్రంగా చేసారు. అంతకు ముందున్న ఖమ్మం జిల్లాను వరంగల్లు జిల్లాతో కలిపి దానికి వరంగల్ జిల్లా అని పేరు పెట్టారు. ఖమ్మంలో వున్న జిల్లా కార్యాలయాన్నింటిని అక్కడికి తరలించారు. దాంతో అది జిల్లా స్థాయిని కోలుపోయి తాలూకా కేంద్రమైంది.

### 1.2.3. నేటి ఖమ్మం జిల్లా ఏర్పాటు (నిర్మాణం):

ప్రభుత్వ పరిపాలనా సౌలభ్యం కొరకు అక్టోబరు 1, 1953న, అప్పటి వరకు వరంగల్లు జిల్లాలో ఉన్న ఖమ్మం, మధిర, ఇల్లందు, బూర్గంపాడు, పాల్వంచ తాలూకాలను విడదీసి ఖమ్మం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేసారు. ఆ తర్వాత

నవంబరు 1, 1956న ఆంధ్రప్రదేశ్ అవతరించింది. 1959వ సంవత్సరంలో అప్పటి వరకు తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న భద్రాచలం, వెంకటాపురం(నూగూరు) తాలూకాలను ఖమ్మం జిల్లాలో కలిపారు. ఇవి రెండు ఏజెన్సీ జిల్లాలు. ఖమ్మం, మధిర, ఇల్లందు, పాల్వంచ, బూర్గంపాడు, భద్రాచలం, వెంకటాపురం(నూగూరు) తాలుకాలతో ఖమ్మం జిల్లా ఏర్పాటు చేశారు. మధిర తాలుకా సువిశాలం కావటంతో, దానిలో నుండి సత్తుపల్లి ప్రాంతాన్ని తాలుకాగా ఏర్పాటు చేశారు.

మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ యన్.టి. రామారావుగారి కాలంలో జిల్లాలో వున్న తాలూకా కేంద్రాలన్నింటిని మార్చి 1985వ సంవత్సరంలో 46 మండలాలుగా విభజించారు. తాలుకా వ్యవస్థ పూర్తిగా మారిపోయి, మండలాల పేరుతో పరిపాలన సాగుతోంది.

"ఖమ్మం జిల్లాకు ఖమ్మం ప్రధాన కేంద్రం. 7 మున్సిపాలిటీలు (ఖమ్మం, కొత్తగూడెం, ఇల్లందు, పాల్వంచ, సత్తుపల్లి, మణుగూరు, భద్రాచలం, 9 పట్టణాలు (7 మున్సిపాలిటీలతో కలిపి అశ్వారావుపేట, మధిర) ఉన్నాయి. ఖమ్మం కార్పోరేషన్ అయ్యే అవకాశం ఉంది. దీనికి కావలసిన ప్రభుత్వ ఉత్తర్వులు అందిందట. ఖమ్మం జిల్లాలో ఉన్న 46 మండలాల్లో 29 మండలాలు పూర్తి గిరిజన మండలాలు, 2 గిరిజనులున్న మండలాలున్నాయి. అదే విధంగా 770 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 18 మేజరు గ్రామ పంచాయతీలు, 752 మైనరు గ్రామ పంచాయతీలున్నాయి. ఈ జిల్లాలో 1242 గ్రామాలున్నాయి"(ఖమ్మం జిల్లా హ్యాండ్ బుక్, 2009 : II). "ఇందులో 894 షెడ్యూల్ గ్రామాలు, 348 నాన్ షెడ్యూలు గ్రామాలున్నాయి"(గిరిజన సంఘం 'సావనీరు' 2010 : 44) అదే విధంగా "నాబార్డు సర్వే ప్రకారం"(గిరిజన సంఘం 'సావనీరు' 2010 : 44) ఖమ్మం జిల్లాలో 500-750 జనాభా కలిగిన తండాలు 36, 750-1000 జనాభా కలిగిన తండాలు 119, 1000పైన జనాభా వున్న తండాలు 127 కలిసి మొత్తం 291 తండాలున్నాయి. కాని గిరిజన సంక్షేమశాఖ 321 తండాలను, పంచాయతీరాజ్‌శాఖ 111 తండాలను గుర్తించింది. కావున 500 మంది కంటే ఎక్కువగా నివాసం వున్న తండాలు 321ఉంటే, 500 మంది కన్న తక్కువ జనాభా వున్న తండాలు దాదాపు 500 తండాలకు పైన ఉంటుందని అంచనా. ఈ అంచనా

ప్రకారం ఖమ్మం జిల్లాలో 800 పైచిలుకు గిరిజన తండాలు ఉండే ఉంటాయి.

అదేవిధంగా 2008 పునర్ వ్యవస్తీకరణ తర్వాత ఖమ్మం జిల్లాలో 10 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అవి 110 పినపాక, 111 ఇల్లందు, 112 ఖమ్మం, 113 పాలేరు, 114 మధిర, 115 వైరా, 116 సత్తుపల్లి, 117 కొత్తగూడెం, 118 అశ్వారావుపేట, 119 భద్రాచలం, ఒక లోక్‌సభ నియోజకవర్గం కలదు. అది ఖమ్మం. ఇంతకుముందున్న భద్రాచలం 2008 తర్వాత మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కలిసింది.

### 1.2.4. చారిత్రక, పర్యాటక ప్రదేశాలు :

ఖమ్మం జిల్లా చారిత్రాత్మకమైన జిల్లా. ఇందులో త్రేతాయుగంలో నిర్మించిన నరసింహస్వామి ఆలయం వుంది. పురాణంలో రామాయణంలో కొన్ని ఘట్టాలు ఇక్కడే జరిగాయి. కాకతీయుల కాలం నాటి ఆలయాలు నవాబుల కాలం నాటి కోట(ఖిల్లా), శ్రీరామ మందిరం, పర్ణశాల, బౌద్ధస్థూపాలున్నాయి. పాపికొండలు, కిన్నెరసాని నది, వైరా చెరువు, గోదావరి నది, మున్నేరు నదులున్నాయి. ఇల్లందు, కొత్తగూడెం, గార్ల, శ్రీరామగిరి, జమలాపురం, అన్నపురెడ్డిపల్లి, కల్లూరు, శ్రీ భక్తరామదాసు స్మారక మందిరం మొదలైన చారిత్రాత్మక గ్రామాలున్నాయి.

1. ఖమ్మంఖిల్లా, 2. నేలకొండపల్లి, 3.పర్ణశాల, 4.భద్రాచలం, 5.గోదావరి, 6.మున్నేరు, 7.పాపికొండలు, 8.కిన్నెరసాని ప్రాజెక్టు, 9.వైరా, 10. ఇల్లందు, 11.కొత్తగూడెం, 12. గార్ల, 13. శ్రీరామగిరి, 14. జమలాపురం, 15. అన్నపురెడ్డిపల్లి, 16. కూసుమంచి, 17. కల్లూరు, 18. శ్రీభక్తరామదాసు స్మారక మందిరం మొదలైన చారిత్రక, పర్యాటక ప్రదేశాల గురించి తెలుసుకుందాం.

### 1. ఖమ్మం ఖిల్లా :

ఖమ్మం పట్టణంలోని నడిబొడ్డున ఒక పెద్ద కొండ (రాయి)పై నిర్మించబడింది. ఖిల్లా అనేది ఉర్దూపదం. దీనికి కోట, దుర్గం అని అర్థం. ఖమ్మం ఒకప్పుడు నైజాం నవాబుల కాలంలో పాలింపబడింది. ఉర్దూ అధికార భాష అవటంచే ఖిల్లా అనే పేరు వచ్చింది. రెడ్డిరాజుల పాలనలో దీనికి గిరి దుర్గం అని పేరు.

క్రీ.శ. 950 ప్రాంతంలో మహాదేవరాజు ఖమ్మం ప్రాంతాన్ని పాలిస్తున్న కాలంలో ఓరుగల్లుకు చెందిన రెడ్డి సోదరులు ముగ్గురు (లక్ష్మారెడ్డి, రంగారెడ్డి, వెలమారెడ్డి) ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారు. తర్వాత ఈ ఖిల్లాను (దుర్గాన్ని) నిర్మించారు. ఈ దుర్గా నిర్మాణానికి పది సంవత్సరాలు పట్టింది. "క్రీ.శ. 1006లో వీరు, దుర్గ ప్రవేశం చేసారు" (స్తంభాద్రి సంబరాలు ప్రత్యేక సంచిక 2008 : 5).

మొదట రెడ్డి వంశానికి చెందిన రాజులు ఈ ఖిల్లాను 300 సంవత్సరాలు పాలించారు. తర్వాత నందపాణి, కాళ్ళూరు, గుడ్లూరు వంశాల వారు దీనిపై ఆదిపత్యం వహించారు. ముసునూరు కాపయ నాయకుడైన చెలికాని భూపతి అనేవాడు కొంతకాలం దీన్ని పరిపాలించాడు. "తర్వాత కుతుబ్ షాహీ వంశస్తులు (1531) కూడా ఈ కోటను మెరుగు పర్చటంలో ప్రశంసనీయమైన పాత్ర పోషించారు" (వికిపీడియా ఖమ్మంజిల్లా వ్యాసము).

ఈ కోట సుమారు 300 అడుగుల ఎత్తున కట్టబడింది. ఇది ఆక్రమించి ఉన్న స్థల వైశాల్యం 1 $^{1}/_{8}$ చదరపు మైళ్ళు. దీని చుట్టూ పెద్ద పెద్ద పెద్ద రాళ్ళతో నిర్మించబడిన ప్రహరీగోడ ఉంది. దీని ఎత్తు 40-80 అడుగులు. వెడల్పు దాదాపు 15 నుంచి 20 అడుగులు. ప్రతి బురుజు యొక్క పై భాగం విశాలంగా ఉంటుంది. అక్కడి నుండి లోపలికి దిగటానికి మెట్లు కూడ కట్టబడి ఉన్నాయి. ప్రతి బురుజుపైన రెండు ఫిరంగులు, ఒక నీటి కుండ పెట్టేవాళ్ళట. యుద్ధ సమయాలలో ఈ కుండలను నీటితో నింపేవారట.

ఈ ఖిల్లాకు రెండు ముఖ ద్వారాలున్నాయి. లోపల ఉన్న సింహద్వారం 30 అడుగులు ఎత్తుతో నిర్మించబడింది. ఖిల్లాలో ఒక పెద్ద దిగుడుబావి ఉంది. దీని పొడవు 80 అడుగులు. వెడల్పు 20 అడుగులు. ఖిల్లాలో కనిపించే ఫిరంగులపై "రజ్‌నవాబ్ రుకుముద్దౌలా" అని "జఫరుద్దౌలా" అని పేర్లు రాయబడి ఉండేదట.

15వ శతాబ్దంలో సీతాపతిరాజు అనే వీరుడు ఈ కోటకు రాజైనాడు. ఇతనికి 'షితాబ్‌ఖాన్' అనే బిరుదు ఉండేది. "శ్రీకృష్ణదేవరాయలు ఈ కంబము మెట్టు గిరి దుర్గముపై దాడి చేయగా, సీతాపతిరాజు అతనిని ధైర్యముగా ఎదుర్కొన్నట్లు "షితాబ్‌ఖాన్" శాసనము"(స్తంభాద్రి సంబరాలు ప్రత్యేక సంచిక 2008 : 7) ద్వారా తెలుస్తుంది. క్రీ.శ. 1526లో గోల్కొండ సుల్తాను కూలీకుతుబ్‌షా

ఈ కోటను వశపరుచుకున్నాడు. 1948 వరకు ఈ ఖిల్లా జాగీర్దార్ల ఆధిపత్యంలోనే ఉండేది.

పూర్వం ఈ ఖిల్లాకి దారి లేదు. ఇప్పుడు మెట్లు ఉన్నాయి. విద్యుద్దీపాలున్నాయి. పైకి వెళితే ఎంతో హాయిగా ఉంటుంది. స్తంభాద్రి సంబరాలు జరిగే మూడు రోజులు ప్రత్యేకంగా విద్యుదీపాలంకరణ చేస్తారు. భవిష్యత్తులో పర్యాటకులకు ఎంతో సంతోషాన్ని కలిగించాలని ఆశిద్దాం.

**2. నేలకొండపల్లి :**

నేలకొండపల్లి గ్రామం గొప్ప చారిత్రక స్థలం. మహా భారతంతో ముడిపడ్డ కథలొక వైపు, బౌద్ధ అవశేషాల తాలూకు చారిత్రక వాస్తవాలు మరొక వైపు ఈ ప్రాంతానికి ప్రాముఖ్యత నిస్తున్నాయి. నేలకొండపల్లికి ఒక మైలు దూరంలో విరాటరాజు దిబ్బ, కీచకగుండం అనే స్థలాలు మహాభారత కథతో సంబంధం కలిగి ఉన్నాయి.

పాండవులు అజ్ఞాతవాస సమయంలో విరాట నగరాన్ని పాలించే విరాట రాజు కొలువులో మారువేషాల్లో చేరారు. విరాటరాజు బావ మరిది కీచకుడు సైరంధ్రి వేషంలో ఉన్న ద్రౌపదిని కామించగా, వలలుడి వేషంలో ఉన్న భీముడు కీచకుణ్ణి చంపేసాడు. ఆ విరాటనగరం ఈ ప్రాంతమేనని పౌరాణిక గాధ.

"మహాభారత కథలో అందరికి తెలిసిన ఉత్తర గ్రోగహణ సన్నివేశం ఈ గ్రామం చుట్టుప్రక్కల జరిగింది. దీనికి సమీపంలో బాణాపురం అనే గ్రామం వెలుపల ఉన్న జమ్మిచెట్టు మీదనే అర్జునుడు వారి ఆయుధాలను దాచి వుంచినట్లు" (టి.నరసింహారావు వ॥ 70) పెద్దవాళ్ళు చెబుతుంటారు. అలాగే సమీపంలోని 'గోకినేపల్లి' అనే గ్రామం ఉన్న దగ్గరే గోగ్రహణ యుద్ధంలో అర్జునుడు ఒంటరిగా కౌరవులను ఓడించాడట. అందుకే దాని పేరు 'గోవులను కాచిన పల్లె' కాలక్రమంలో అది గోకినపల్లిగా మారిందట. మహాభారతం కథ జరిగిందని చెప్పబడుతున్న కాలం నాటి అవశేషాలు ఇక్కడ దొరకటం విశేషం.

"క్రీ.శ. 2.3, శతాబ్దాలలో నేలకొండపల్లి - ముజ్జుగూడెం గ్రామాల మధ్య భూగిరిపురం అనే పట్టణం ఉండేది. కాలక్రమంలో ఈ గ్రామం బౌద్ధమత ప్రచారకులకు స్థావరంగా భాసిల్లింది. వాళ్ళు ఇక్కడ నిర్మించిన బౌద్ధస్థూపం

ప్రసిద్ధి చెందింది''(స్తంభాద్రి సంబరాలు ప్రత్యేక సంచిక 2007 : 5) 1977 సంవత్సరంలో పురాతత్వ శాఖ వారు జరిపిన తవ్వకాల్లో బౌద్ధ అవశేషాలు, స్థూపాలు, విగ్రహాలు దొరకటంతో ఈ ప్రాంతంలో బౌద్ధం విలసిల్లిందని రూఢీ అయింది.

ఇటీవల చరిత్రకు వస్తే భక్త రామదాసుగా ప్రసిద్ధిగాంచిన కంచర్ల గోపన్న నేలకొండపల్లిలో జన్మించాడు. ఆయన పుట్టిన ఇంటిని శ్రీ భక్తరామదాసు ధాన్య (స్మారక) మందిరంగా పిలుస్తున్నారు. గ్రామంలో పురాతన దేవాలయాలు కూడా ఉన్నాయి. చారిత్రకంగా ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరాలయం, భీమేశ్వరాలయం, వేణుగోపాల స్వామి ఆలయం, ఉత్తరేశ్వర ఆలయం ఇక్కడ ఉన్నాయి. వీటిని కనీసం 400 సంవత్సరాల క్రితం నిర్మించారని ప్రతీతి వుంది.

**3. పర్ణశాల :**

పర్ణశాల ఖమ్మం జిల్లా భద్రాచలం మండలానికి చెందిన గ్రామం. ఖమ్మం జిల్లాలో భద్రాచలానికి 32 కి.మీల దూరంలో ఉంది. హిందువుల ఆధ్యాత్మిక గ్రంథం రామాయణంలో పర్ణశాల ప్రసక్తి కలదు. శ్రీరాముడు వనవాసానికి వెళ్ళినపుడు ఇక్కడ నివసించినట్లు ప్రతీతి. వాగు వద్ద సీత స్నానం చేసిన తర్వాత ఇక్కడి రథం గుట్టపై చీరలు ఆరవేయగా దానిపై ఆ చీరల ఆనవాళ్ళు ఏర్పడినవని ఒక కథనం. ఈ ఆనవాళ్ళు పర్ణశాలలో ఒక యాత్రా విశేషం. రాముడు బంగారు లేడి రూపంలో వచ్చిన మారీచుని ఇక్కడే చంపాడు. అప్పుడు రావణాసురుడు సీతను అపహరించగా నేలపై ఒక గుంట ఏర్పడింది. పర్ణశాలలో ఉన్న గుంట ఈ కారణంగా ఏర్పడినదే అని ప్రతీతి ఉంది. ఇక్కడ సీతవాగు, శూర్పనఖ చెట్టు, లక్ష్మణ గుట్ట చూడదగినవి. ఈ ప్రాంతాన్ని పర్యాటక శాఖ వారు అందంగా అభివృద్ధి చేసారు. దేశ నలుమూలల నుండి యాత్రీకులు, పర్యాటకులు వచ్చి సందర్శిస్తున్నారు.

**4. భద్రాచలం :**

భద్రాచలం లేదా శ్రీరామ దివ్యక్షేత్రం ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లాలో, గోదావరి నది దక్షిణ తీరాన ఉన్న ఒక పట్టణం. భద్రాచలం మండలానికి ఈ పట్టణం కేంద్రం. జిల్లా కేంద్రమైన ఖమ్మం పట్టణానికి 105 కిలో మీటర్ల దూరంలో

ఉన్న ఈ పట్టణం, భక్త రామదాసు నిర్మించిన రామాలయానికి ప్రసిద్ధి చెందింది. జిల్లాలోని ప్రముఖ పారిశ్రామిక కేంద్రాలైన పాల్వంచ 27 కిలో మీటర్ల, మణుగూరు 35 కిలో మీటర్ల, కొత్తగూడెం 35 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి.

భద్రాచలం రెవిన్యూ డివిజను మొదట తూర్పు గోదావరి జిల్లాలో భాగంగా ఉండేది. ఆంధ్ర, హైదరాబాదు రాష్ట్రాలు విలీనమై కొత్తగా ఖమ్మం జిల్లాను ఏర్పాటు చేసే సమయంలో ఖమ్మం జిల్లాలో దీనిని విలీనం చేసారు. తెలంగాణ ఉద్యమం తీవ్రంగా ఉన్న ఈ రోజులలో ఇది వివాదాస్పదం అయ్యే సూచనలు ఉన్నాయి.

భద్రాచలంలోని రామాలయం చారిత్రాత్మకమైంది. దీనికి దగ్గరలో కిన్నెరసాని డ్యాము, పర్ణశాల, పాపికొండలు పర్యాటక ప్రదేశాలుగా ఉన్నాయి. ప్రభుత్వ సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ యొక్క ప్రధాన కార్యాలయం ఐ.టి.డి.ఏ. (I.T.D.A.) భద్రాచలంలోనే ఉంది. భద్రాచలం శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సహితుడై తిరుగాడిన దండకారణ్య ప్రాంతం ఇది. అయోధ్యలో తండ్రి ఆజ్ఞ మేరకు వనవాసానికి బయలుదేరిన శ్రీరామచంద్రుడు ఇక్కడ రాక్షసుల చేత బాధించబడుతున్న ఋషులను సంరక్షించడానికి ఈ దండకారణ్యంలో నివాసం ఏర్పరుచుకున్నాడు. ఖరుడు, దూషణుడు, కబంధుడు, విరాధుడు మొదలైన కొన్నివేల మంది రాక్షసులను సంహరించి మహా ఋషులకు అభయ ప్రధానంగావించాడు. ఈ దండకారణ్య ప్రాంతం రావణాసురుడు తన చెల్లెలైన శూర్పణకు అరణం ఇచ్చిన ప్రాంతమట.

తర్వాత కాలంలో మేరువు, మేనకలకు జన్మించిన భద్రుడు అనే వాడు శ్రీరామ భక్తుడుగా ప్రసిద్ధిగాంచాడు. ఆయన శ్రీరామ దర్శనం కోసం తపిస్తూ ఈ ప్రాంతంలో తపస్సు చేశాడు. అతని కోరికను మన్నించి శ్రీరామచంద్రుడు అతనిని ఆద్రిగా (పర్వత) రూపం ధరించినచో తాను సీతాలక్ష్మణ సహితుడై నిలుస్తానని అభయమిచ్చాడు. భద్రుడు పర్వత రూపము ధరించగా శ్రీరామచంద్రుడు వ్యత్యస్త శంఖ చక్రధారుడై అంటే శంఖ చక్రాలను కుడి ఎడమల తేడాతో ధరించి శిలా రూపంలో వెలిసి భక్తులందరి కోరికలు తీరుస్తూ వారి సేవలు అందుకుంటున్నారు. భద్రుడు శిలారూపంలో అవతరించి, తన మూపున

సీతారామలక్ష్మణులను ధరించాడు. కావున ఈ క్షేత్రానికి భద్రాచలం అనే పేరు వచ్చింది.

**భద్రాచలం - రామాలయ ప్రశస్తి :**

పూర్వం భద్రుడు అను భక్తుడు శ్రీరాముడికి తపస్సు చేసి, తను ఒక కొండగా మారి తనపై శ్రీరాముడు వెలిసే విధంగా వరం పొందాడు అని అంటుంటారు. ఆ కొండ భద్రుడు పేరు మీద భద్రగిరి అని తర్వాత కాలంలో భద్రాచలం అని పేరు ఆ పట్టణానికి స్థిర పడింది. దీనినే భద్రాద్రి, రామాలయం అని కూడా అంటారు. ఇది ఖమ్మం పట్టణానికి 120 కిలో మీటర్ల దూరంలో ఉంది. భద్రాచలం పేరు రావటానికి శ్రీ టి.నరసింహారావు ఒక ఐతిహ్యాన్ని వివరించాడు. గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానీషా పాలనా కాలంలో భద్రాచల ప్రాంతానికి తహశీల్దారుగా కంచెర్ల గోపన్న ఉండేవాడు. ఖమ్మం పట్టణం సమీపంలోని నేలకొండపల్లి గ్రామానికి చెందిన గోపన్న శ్రీరామ భక్తుడు. తాను ప్రజల నుండి వసూలు చేసిన పన్ను (6 లక్షల రూపాయలు) సొమ్మును ప్రభుత్వానికి జమ చెయ్యకుండా, భద్రగిరిపై శ్రీరాముడు వెలసిన ప్రదేశమందు ఈ రామాలయాన్ని నిర్మించారు. దేవునికి రకరకాల నగలు, చింతాకుపతకం, పచ్చలపతకం మొదలైనవి చేయించారు. ఆ సొమ్ము విషయంలో తానీషా గోపన్నను గోల్కొండ కోటలో బంధించగా, ఆ చెరసాల నుండి తనను విముక్తి చెయ్యమని రాముణ్ణి ప్రార్థించాడు. ఆ సందర్భంలో రామునిపై పాటలు రచించి తానే పాడాడు. ఇవే రామదాసు కీర్తనలుగా ప్రసిద్ధి చెందాయి. గోపన్న కీర్తనలకు కరిగిపోయిన రాముడు, దేవాలయ నిర్మాణానికి ఉపయోగించిన ప్రభుత్వ సొమ్మును తానీషాకు చెల్లించి, గోపన్నకు చెరసాల నుండి విముక్తి ప్రసాదించాడని ఐతిహ్యం. ఆ విధంగా కంచెర్ల గోపన్నకు రామదాసు అనే పేరు వచ్చింది.

దేవాలయమందు సీతా, లక్ష్మణ, హనుమంత సమేతంగా శ్రీరామచంద్రుడు ఇక్కడ ఆత్మారాముని రూపంలో కొలువుతీరి ఉన్నాడు. సీత, రాముని తొడపై కూర్చొని ఉన్నట్లు ఇక్కడి విగ్రహాలు చెక్కబడి ఉన్నాయి. మరే దేవస్థానంలోనూ లేని ప్రత్యేకత ఇది. ప్రతి సంవత్సరం శ్రీరామనవమికి వైభవంగా జరిగే సీతారామ కళ్యాణ ఉత్సవానికి అశేష ప్రజానీకం వస్తారు. రాష్ట్ర ప్రభుత్వం

ఈ కళ్యాణోత్సవానికి ముత్యపు తలంబ్రాలు, పట్టు వస్త్రాలు పంపించటం సాంప్రదాయం. ప్రతి 60 సంవత్సరాలకు ఒకసారి, ఇక్కడ శ్రీరామ పట్టాభిషేకం జరుగుతుంది. రామదాసు చేయించిన వివిధ రకాల నగలు దేవస్థానపు ప్రదర్శనశాలలో ప్రదర్శనకు ఉంచారు.

భద్రాచలంలోని శ్రీరాముడిని వైకుంఠ రాముడు అని అంటారు. ఎందుకంటే ఇక్కడి రాముడు వైకుంఠానికి వెళ్ళిన తర్వాత మళ్ళీ భూమి మీదకి వచ్చి తన భక్తుడైన భద్రుడి కోరిక తీర్చి భద్రపర్వంపై నిలిచాడు. వృద్ధులు, వికలాంగులు ఈ ఆలయానికి చేరటానికి లిఫ్ట్ సౌకర్యం కలదు. దక్షిణ మెట్లవైపు నుంచి లిఫ్ట్ ఆలయం గోపురం ముందుకు చేరుస్తుంది.

గోదావరి నది  పక్కనే భద్రాచలం ఉండటంతో రాజమండ్రి నుండి ప్రతిరోజు లాంచీ ద్వారా రాకపోకలు సాగుతూ ఉంటాయి. ఈ మార్గంలోనే పాపికొండలు కానవస్తాయి. భద్రాచలం కేంద్రంగా జరిగే విహారయాత్రల్లో ఈ జలమార్గం ప్రముఖమైంది. అదే పర్యాటకమైంది.

భద్రాచలం పట్టణం పేరును 2002లో శ్రీరామ దివ్యక్షేత్రం పట్టణంగా మార్చారు. ఈ మండలంలోని జనాభాలో మూడోవంతు గిరిజనులు వ్యవసాయ ఆర్థిక వనరు. ప్రతీ వర్షాకాలంలోను గోదావరికి వరదలు వచ్చి భద్రాచలం పట్టణపు పల్లపు ప్రాంతాలు జలమయం కావటం సర్వసాధారణంగా ఉండేది. పట్టణ అభివృద్ధిలో భాగంగా నదికి వరద కట్టను  నిర్మించిన తర్వాత ఈ బెడద బాగా తగ్గింది.

## 5. గోదావరి నది :

గోదావరి నది భారతదేశంలో గంగ, సింధు తర్వాత అతి పెద్దనది. ఇది మహారాష్ట్రలోని నాసిక్ దగ్గరలోని త్రయంబకంలో, అరేబియా సముద్రానికి 80కిలో మీటర్ల దూరంలో పుట్టి దక్షిణ మధ్య భారత దేశం గుండా ప్రవహించి ఆంధ్రప్రదేశ్‌లోనికి ప్రవేశిస్తుంది.  ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, తూర్పుగోదావరి మరియు  పశ్చిమ గోదావరి జిల్లాల గుండా ప్రవహించి బంగాళాఖాతంలో సంగమిస్తుంది. ఈ నది ఒడ్డున చాలా ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలు మరియు పట్టణాలు కలవు. భద్రాచలం, రాజమండ్రి వంటి ధవళేశ్వరం దగ్గర

అఖండ గోదావరి (గౌతమి) ఏడు పాయలుగా చీలుతుంది. అవి గౌతమి, వశిష్ఠ, వైనతేయ, ఆత్రేయ, భరద్వాజ, తుల్యభాగ మరియు కశ్యప. ఇందులో గౌతమి, వశిష్ట, వైనతేయలు మాత్రమే ప్రవహించే నదులు. మిగిలినవి అంతర్వాహిని (Conceal )లు. ఆ పాయలు సప్తర్షులు పేర్ల మీద పిలువబడుతున్నాయి.

**గోదావరి నది ఇతిహాసం :** పూర్వం బలి చక్రవర్తిని శిక్షించేందుకు శ్రీ మహా విష్ణువు వామనావతారం ఎత్తి మూడడుగుల స్థలం కావాలని అడుగగా బలి చక్రవర్తి మూడడుగులు ధారపోసాడు. మహావిష్ణువు ఒక అడుగు భూమిపైన, రెండో అడుగు ఆకాశంపైన, మూడో అడుగు బలితలపై పెట్టి పాతాళంలోకి తొక్కి వేస్తాడు. భూమండలం కనిపించకుండా ఒక పాదం మాత్రమే కనిపించడంతో చతుర్ముఖ బ్రహ్మ కమండలంలోని నీటిలో సమస్త తీర్థాలను ఆవాహన చేసి ఆ ఉదకంతో శ్రీ మహావిష్ణువు పాదాలను అభిషేకించి, మహా విష్ణువును శాంతింపజేస్తాడు. అందువల్లనే గంగను విష్ణు పాదోద్భవి గంగా అని పిలుస్తారు. అలా పడిన గంగ పరవళ్ళు తొక్కుకుంటే శివుడు తన జటాజూటంలో బంధిస్తాడు. పరమశివుని మెప్పించి భగీరథుడు తన పితామహులకు సద్గితులను కలగజేయడానికి గంగను, గోహత్యాపాతక నివృత్తి కోసం గౌతమ మహర్షి గోదావరిని భూమికి తీసుకొని వస్తారు.

**గౌతముడు గోష్పాదక్షేత్రం :** ఒకానొకప్పుడు దేశంలో క్షామం ఏర్పడి కరువుతో తినడానికి తిండి లేకుండా ఉన్న సమయంలో గౌతమ మహర్షి తన తపోశక్తితో తోటి ఋషులకు, వారి శిష్యులకు కరువు నుండి విముక్తి కలిగించి అన్న పానాలు దొరికే ఏర్పాటు చేశాడు. అప్పుడు ఆ ఋషులు తమకు లేని తపోశక్తులు గౌతమునికి ఉన్నాయని ఈర్ష్యతో ఒక మాయ గోవును పంపి గౌతముడి పాడి పంటలు నాశనం చేయించారు. గౌతముడు ఒక దర్భ(కర్ర)తో ఆ గోవును అదలించగా అది మరణించింది. గౌతముడు తాను చేసిన గోహత్యాపాతకం నివృత్తికోసం శివుడిని మెప్పించి గంగను భూమి మీదకు తెప్పించాడు. ఆ గంగయే గోదావరి లేదా గౌతమి నది. ఈ నదిని ఆ చనిపోయిన గోవు మీద నుండి ప్రవహింపచేసి తన గోహత్యాపాతకాన్ని విముక్తి చేసుకున్నాడు. ఆ గోవుకి స్వర్గప్రాప్తి కలిగింది. ఆ స్థలమే గోష్పాద క్షేత్రం. ఈ క్షేత్రమే ఇప్పుడు పశ్చిమ గోదావరి జిల్లాలోని కొవ్వూరు పట్టణం.

గోదావరి నది యొక్క పరివాహక ప్రాంతం 3, 13,000 చదరపు కిలో మీటర్ల మేర మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మధ్యప్రదేశ్, చత్తీస్‌గడ్, మరియు ఒరిస్సా రాష్ట్రాలలో వ్యాపించి ఉంది. ఖమ్మం జిల్లాలో టేకులగూడెం (వాజేడు మండలం) దగ్గర ప్రవేశించి 180 కిలో మీటర్లు ప్రవహించి శబరి, కిన్నెరసాని, మానేరు, తాలిపేరు, ఆకేరు, వైరా నదులను తనలో కలుపుకొని పాపికొండలు దగ్గర ముగుస్తుంది. ఖమ్మం జిల్లాలో ఈ నది తీరంలో భద్రాచలం పట్టణం, భద్రాద్రి శ్రీరామాలయ పుణ్యక్షేత్రం, పర్ణశాల పుణ్యక్షేత్రం, పాపికొండలు పర్యాటక కేంద్రాలు వెలిసాయి.

**6 మున్నేరు :**

మున్నేరు కృష్ణానదికి ఉపనది. మున్నేరు ఖమ్మం, నల్గొండ జిల్లాల గుండా ప్రవహించి, పులిచింతలకు దిగువన కృష్ణానదిలో కలుస్తుంది. మున్నేరును ఆనుకొని పెనుగంచిప్రోలు పక్కన ప్రసిద్ధిగాంచిన శ్రీ గోపయ్య సమేత లక్ష్మి తిరుపతమ్మ అమ్మ వారి దేవాలయం ఉంది.

**7 పాపికొండలు :**

గోదావరి ఇరువైపులా 5 కిలో మీటర్ల విస్తీర్ణంలో ఏడు వరుసల కొండలనే పాపికొండలు అంటారు. ఈ పాపికొండలు తూర్పు కనుమలలోని ఒక శ్రేణి. ఇవి ఖమ్మం జిల్లా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల నడుమ ఆనుకొని ఉన్నాయి. ప్రశాంతమైన, సుందరమైన, రమణీయమైన, ఆహ్లాదకరమైన ప్రదేశం. ఇక్కడి కొండలూ, జల పాతాలూ గ్రామీణ వాతావరణం. దీనిని 'ఆంధ్రా కాశ్మీరం' అని పిలుస్తారు. భద్రాచలం వద్ద మునివాటం అను ప్రదేశం దగ్గర జలపాతం ఉంది. ఇక్కడే ఒక శివలింగం సర్పం నీడలో అద్భుతంగా ఉంటుంది. ఇక్కడే ప్రకృతి అందాల నెలవు పేరంటాలపల్లి కూడా వుంది. గిరిజనుల కొయ్య బొమ్మలకు ఇది నెలవు.

పాపికొండలు వద్ద గోదావరి చాలా తక్కువ వెడల్పుతో రెండు కొండల మధ్య ప్రవహిస్తూ ఆ వాతావరణంకు మరింత రమణీయతను తెచ్చి పెడుతుంది. రాజమండ్రి నుండి ఇక్కడికి చేసే లాంచీ ప్రయాణం పర్యాటకులకు మర్చిపోలేని అనుభవం పాపికొండల వెనుక భాగానికి కొయ్యలగూడెం, కన్నాపురం, పోలవరం

ప్రాజెక్టు వలన పోలవరం నుండి ఘాట్ రోడ్డు మార్గం కనుమరుగు అవ్వబోతుంది.

**8. కిన్నెరసాని ప్రాజెక్టు :**

కిన్నెరసాని నదిపై పాల్వంచ మండలంలోని యానంబైలు గ్రామం వద్ద విద్యుత్ ఉత్పాదనకై మరియు కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రానికి నీరందించేందుకు కిన్నెరసాని ప్రాజెక్టు నిల్వ రిజర్వాయర్‌ను నిర్మించారు. 1972లో నిర్మాణం పూర్తి చేస్తున్న ఈ ప్రాజెక్టుకు 558 లక్షల వ్యయమైంది. 1998 ఏప్రిల్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈ ప్రాజెక్టును విద్యుచ్ఛక్తి శాఖకు బదిలీ చేసింది. ఈ ప్రాజెక్టు వ్యవసాయ భూములకు, విద్యుత్ ఉత్పత్తికే కాక పాల్వంచ, కొత్తగూడెం పట్టణ ప్రజలకు త్రాగునీరు కూడా అందిస్తుంది. ఈ ప్రాజెక్టు దగ్గరా జింకల పార్కు కూడా ఏర్పాటు చేయబడింది. ఈ ప్రాజెక్టు అన్ని గేట్లు ఎత్తినపుడు చాలా అందంగా, చూడ ముచ్చటగా ఉంటుంది.

**9. వైరా :**

వైరాలో వైరా చెరువు, దేవాలయాలు ప్రసిద్ధిగాంచినవి. వైరా చెరువు వైరా నది నుండి వచ్చింది. ఈ చెరువులో 16 బావులున్నాయి. దీనిని నిజాం నవాబు 1929లో తవ్వించారు. దీని ద్వారా చుట్టుపక్కల 8 మండలాలకు త్రాగునీరు, సుమారు ఒక లక్ష ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఇది ఒక పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చెందుతుంది. ఇక్కడ బోటు షికారు, గెస్ట్‌హౌస్, పిల్లలు ఆడుకునే స్థలం మొదలైనవి ఉన్నాయి. చేపల పెంపకం కూడా జరుగుతుంది.

వైరాలోని అయ్యప్ప మందిరం ప్రసిద్ధి చెందింది. ఇది ఖమ్మం పట్టణం నుండి వైరా వచ్చే దారిలో ఉంది. ఇంకా పాత బస్టాండు వద్ద రామాలయం ఉంది. మధు విద్యాలయం వద్ద సాయిబాబా గుడి ఉంది. కాకతీయుల కాలం నాటి శివాలయం కూడా ఉంది.

**10. ఇల్లందు :**

ఇల్లందు పాత పేరు ఇల్లందుపాడు. ఇల్లందు సింగరేణి బొగ్గు గనులకు పుట్టినిల్లు. ఈ ప్రాంతంలో బొగ్గు నిల్వలను బ్రిటిష్ వారు కనుగొన్నారు. కనుక ఇక్కడి గనులకు 'కింగ్', 'క్వీన్' వంటి పేర్లున్నాయి. ఇక్కడ మైనింగ్ కార్య కలాపాలకు 100 పైగా సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ పట్టణాన్ని 'బొగ్గుట'

అని కూడా అంటారు. ఇల్లందు దగ్గర ప్రతి సంవత్సరం దసరా పండుగకు కోటమైసమ్మ జాతర నిర్వహిస్తారు. ఈ జాతరను చాలా అంగరంగ వైభవంగా ఖమ్మం జిల్లాలోని గిరిజనులు నిర్వహిస్తారు.

**11. కొత్తగూడెం :**

కొత్తగూడెంలో సింగరేణీ కాలరీల ముఖ్య కేంద్రం ఉండుట వల్ల దీనిని దక్షిణ భారతదేశపు బొగ్గు పట్టణంగా పిలుస్తారు. కొత్తగూడెం మరియు పాల్వంచ జంట పట్టణాలు. వీటియందు దట్టమైన అడవులు, పరిశ్రమలు, సుందరమైన ప్రకృతి దృశ్యాలు కలవు. భద్రాచలం వెళ్ళాలన్నా, కిన్నెరసాని వెళ్ళాలన్నా కొత్తగూడెం వెళ్ళవలసిందే. కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రం కూడా సమీపంలోని పాల్వంచలో ఉంది. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విద్యుత్ సరఫరా చేస్తుంది.

**12. గార్ల :**

గార్ల చారిత్రాత్మకమైన ప్రదేశం. ఖమ్మం పట్టణానికి 40 కిలో మీటర్ల దూరంలో గార్ల గ్రామం, మండలం వుంది. గార్ల దగ్గర మర్రిగూడెం అనే తండాలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇది క్రీ.శ. 15వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించారు. ఈ ఆలయం చుట్టూ ప్రాకారాలు చక్కని శిల్పాలతో నిర్మించబడింది. ఈ ఆలయం ముందు కోనేరు ఉంది. ఈ ఆలయంలోని వెంకటేశ్వరస్వామికి చుట్టుపక్కల గ్రామాల గిరిజనులు, గిరిజనేతరులు మరియు జిల్లాల నుండి ఆంధ్రరాష్ట్రం నుండి భక్తులు, పర్యాటకులు వచ్చి దర్శించుకుంటారు.

**13. శ్రీరామగిరి :**

శ్రీరామగిరి ప్రాంతం పౌరాణిక చరిత్ర గలది. ఇక్కడ శ్రీరాముడు ఆనవాళ్ళు ఉన్నందున ఈ పేరు వచ్చింది. ఇక్కడ మాతంగ మహర్షి ఆశ్రమం ఉంది. సీతను రాముడు వెతికే సమయంలో మాతంగ మహర్షి ఈ ఆశ్రమంలో యాగం చేసారట. సీతారాములు నివసించిన ప్రాంతం కావటంతో శ్రీరామగిరి అని పేరు వచ్చింది. తర్వాత దీన్ని రేఖపల్లిగా మార్చారు. ఇక్కడ రెండు కొండల మధ్య వాలి, సుగ్రీవుల మందిరం ఉంది. గోదావరితీరంలో ఉన్న ఈ మందిరం దగ్గర రాళ్ళపై శ్రీరాముని పాద, మోకాళ్ళ ముద్రలు, మాయలేడి

పాదముద్రలున్నాయి. ఇది రామాయణ కాలంలో నిర్మించిన మందిరం కావటం చేత పౌరాణికమై ప్రసిద్ధి పొందుతుంది.

**14. జమలాపురం :**

జమలాపురం, ఖమ్మంజిల్లా, ఎర్రుపాలెం మండలానికి చెందిన గ్రామం. దీని జనాభా మూడు వేలకుపైబడి ఉంటుంది. ఇక్కడ వేంకటేశ్వరస్వామి ఆలయం చారిత్రాత్మకంగా ప్రసిద్ధిగాంచింది. ఇది ఖమ్మం నుండి 85 కిలో మీటర్లు, విజయవాడ నుండి 50 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ నుండి 7 కిలో మీటర్ల దూరంలో ఉంది.

ఇక్కడి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని తెలంగాణ చిన్న తిరుపతి అని, స్వయంభు అని, స్వయం వైకుంఠం అని పిలువబడుతుంది. 1000 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని ప్రతి శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. సాహిత్యకారుడైన జమలాపురం కేశవరావు ఈ ప్రాంతం వాడు.

"జమలాపురానికి ఉత్తర దిశగా "సూచీగిరి" అనే గుట్ట ఉన్నది. దీనిని సూదిబోడు అంటారు. ఇది ఇప్పటిదికాదు. త్రేతాయుగం నాటిది. ఈ పర్వత పాదంలో రెండు గుహలు ఉన్నాయి. ఒకటి వైకుంఠ గుహ, రెండవది కైలాసగుహ. జాబిలి మహాఋషికి శ్రీ మహావిష్ణువు దర్శన మిచ్చిన గుహను వైకుంఠ గృహ అనీ, పార్వతి పరమేశ్వరులు అర్జునిని పరీక్షించిన స్థలాన్ని కైలాస గుహగాను చెబుతారు"[15] కాని ఆ గుహలు ప్రస్తుతం కనుమరుగైపోయాయి.

**15. అన్నపురెడ్డిపల్లి:**

అన్నపురెడ్డిపల్లి ఖమ్మం పట్టణానికి 75 కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామం. చంద్రుగొండ మండలంలో వుంది. ఈ గ్రామంలో 700 సంవత్సరాల క్రితం కాకతీయులు నిర్మించిన చారిత్రాత్మకమైన పురాతన శ్రీ బాలాజీ వేంకటేశ్వరాలయం వుంది. కాకతీయుల సేనాధిపతి అయిన "అన్నపురెడ్డి" ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ప్రతీతి.

**16. కూసుమంచి :**

ఖమ్మం పట్టణానికి 20 కిలో మీటర్ల దూరంలో హైదరాబాదు మార్గంలో

ఉంది ఈ గ్రామం. ఈ గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రత్యేకత సంతరించుకున్న శివాలయం ఉంది. భూమికి 15 అడుగుల ఎత్తులో 30 టన్నుల బరువు 20 అడుగుల ఎత్తు, 4 అడుగుల మందం ఉన్న బండలను 50 అడుగుల ఎత్తులేపి కాకతీయులు నిర్మించిన శివాలయం ఇది. ఇక్కడి శివలింగం ఒక మహాద్భుతం, నల్లటి శిల్పంతో మూడు అడుగడుల ఎత్తు, 2 మీటర్ల వ్యాసం ఉన్న ఈ లింగంపై ఉదయ సూర్యకిరణాలు సూటిగా పడతాయి. ఇక్కడి వేణుగోపాలస్వామి ఆలయం కూడా కాకతీయల కాలం నాటిదే. శివరాత్రి నాడు ఉత్సవాలకు వేల సంఖ్యలో భక్తులు, సందర్శకులు దర్శించుకుంటారు.

**17. కల్లూరు :**

ఖమ్మం పట్టణానికి 50 కిలో మీటర్ల దూరంలో కల్లూరు గ్రామం వుంది. 400 సంవత్సరాల క్రితం కాకతీయుల రాణి రుద్రమదేవి కాలంలో ప్రఖ్యాతిగాంచిన వేణుగోపాలస్వామి ఆలయం ఉంది. దీనికి దగ్గరలోనే కాకతీయుల రాజు ప్రతాపరుద్రుడు నిర్మించిన శివాలయం ఉంది. ఇందులో పంచలింగాలు, నీటికొలను కూడా వున్నాయి.

**18. శ్రీ భక్తరామదాసు స్మారక మందిరం :**

భద్రాచలం తహశీల్దారుగా పనిచేసి, రామాలయ మందిరం నిర్మించిన కంచెర్ల గోపన్న (భక్తరామదాసు) స్మారకంగా, ఆయన జన్మించిన నేలకొండపల్లి గ్రామంలో ఇంటిని శ్రీ భక్త రామదాసు స్మారక మందిరంగా నిర్మించారు. ఈయన శ్రీరామ కీర్తనలు పాడి సీతా, లక్ష్మణ, హనుమ సమేతమైన రాముడిని కొలిచేవాడు. భక్త రామదాసు రచించిన 130 కీర్తనలలో కొన్ని ఇక్కడ లభిస్తాయి. ఖమ్మం పట్టణంలో బస్టాండు సమీపంలో కూడా శ్రీ భక్తరామదాసు కళాక్షేత్రం నిర్మించబడింది. వీటిలో సాంఘిక, సాంస్కృతిక, ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

## 1.2.5. ఖమ్మం జిల్లా సాహిత్యం :

ఖమ్మం జిల్లాలో 15వ శతాబ్దం నుంచి కవిత్వం రాయుటం ప్రారంభమయింది. కీ.శే. హరిభట్టు వరహ పురాణం రచనతో కవిత్వానికి శ్రీకారం జరిగింది. ఆ తర్వాత పురాణ, ఇతిహాసాలను రాసిన వారు లేరు. చాలా కాలం

తర్వాత మళ్ళీ 17వ శతాబ్దంలో కంచెర్ల గోపన్న తన ఇష్టదైవం శ్రీరామ చంద్రుని మీద దాశరధీ శతకం రచనతో పునప్రారంభమైంది. క్రమంగా చందాల కేశవదాసు మొదలుకొని ఇప్పటి వరకు కొన్ని వందల మంది కవులు తమ కవితా నైపుణ్యాన్ని చాటి చెప్పారు.

ఖమ్మం జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన, ప్రసిద్ధిచెందిన ప్రసిద్ధ సాహిత్యకారులు, కళాకారులు.

**1. హరిభట్టు :**

ఖమ్మం జిల్లా ఆది కవిగా ప్రసిద్ధికెక్కిన కవి శిఖామణి "శ్రీహరిభట్టు" క్రీ.శ. 1475-1535 ప్రాంతం వాడని ఆంధ్ర కవిత రంగిణిని రచించిన శ్రీ చాగంటి శేషయ్య నిర్ణయించారు.

హరిభట్టు భారద్వాజ గోత్రుడు, ఆపస్తంబ సూత్రుడు. తల్లి తిమ్మమ్మ (తిమ్మమాంబ), తండ్రి రామచంద్ర, భట్టోపాధ్యాయులు. ఇతను వరాహపురాణము, మత్స్య పురాణము(1525), భాగవతములోని షష్ఠ (1520), ఏకాదశ, ద్వాదశ స్కంధాలు(1500), నారసింహపురాణము ఉత్తరభాగము, శృంగారదీపిక అనే రచనలు చేసారు. వరాహపురాణాన్ని కొలిపాక ఎఱ్ఱయ అనే 'కంబము మెట్టు' స్థలకరణీకుడుకు అంకితం ఇచ్చారు. నాటి కంబము మెట్టు నేటి ఖమ్మం మెట్టుగా వ్యవహరించబడుతుంది. కవి దీనిని 'స్తంభాచలము' అని సంస్కృతీకరించాడు.

**2. కంచర్ల గోపన్న :**

భక్త రామదాసుగా పేరుపొందిన కంచెర్ల గోపన్నగారి జన్మస్థలం ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి. ఇతను క్రీ.శ. 1600 సంవత్సరంలో జన్మించారు. శ్రీరఘునాధ భట్టాచార్యుని శిష్యులైన 'గోపన్న' నిరంతరం రామనామ జపం చేస్తుండేవాడు. గోల్కొండ ప్రభువైన తానీషా దగ్గర మంత్రులుగా ఉన్నా అక్కన్న, మాదన్నలు గోపన్నకు మేనమామలు. వారి ద్వారా క్రీ.శ. 1640లో గోపన్న పాల్వంచ పరగణాకు తహసిల్దారుగా నియమింపబడ్డారు.

భద్రాచలంలో చిన్నకొండపై ఉన్న శ్రీరాముడిని చూసి హృదయం ద్రవించి గోపన్న, ఆ గ్రామ పెద్దలను ఒప్పించి, తహసిల్దారు హోదాలో తాను శిస్తు రూపేణా

వసూలు చేసిన ఆరు లక్షల రూపాయలను తానీషా అనుమతి పొందకుండానే రాముని ఆలయానికి గోపురం, మండపం, ప్రాకారాలు కట్టించేందుకు, సీతారామలక్ష్మణులకు ఆభరణాలు చేయించేందుకు వినియోగించాడు. విషయం తెలుసుకున్న తానీషా, గోపన్నను బంధించి చిత్రహింసలకు గురిచేసాడు. పన్నెండు సంవత్సరాల కఠిన కారాగారవాసం అనుభవించిన గోపన్న రామనామస్మరణ మానలేదు. చివరకు రామలక్ష్మణులు మారువేషాలతో తానీషా వద్దకు వెళ్ళి రామదాసు బాకీ సొమ్ము జమ చేసారు.

పరమ భక్తాగ్రణ్యుడైన రామదాసు రచించిన కీర్తనలు నేటికి ఆబాల గోపాలం పాడుకుంటారు. అతను రచించిన దాశరథీ శతకం ఆంధ్ర సాహిత్యంలో శిరోమణిగా ప్రకాశిస్తుంది.

**3. కీ.శే. చందాల కేశవదాసు :**

చందాల కేశవదాసుగారు ఖమ్మం జిల్లా జక్కేపల్లి గ్రామ నివాసుడైన శ్రీ చందాల లక్ష్మీనారాయణ, పాపమ్మ అనే పుణ్య దంపతులకు 1876 జూన్ 20వ తేదీన జన్మించారు. భక్త రామదాసువలె భక్తి కవితా మాధుర్యాన్ని పదిమందికి పంచిపెట్టి, తెలుగువారి హృదయాలలో పదిలంగా స్థానం సంపాదించుకున్న "అపర రామదాసు".

కేశవదాసుగారు అనేక సినిమాలకు పాటలు, మాటలు, స్క్రిప్టులు రాసారు. శ్రీరాముని కీర్తనలు, బలి బంధనం, రుక్మాంగద, పాదుకాపట్టాభిషేకము, సీతాకళ్యాణం, భక్త అంబరీష మొదలైన నాటకాలు రచించారు. వీరు రాఘవ శతకం, కేశవ శతకం, నాగదాసు చరిత్రం, పంచముఖాంజనేయ దండకము మొదలైన గ్రంథాలను రచించాడు. లభించిన సత్కారాలను స్వామి సేవకై ఖర్చు చేసిన కేశవదాసు 80వ యేట కన్నుమూసారు.

**4. కీ॥శే॥ డా॥ దాశరథి కృష్ణమాచార్యులు :**

"నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అంటూ గళం విప్పిన ధీశాలి. డా॥ దాశరథి నిజాం దురంతాలకు అట్టుడుకుతున్న తెలంగాణ ప్రాంతానికి విముక్తి కోసం జరుగుతున్న పోరాటంలో పెన్ను, గన్ను పట్టి పోరాడిన కలం యోధుడు దాశరథి. చెరశాల గోడలపై బొగ్గుముక్కతో "మా నిజాం రాజు జన్మజన్మల బూజు"

అని నినదించిన వీరయోధుడు.

1925 జూలై 22వ తేదీన, వరంగల్ జిల్లా, గూడూరులో జన్మించారు. వీరు ఖమ్మం జిల్లాలోని గార్ల అనే గ్రామంలో నివశించారు. బాల దాశరధి విద్యకోసం ఖమ్మం చేరాడు. మెట్రిక్యులేషన్ దాకా ఖమ్మంలో విద్యాభ్యాసం చేసాడు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పట్టభద్రుడయ్యారు. తెలంగాణ రచయితల సంఘానికీ, తెలుగు భాషా వ్యాప్తికి అంకితమైనారు. కళా ప్రపూర్ణ బిరుదుతో పాటు ఆంధ్రా విశ్వ విద్యాలయం నుంచి 'డాక్టరేటు' పొందాడు. 1977లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవి అయ్యారు.

అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, పున్నర్నవం, అమృతాభిషేకం, కవితా పుష్పకం, నవమి, నవమంజరి, దాశరధీ శతకం, తిమిరంతో సమరం ఆలోచనాలోచనాలు, గాలిబ్‌గీతాలు రచించారు. దాశరధి 1987 నవంబరు 5వ తేదీన మరణించారు.

దాశరధి వంశంలో ఖమ్మం జిల్లాలో ప్రభవించిన మరొక కవితారత్నం దాశరధి రంగాచార్యులు. వీరు వచనంలో అనేక రచనలు చేసారు. 'చిల్లరదేవుళ్ళ' నవల చలన చిత్రంగా కూడా చిత్రించబడింది.

**5. శ్రీ భూక్యా బాలాజి దాస్ రాథోడ్:**

శ్రీ భూక్యా బాలాజి దాస్ రాథోడ్ గారు ఖమ్మం జిల్లా కొత్తగూడెం నివాసి. వీరి తండ్రి భూక్యా రాంజీ రాథోడ్, తల్లి హంస్లీబాయి. వీరి గోత్రం రాత్‌ళా. వీరు బంజారా జాతి ఆది కవిగా వన్నెకెక్కారు. వీరు 'బంజారా లిపి'ని 'దేవనాగరి లిపి' ఆధారంగా తయారు చేసి 1వ, 2వ తరగతుల పుస్తకాలను ముద్రించి ప్రచారం చేసారు. ఆ లిపిని ప్రభుత్వ అభివృద్ధి చేసి వుంటే ఇప్పటికి బంజారా లిపి దేశమంతట విస్తరించి, భాషాపరంగా ఎంతో అభివృద్ధిని సాధించేది.

బంజారా భాషలో కవిత్వాన్ని, పాటలను అప్పటికి అప్పుడే సందర్భానుసారంగా అల్లగలిగిన ప్రజాకవి, జానపద గేయకవిగా పేరుపొందారు. బంజారా వంశ చరిత్రను మొట్టమొదట రాసి ప్రచారం చేసిన ఆదికవి. వీరు సుమారు 40 పైన పుస్తకాలు రాసారట. కొన్ని తెలుగులోను, కొన్ని బంజారా భాషలోను, తెలుగు లిపి ఆధారంగా ముద్రించి ప్రచారం చేసారు. అందులో

ముఖ్యమైనవి 1) బంజారా వంశావళి చరిత్ర 2) బంజారా వంశావళి బుర్రకథ 3) రాథామోల అనుగ్రామా 4) బాలాజా భజనమాల 5) వేదాంత బాలబోధిని 6) త్రిభాషా బాలాజీ భజనమాల 7) బంజారా సుజ్ఞాన దీపిక 8) పృద్వీరాజ్ చౌహాన్ బుర్రకథ 9) ప్రతిరోజు బుర్రకథ 10) బంజారా కీర్తనలు 11) బాలాజీ బోధనామృతం 12) బంజారా బోధనామృతం, 13) బంజారాల వీరచరిత్ర 14) నవీన బంజారా సాంఘీక సంకీర్తనలు 15) బంజారా బాలశిక్ష మొదటి, రెండవ వాచకాలు 16) బంజారా సొగలి ప్రచార్ 17) బంజారా బాలాజి పద్య రత్నావళి 18) దోబణ్ లక్ష్మణ బుర్రకథ 19) శల్వారాజ్ శనివాళేర్ బుర్రకథ 20) సూరజ్ రాథోడ్ సుందర చౌహాన్ బుర్రకథ మొదలైనవి ఎన్నో రాసి బంజారాల అభివృద్ధికి పాటుపడినారు.

**6. ఝూంజణోత్ మూడ్ కృష్ణనాయక్ చవాణ్:**

"బంజారా గీతామృత్" అనే బంజారా భాషలో భాగవద్గీత రచించిన యం.కృష్ణనాయక్ చవాణ్‌గారు 05-9-1953న మర్రిగూడెం గ్రామం, గార్ల మండలం, ఖమ్మం జిల్లా బంజారా సాహితీకారుడు, తల్లిదండ్రులు కీ.శే. మూడ్ ఠాకూర్, లక్ష్మి. వృత్తి రీత్యా డేటా బేస్ మేనేజరు, రైల్వే రిజర్వేషన్ కార్యాలయం, సికింద్రాబాద్‌లో ఉద్యోగం చేస్తూ, తెలుగు లిపితో బంజారా భాషలో భగవద్గీతను "బంజారా గీతామృత్"(2006) అనే గ్రంథాన్ని రాసి బంజారుల కృష్ణ భగవానుడుగా ఖ్యాతికెక్కారు. హిందువుల ముఖ్యగ్రంథం భగవద్గీతను శ్రీకృష్ణభగవానుడు చెబితే, బంజారా భాషలో ఈ కృష్ణనాయక్(భగవానుడు) చెప్పి బంజారా కృష్ణ భగవానుడుగా పెద్దలు మెప్పు పొందాడు. సుమారు 18 నెలలు కష్టపడి ఈ 'బంజారా గీతామృత్'ను రూపొందించారు. ఇది బంజారుల ఆది కావ్యంగా పెద్దలు పేర్కొనారు. "దేశీయ ఛందస్సులో 'బంజారా గీతామృత్' అవతరించటం బంజారాల అదృష్టం" అని 'బంజారా గీతామృత్' అనే కావ్యం ముందుమాటలో డా. మనస చెన్నప్పగారు తెలిజేసారు. అదేవిధంగా దీనికి రచయిత ఇంటి పేరుతో 'మూడ్ ఛందస్సు'గా పేర్కొన్నారు. అంతటి పేరుపొందిన కృష్ణనాయక్ గారు ఖమ్మం జిల్లా ప్రసాదించిన బంజారా సాహిత్యకారుడు.

వీరేకాక ఆధునికాంధ్ర సాహిత్యంలో తనదంటూ ఒక విశిష్ట స్థానాన్ని పొందిన శ్రీ ఉత్పల సత్యనారాయణగారు ఖమ్మం జిల్లా చింతకానిలో 1928లో జన్మించారు. జ్యోత్స్నతో కావ్య రచనకు శ్రీకారం చుట్టి 67 గ్రంథాలు రచించారు.

1924వ సంవత్సరంలో జన్మించిన హీరాలాల్ మోరియా ఖమ్మం జిల్లా రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక జీవితాలతో సంపూర్ణంగా పెనవేసుకున్న మహామనిషి. సుమారు 200 కథలు రచించిన కథక చక్రవర్తి. రసజ్ఞ కవిగా ప్రజాకవిగా హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న ప్రతిభశాలి.

'చేరా' అనేకలం పేరుతో అందరికీ సుపరిచితుడైన చేకూరి రామారావుగారు 1934 జూలై 1వ తేదీన ఖమ్మం జిల్లా మధిర తాలూకా, ఇల్లందులపాడు సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. ఆంధ్రప్రదేశ్‌లో లబ్ద ప్రతిష్టులైన సాహితీ విమర్శకులలో చేరా అగ్రస్థానం వహించారు.

వీరితో పాటు శ్రీ ఆధిరాజు వీరభద్రరావు, శ్రీ కొండ మైసమ్మ సత్యనారాయణచార్య, శ్రీ చేతన కలం పేరు కలిగిన ఎం.వి. లక్ష్మీనారాయణ, శ్రీ వంశీకృష్ణ, శ్రీ సీతారాం, శ్రీ సాధనాల వేంకటస్వామి నాయుడు, శ్రీ జీవన్, శ్రీ రౌతు రవి, డా. యం.వి.రమణ, డా. దాస్యం రూత్‌మేరి, డా. బి.మాధురి, శ్రీ పుల్లబొట్ల వేంకటేశ్వర్లు, జమలాపురం కేశవరావు, శ్రీమతి బి.ఇందిర, టి.నరసింహారావు, డా॥ జి.వెంకటలాల్ మొదలైన సాహితీ వేత్తలు, కళాకారులు ఖమ్మం జిల్లాలో ఉన్నారు.

అదేవిధంగా చలనచిత్ర కళాకారులు, బుల్లితెర కళాకారులు, నాటక కళాకారులు, జానపద కళాకారులు ఖమ్మం జిల్లాలో ఉన్నారు. వీరు జిల్లాకే వన్నె తెచ్చారు.

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామంలో జన్మించిన హాస్యనటుడు బాబూమోహన్ దాదాపు ఐదు వందల (500) చిత్రాలలో నటించి జిల్లాకు ఖ్యాతి తెచ్చారు. ఆయన 3 సార్లు ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర రంగంలో ప్రతిష్ఠాత్మకమైన నంది అవార్డులు స్వీకరించారు.

1974లో ఖమ్మం కళాపరిషత్‌ను ప్రారంభించిన వి.వి.అప్పారావుగారు 1978లో 'చలి చీమలు' చిత్ర నిర్మాతలలో ఒకరిగా బాధ్యత వహించారు. 1979లో

స్వయంగా 'ఛాయ' సినిమాను నిర్మించి ఖమ్మం జిల్లాలో మొట్ట మొదటి సినిమా నిర్మాతగా రికార్డు సృష్టించారు.

1987లో 'ఊరేగింపు' చిత్ర సమర్పకుడయిన నాగబత్తిని రవి ఖమ్మం జిల్లా వైరాలో 20-10-1951లో జన్మించారు. 1965 నుండి సుమారు 60 నాటికలు - నాటకాలు ప్రదర్శించి నటుడుగా, దర్శకుడుగా ఎన్నో బహుమతులు, సత్కారాలు పొందారు.

వందేమాతరం శ్రీనివాస్ ప్రముఖ సినీ సంగీత దర్శకులు, గాయకులు, నటులు ఖమ్మం జిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురం అనే గ్రామంలో జన్మించి, చిన్నతనంలో వ్యవసాయ పనులు చేస్తూ, గొడ్ల కాపరిగా జీవితం ప్రారంభించారు. వీరి అసలు పేరు కన్నెబోయిన శ్రీనివాస్.

వీరితో పాటు జిల్లా కీర్తి ప్రతిష్టలను వెండితెర అవకాశాల ద్వారా చాటిన మరో నీట ముత్యం హరి ప్రసాద్. ~~ఈ~~టివి 'యాహూ' ప్రభాకర్ తెలుగు వారందరికీ సుపరిచితులైన నటుడు, యాంకర్ శ్రీ ప్రభాకర్ ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో జన్మించారు. తెలుగు చిత్ర రంగానికి దశరథ్‌గా సుపరిచితుడైన కొండపల్లి దశరథ్ కుమార్ బోనకల్ మండలం, జానకీపురం నివాసి. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రఖ్యాత హాస్యనటుడు శ్రీనివాస్‌రెడ్డి జెమిని టి.వి. యాంకర్‌గా, 50పైగా చిత్రాలలో హాస్యనటుడిగా నటించారు. బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన 'చిత్రంశ్రీను' ఖమ్మం జిల్లా వాసే. ఇతను కూడా 50కి పైగా చిత్రాలలో జూనియర్ ఆర్టిస్టుగా, హాస్యనటుడిగా నటించారు. జీటివిలో 'క్రైంవాచ్'లో యాంకర్‌గా నటించిన కీర్తన్ (కుటుంబరావు) మధిర మండల వాసి. వీరు అనేక సినిమాలలో జూనియర్ ఆర్టిస్టుగా నటించారు. ముదిగొండ మండల వాసి శ్రీ భద్రయ్య 'భద్రి'గా చిత్రరంగంలో ప్రవేశించి 'మస్త్' సినిమాలో బ్రహ్మానందంతో కలిసి హాస్యం పండించారు. జీ టి.వి. 'కృష్ణావతారాలు' సీరియల్‌లో శ్రీను నటించారు. ఇంకా వర్ధమాన కాలంతో పాటు అనేక మంది నటులు, కళాకారులు ఖమ్మం జిల్లాలో జన్మించి, ఖమ్మం జిల్లాను కళాకారుల జిల్లాగా పేరు తెచ్చారు.

# 2. బంజారుల పుట్టుక - చరిత్ర

ఆంధ్రప్రదేశ్ అంతటా బంజారులు విస్తరించి వున్నారు. వీరినే లంబాడీలు, సుగాలీలు అని వ్యవహరిస్తారు. వీరిని ప్రభుత్వం షెడ్యూల తెగగా గుర్తించింది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 33 తెగలుంటే, అందులో పెద్ద తెగ 29వ తెగ. బంజారా తెగ. అన్ని తెగలకు ప్రత్యేక లక్షణాలు - ఆచార వ్యవహారాలు - ఉన్నట్లే బంజార తెగకు ప్రత్యేక లక్షణాలు, ఆచార వ్యవహారాలు, వేషధారణ, సంస్కృతి, పండుగలు, గేయాలున్నాయి. వీరి ఆచార వ్యవహారాలు మిగిలిన తెగకన్నా ప్రత్యేకంగా కనిపిస్తాయి. దీనికి కారణం వీరు రాజపుత్ర సంతతికి చెందిన వారు కావటం.

మొదట బంజారులు ఉత్తర భారతదేశంలో ఉండే వారని తర్వాత దక్షిణ భారతదేశానికి వచ్చారని చరిత్రకారులు వివరిస్తారు. బంజారులు పూర్వం రాజపుత్ర వంశీయులని, కారణాంతరాల వల్ల వారి నుండి విడిపోయి వృత్తిని, వేషాన్ని, భాషను, ఆచార వ్యవహారాలను కొంత వరకు మానుకొని ప్రత్యేక తెగగా ఏర్పడినారు. బంజారుల వంశ చరిత్రలను పరిశీలిస్తే వీరు రాజస్థాన్‌లోని రాజపుత్రుల వంశానికి చెందిన వారనే అభిప్రాయం బలపడుతుంది. 'ఆంధ్రప్రదేశ్ గిరిజనులు' అనే వ్యాసంలో "లంబాడీలు ఉత్తర భారతీయులని వీరు రాజస్థాన్ నుండి ఇక్కడికి వచ్చి స్థిరపడి కాలానుగుణంగా ఎదురైన ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొంటూ వచ్చారు" అని శ్రీ కళ్యాణ్‌గారు పేర్కొన్నారు.

బంజారులు తమ మాతృభూమియైన రాజస్థాన్ వదిలి వృత్తి రీత్యా మొగలు చక్రవర్తుల కాలంలో మొగలు సైన్యంతో ఉత్తరదేశం నుండి దక్షిణ దేశానికి వచ్చారని, వీరు సైన్యానికి కావలసిన సరుకులు యుద్ధ సామాగ్రి ఎండ్లబండిపై సరఫరా చేసేవారని" బంజారా పెద్దలు చెప్తుంటారు.

బంజారులకు, పౌరాణిక ఐతిహాలు, చారిత్రక నేపథ్యాలున్నాయి. ~~ఈ~~ నేపద్యాలు, ఐతిహ్యాలు గురించి పూర్వ పరిశోధకులు బాలాజీదాసు రాథోడ్, భూక్యా (1982), జీవలానాయక్, నూన్యావత్(1990), శంకరయ్య జనపాల (1995), చీనియా నాయక్, భూక్యా (1998), గోనా నాయక్. యం(2002),

సూర్యాధనుంజయ్ (2009), వెంకట్‌లాల్.జి(2011), సిల్మానాయక్, ఆజ్మీరా(2011) పేర్కొన్నారు.

వీరి గ్రంథాల ఆధారంగా, ఖమ్మం జిల్లాలోని కొందరు వక్తల సారాంశ ఆధారంగా బంజారుల పద ఉత్పత్తులనూ, బంజారుల నేపథ్యాలనూ, ఐతిహ్యాలను వివరించటం జరుగుతుంది.

## 2.1. బంజార పద పుట్టుక :

బంజార అనే తెగ వారికి భారతదేశంలో ప్రాంతీయంగా కొన్ని పేర్లు ఉన్నాయి. "1.బంజార 2.వనజర, 3. బలాడియా, 4.బంజారి, 5. బృజవాసి, 6.లమాన్, 7.లవాని, 8. లంబాడ, 9.లంభాడి, 10.లచాన్, 11. లబాని, 12. బలాడియా, 13. లదినియా, 14. సుగాలి, 15. గోరియా, 16. గమాలియా, 17.గారియా, 18. కాంగ్‌సియా, 19. పాండ, 20. షిర్కాంబాండ్, 21. సింగాళి బనజారి, 22. రోమాబంజార" (జీవలానాయక్ 1990 : 55) అని పిలువబడుతున్నాయి. వీటితో కలిపి మొత్తం 27 పేర్లు ఉన్నట్లు తెలుస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానంగా బంజారా, లంబాడీ, సుగాలీ అనే శబ్దాలే ఎక్కువగా వ్యవహారంలో ఉన్నాయి. కానీ ఖమ్మం జిల్లాలో లంబాడీ, బంజార అనే శబ్దాలు మాత్రమే వాడుకలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూలు తెగలు 33 వుంటే, లంబాడీ తెగ 29వ కులం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చే కుల ధృవీకరణ పత్రాలలో కూడా 'లంబాడీ' కులం అని ధృవీకరిస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని లంబాడీలు వెనుకబడిన తరగతులు కాబట్టి వీరిని ఏజెన్సీ ఏరియాలోని షెడ్యూల్డ్ తెగగా గుర్తించారు.

ఆంధ్రప్రదేశ్‌లో బంజార, లంబాడీ, సుగాలీ పదాలే ఎక్కువగా వ్యవహారంలో ఉన్నందున వీటి ఉత్పత్తిని స్థూలంగా వివరిస్తున్నారు.

### 1. బంజార :

ఈ 'బంజార' అనే శబ్దానికి బలమైన ఆధారం 'వాణిజ్య' శబ్దమని చెప్పవచ్చు. బంజారులు ఔత్తరాహులు. అక్కడి వ్యవహార భాష హిందీ. హిందీలో 'వనజ్' అంటే 'వాణిజ్యం' అని, వ్యాపారం అని అర్థం. అందువల్ల 'వనజార్'

అంటే వ్యాపారం చేసేవాడు, ఎడ్లమీద, ఎడ్లబండ్ల మీద ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వస్తువులు తీసుకెళ్ళి అమ్మే వర్తకుడని అర్థం.

పూర్వం వీరు ఉప్పును, నిత్యావసర వస్తువులను ఎడ్లమీద, ఎడ్లబండ్లపై అమ్ముతూ జీవనం కొనసాగించారు. కావున 'వనజార్' అనే పదం వీరికి అన్వయిస్తుంది. ఇదే క్రమంగా వంజారగా ఆ తర్వాత బంజారగా మారింది. ప్రస్తుతం కూడా తెలంగాణ ప్రాంతంలోని ఖమ్మం మరియు ఇతర జిల్లాలలోని బంజారులు ఎడ్లబండ్లపై నిత్యావసర వస్తువులు (ఉల్లిగడ్డలు, కందగడ్డలు, ఎల్లిపాయలు, అల్లం, పుచ్చకాయలు, సీతాఫలాలు, కూరగాయలు, ఉప్పు, పప్పు) వేరే ప్రదేశానికి తీసుకెళ్ళి అమ్ముతుంటారు. ప్రస్తుతం అధికశాతం వ్యవసాయాన్ని వృత్తిగా చేపట్టారు. కాబట్టి బంజారా అనే పేరు వాణిజ్య శబ్దం నుండి, వారు చేసే వృత్తిని బట్టి వచ్చిందని చెప్పవచ్చు.

మరో విధంగా బంజారులు గ్రామాలకు దూరంగా, అడవులకు దగ్గరలో 'బంజరు' భూములలో నివాసాలేర్పాడు చేసుకొని, వ్యాపారాన్ని, వ్యవసాయాన్ని చేస్తుంటారు. వీరు బంజర భూములను సారవంతంగా సాగు చేస్తుంటారు. కాబట్టి 'బంజర' భూములలో నివాసం ఏర్పాటు చేసుకోవటం వల్ల, బంజర భూమిని సాగు చేయటం వల్ల 'బంజర' అనే పదం క్రమంగా 'బంజార'గా మారిందని మరో అభిప్రాయం ఉంది. కాబట్టి బంజార అనే పేరు వారు నివసించే ప్రాంతం నుండి వచ్చిందని చెప్పచ్చు.

**2. లంబాడీ :**

బంజారాలకు 'లంబాడీ' అనే పేరు కూడా వుంది. వికీపిడియా వెబ్‌సైటులో 'ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు తెగల జాబితా' అనే వ్యాసంలో 29వ జాబితగా లంబాడీ అని పేర్కొనబడింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ధృవీకరించే కుల ధృవీకరణ పత్రంలో 29వ షెడ్యూలు తెగగా ధృవీకరిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో అధికంగా 'లంబాడీ'లనే వ్యవహరిస్తున్నారు. తర్వాత 'బంజార' అని వ్యవహరిస్తారు. ఇక్కడ సుగాలీలంటే అసలెవరో తెలియదు. చదువుకున్న వారికి తప్ప.

"లంబాడీ అనే పేరు లవణ (అంటే ఉప్పు) శబ్దం నుండి వచ్చింది. బంజారా జాతి వారు పూర్వం రాజస్థాన్‌లో ఉప్పు వ్యాపారం చేసేవారు.

సంస్కృతంలో లవణం అంటే ఉప్పు అని అర్థం. లంబాడీ భాషలో ఉప్పును నూణ్ అంటారు. ఈ లవణ శబ్దం లూణ్‌గా మారుతుంది. 'భాడా' అనే పదానికి సరుకును ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి చేర్చటం అని అర్థం. ఈ రెండు పదాలు కలిసి ఏర్పడిన పదమే లంబాడ/లంబాడీ". (వెంకటలాల్ 2011:7)లు అని పేర్కొన్నారు. కావున లంబాడీ అనే పదం వారు చేసే వృత్తిని బట్టి వచ్చిందని చెప్పవచ్చు.

మరో విధంగా బ్రిటిష్ వారు "బంజారాలు, స్వతంత్రముగా నేలుచున్న నవాబులకు రాజులకు యుద్ధము చేయు కాలమందు సైనికులకు ఆహార పానీయములు యుద్ధసామాగ్రి యెద్దుల మీద చేర్చి వారికి సహాయపడిన వారెవరని తెలుసుకొని ఇంగ్లీషు భాషలో, రెడ్ మ్యాన్ లాంగ్ బాడి (అనగా) యర్రగా పొడవుగా, బాగా ఛాతీ కలిగిన వారు యెచ్చట ఉన్నారని భారత ప్రజలను అడిగి తెలుసుకొనిరి. అప్పటి నుండి లాంగ్ బాడి అని పోయిన లంబాడీలని పిలువబడుచుండిరి" (జీవలానాయక్ 1990:47) అని పేర్కొన్నారు. కావున లంబాడీ అనే పదం వారి ఆకారాన్ని బట్టి వచ్చిందని చెప్పవచ్చు.

**3. సుగాలీ :**

ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, ఆంధ్ర ప్రాంతంలో మాత్రమే ఈ పదం వాడుకలో ఉంది. ఈ శబ్దాన్ని గురించి డా॥ జి.వెంకటలాల్‌గారు ఇట్లా తెలిపారు "ఆంధ్రప్రదేశ్‌లో కోస్తాంధ్ర ప్రాంతాల్లో, తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రాంతాల్లో లంబాడీలను సుగాలీలని పిలుస్తున్నారు.

సుగాలీ, సుకాలీ అనే పేర్లు 'సుపారీ' అంటే 'వక్క' అనే పదం నుండి రావచ్చుని కొందరి అభిప్రాయం. ఈ లంబాడీలు ఆవులను అధికంగా పోషించటం వల్ల వీరిని సుగాలీలంటారు. అందువల్ల హిందీలో 'గాయ్' అంటే ఆవులని అర్థం. మంచి ఆవుల్ని పోషించటం వల్ల 'సుగాయ్' అనే శబ్దం కాలయానంలో సుగాలీ అనే మార్పుకు కారణాన్ని సూచిస్తుంది. సుపారీ అనే శబ్దం వక్కల్ని సూచిస్తుంది. వీరు సుపారీలను అధికంగా సరఫరా చేస్తూ అమ్మడం వల్ల ఆయా ప్రాంతాల్లో సుపారీయే సుగాలీగా రూపాంతరం చెంది ఉండవచ్చు" (వెంకటలాల్ 2011 : 7,8) అని పేర్కొన్నారు.

ఈ శబ్దాన్ని గురించి జీవలా నాయక్, నూన్సావత్ ఇట్లా తెలిపారు. "బంజారాలని, లంబాడీలని చిత్తూరు, కర్నాటక ప్రదేశములలో సుగాలీలని, యెత్తైన ప్రదేశములలో నివసిస్తూ, పశువులు యెక్కువగా ఉండుట వలన సుగాలీలని పిలువబడుచున్నారు". జీవలానాయక్ 1990 : 47, 48) అని పేర్కొన్నారు. కావున ఈ సుగాలీ అనే పదం సుగాయ్ అనే శబ్దం నుండి పశుపోషణ అనే వృత్తిని బట్టి వచ్చిందని చెప్పవచ్చు. బంజార అనే పదమే అంతటా ఉండటం వల్ల బంజారులుగానే పిలువబడుతున్నారు.

## 2.2. పౌరాణిక ఐతిహ్యాలు :

ఇది బంజారులు చెప్పుకొను తమ వంశావళి చరిత్ర. బంజారుల మూల పురుషులు క్షత్రియులని, తల్లి బ్రాహ్మణ స్త్రీ అని, వీరు క్షత్రియ - బ్రాహ్మణ సంకరమని చెప్పుకొనే చరిత్ర. ఈ చరిత్రే బంజారుల పుట్టుకకు ఆధారంగా గోచరిస్తుంది. ఈ ఐతిహ్యాన్నే చాలా మంది బంజారా పెద్దలు చెప్పారు. చాలా మంది అంగీకరించారు.

శ్రీ మహావిష్ణువు మొదట భృగు, రఘు అనే ఇద్దరు మహర్షులను సృష్టించారు. ఈ మహర్షులు ధీజ్ మహరాజు, అంబాబాయిలను సృష్టించారు. వీరికి కవర్‌ధజ్ అనే కుమారుడు జన్మిస్తాడు. కవర్‌ధజ్‌కు రాజ్‌ఫళ్, రాజ్ ఫళ్‌కు రీమ్ పుట్టారు. రీమ్‌కు హాబల్, కాబల్ అనే ఇద్దరు కుమారులు పుట్టారు.

హబల్ సంతతి హిందువులు, కాబల్ సంతతి ముస్లీంలు. హిందువైన హాబల్‌కు వగరా, వగరాకు జోగాదు, జోగాదుకు నందల్, నందల్‌కు కానన్, కానన్‌కు కర్ణ్ జన్మిస్తారు. కర్ణ్‌కు తీడా (జేడా), చాడా అనే ఇద్దరు కుమారులు పుట్టారు.

తీడాకు పుట్టిన వారు బంజారులు, చాడాకు పుట్టిన వారు శూద్రులు. తీడాకు జోగడ్, భీమడ్, మోలా, మోటా, నాతడ్, రాయడ్ అనే ఆరుగురు కొడుకులు పుట్టారు.

మోలా, మోటా అనే ఇద్దరు శ్రీకృష్ణ భగవానుని దగ్గర గోవుల కాపరులుగా ఉండేవారు. ద్వాపరయుగంలో కంసుని సంహారం తర్వాత తన అవతారాన్ని

చాలించే ముందు సమస్త సంపదలతో పాటు 16,000 గోపికా స్త్రీలను గోపాలకులకు తల్లులుగా పంచి యిస్తాడు. అప్పుడు మోలాకు రాధను పంచి ఇచ్చి, మోటాకి రుక్మిని పంచి ఇచ్చి వారు చెప్పినట్లు నడుచుకొంటే, మీ జీవితం సుఖాంతం అవుతుంది అంటాడు. మోటా రుక్మి ద్వారకాలోనే ఉండిపోతారు. రాధా మోలాని వెంట తీసుకొని గారడీ విద్య చేస్తూ జీవిస్తూంటారు. ఒకనాడు శాన్నాళి ధారుణ్‌గడ్ అనే పట్టణానికి చేరి అక్కడ 'లోహేడ్ పమార్' అనే రాజును దర్శించి, వారి ముందు గారడీ విద్య ప్రదర్శించి, ఆయన నుండి ఒక పుత్రున్ని అడిగి తీసుకొంటారు. అక్కడి నుండి జోత్‌పూర్ ఉదయ్‌గడ్ అనే పట్టణం రాజైన కాసనం రాజు రాథోడ్ వద్ద ఒక పుత్రున్ని అడిగి తీసుకొని, అక్కడి నుండి హల్యా పుల్యా ఘడ్ పట్టణం రాజు మాండ్య చతుర్భుజ్ మహారాజు చౌహన్ దగ్గర ఒక కుమారున్ని తీసుకొని పాల్‌గడ్ అనే గ్రామానికి వచ్చి అక్కడ ఇల్లు కట్టుకొని స్థిర నివాసం ఏర్పరుచుకొన్నారు.

రాధా మోలాలు 'ధారుడ్‌ఘడ్' పట్టణ రాజు కుమారునికి పమార్ అని, జోత్‌పూర్ పట్టణరాజు కుమారునికి కర్ణ రాథోడ్ అని, హల్యా పుల్లా రాజకుమారునికి పాయి చౌహాన్ అని పేర్లు పెట్టారు. ఈ ముగ్గురికి యుక్త వయస్సు వచ్చింది. వారికి పెండ్లి చేయటానికి అమ్మాయిలను వెదకటం మొదలు పెట్టారు. కాని ఈ ముగ్గురికి పిల్లల నివ్వటానికి ఎవ్వరూ ముందుకు రారు. అందుకు రాధ కృష్ణుని గురించి గంగానది ఒడ్డున ఘోర తపస్సు చేయటం మొదలు పెట్టింది.

'కామ్‌పాడ్ గంగాఖేడ్' అనే ఊరిలో నీలకంఠ శాస్త్రి అనే బ్రాహ్మణోత్తముడు ఉండేవాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొంత కాలానికి నీలకంఠశాస్త్రి భార్య మరణించింది. ఆ సమయంలో విధివశాత్తు పెద్ద కుమార్తె పుష్పవతి అయింది. ఆ సంగతి ఊరి బ్రాహ్మణులందరికి తెలిసి, వారిని ఊరి నుండి వెలివేస్తారు. నీలకంఠ శాస్త్రి బాధతో చింతిస్తూ, పిల్లలను వెంట పెట్టుకొని గంగానది ఒడ్డున రాత్రి అవటంతో ఒక మర్రిచెట్టు కింద పడుకొన్నాడు. పిల్లలందరూ నిద్రించే సమయంలో వాళ్ళను మర్రిచెట్టు కిందే వదిలి ఎవరికి తెలియకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు. తెల్లవారిన తర్వాత పిల్లలు మేలుకొని తండ్రి కనబడకపోవటంతో, గంగానది తీరంలో తపస్సు చేస్తున్న రాధ

దగ్గరకు వచ్చారు. ఆ పిల్లల ఏడుపు విని కళ్ళు తెరిచి మీరెవరని అడిగింది. జరిగిన విషయమంతా రాధతో చెప్పుకున్నారు. రాధ వాళ్ళు చెప్పినదంతా విని వాళ్ళను తన వెంట తీసుకొని ఇంటికి వచ్చింది. వాళ్ళలో పెద్ద పిల్ల కాకరేచిని పెద్ద కుమారుడు పమార్‌కు, రెండవ పిల్ల మోదరేచిని రెండవ కుమారుడు చౌహాన్‌కు, మూడవ పిల్ల నాగరేచిని మూడవ కుమారుడైన రాథోడ్‌కు ఇచ్చి వైభవంగా పెళ్ళి జరిపించింది.

**పమారు వంశం**

ఆ తర్వాత కొంత కాలానికి పెద్దకుమారుడైన రాజా పమారుకు ఒక కుమార్తె పుట్టింది. తన బావమరిది పరుశురాం (నీలకంఠ శాస్త్రి కొడుకు)కు ఇచ్చి పెండ్లి చేసారు. తర్వాత రాజా పమార్‌కి భవయ్య పమార్, అతనికి పుణా పమార్, పుణా పమార్‌కు అబ్దు పమార్ పుట్టారు. అబ్దు పమార్ పుట్టినపుడు వీరి నివాసస్థానం గడమండ్ల అనే గ్రామంలో హోళీ పండుగ ఎంతో ఘనంగా జరుపుకున్నారు. అబ్దూ పమార్‌కు పన్నెండు (12)మంది కుమారులు :

1.ఐత పమార్, 2. చైతా పమార్, 3. లోకా పమార్, 4. బాణే పమార్ , 5. తర్జాణే పమార్ , 6. ముంజాణే పమార్, 7. విషళావత్ (ఇస్లావత్ ఖమ్మం జిల్లాలో) పమార్ , 8. ఆంగోత్ పమార్, 9. ఝరప్లా పమార్, 10. నూణ్సావత్ పమార్, 11. ఇంద్రావత్ పమార్, 12. వాంకడోత్ పమార్ మొదలైన వారు పమార్ వంశంగా కీర్తికెక్కారు.

**చౌహాన్ వంశం :**

రెండవ కుమారుడైన చౌహాన్ భార్య మోదరేచికి పుట్టిన వారి పేర్లు 1. కొర్రా చౌహాన్ , 2. సభావట్ (సపావట్)చౌహాన్, 3. కేళోత్ చౌహాన్ , 4. మూడ్ చౌహాన్, 5. లావుడ్యా చౌహాన్, 6. పాల్త్యా చౌహాన్ మొదలైన వారు చౌహాన్ వంశంగా కీర్తికెక్కారు.

**రాఠోడ్ వంశం :**

మూడవ కుమారుడైన కర్ణ రాఠోడ్ భార్య నాగరేచికి సూరజ్ రాఠోడ్, సూరజ్ రాఠోడ్‌కు దూద్యా రాఠోడ్, దూద్యా రాఠోడ్‌కు కేళీసి రాఠోడ్, కేళీసికు ధవర్‌ధడ్ రాఠోడ్, ధవర్‌ధడ్‌కు నేజాధర్ రాఠోడ్, నేజాధర్ రాఠోడ్‌కు రత్నా రాఠోడ్

జన్మిస్తారు. రత్నా రాఠోడ్‌కు భీకా మరియు ఖందర్ (బాలా) అని ఇద్దరు కుమారులు జన్మిస్తారు.

**భుక్యా వంశం :**

పెద్దవాడైన భీకాకు 14 మంది పుట్టారు. 1. ఖ్రట్రా, 2. ఖోలా, 3. మోద్రాచౌ, 4. ఖాక్రోచ్, 5. గోకళ్యా, 6. గేదావత్స, 7. ....?, 8. పూళ్యా, 9. కుళూ, 10. మళూ, 11. ఖడ్డూ, 12. ఖద్వా, 13. పీంపా, 14. వీంపా మొదలైనవారు. వీరు భూక్యా వంశంగా ప్రసిద్ధికెక్కారు.

**బాణోతు :**

బాలా (ఖందర్)కు 13మంది పుట్టారు. 1. పాతళ్సి, 2. రాంసీ, 3. ఖేతాసి, 4. కోడ్యాసి, 5. సేణ్యా, 6. ధేన్యా, 7.మేఘావత్, 8. దెగావత్, 9. ఉదాసీ, 10. మెరావత్, 11. కర్‌తోట్ , 12. మెరాజోత్, 13. రాజవత్ మొదలైన వారు బాణోత్ వంశంగా ప్రసిద్ధికెక్కారు.

భీకాకు 14, ఖందర్ (బాలా)కు 13 మొత్తం బానోత్, భూక్యా కలిసి 27 రాఠోడ్ వంశంగా కీర్తికెక్కారు.

**బాణోత్ వంశ పుట్టుపూర్వోత్తరాలు :** ఒక గ్రామంలో సిద్ధలింగమనే బలిజ కులానికి చెందినవాడు ఉండేవాడు. అతని భార్య చండికాబాయి. వీరికి సంతానం లేనందుకు ఒక సాధువును పూజించారు. అప్పుడు ఆ సాధువు ప్రత్యక్షమై ఇలా చెప్పాడు. మీరు మీ ఇంటికి వెళ్ళండి. కొంత కాలానికి మీకు సంతానం కలుగుతుంది. కాని బాలుడు పుట్టినట్లయితే ఆ బాలున్ని నాకివ్వాలి. బాలిక పుట్టినట్లయితే మీరే పెంచుకోండని చెప్పాడు. కొంతకాలానికి వారికి బాలుడే పుట్టాడు. అప్పుడు వారు ఆ బాలుని కొంతకాలం పెంచి సాధువు చెప్పిన ప్రకారమే ఆయనకు అప్పగించారు. అప్పుడు ఆ సాధువు ఆ బాలున్ని వెంటపెట్టుకొని గడమండ్ల గ్రామానికి వచ్చాడు. అప్పుడు రత్నరాఠోడ్ సాధువుకు 13రూపాయలు దక్షిణగా ఇచ్చి, ఆ బాలున్ని తన వద్దనే ఉంచమని ప్రార్థించాడు. అప్పుడు సాధువు సరేనని ఆ బాలున్ని రత్నరాఠోడ్‌కు అప్పగించాడు. ఆ బాలునికి బాణోత్ అని పేరు పెట్టారు.

ఈ బాణోత్‌కు 13 మంది కుమారులు.

1. కానావత్, 2. కర్ణావత్, 3. ఖోజావత్, 4. ఖండావత్, 5. ధానావత్, 6. పానావత్, 7. రూపావత్, 8. సబ్ధావత్, 9. ఆడోత్, 10. లాహోరి, 11. ధీరావత్, 12. కుంతావత్, 13. ముణావత్ మొదలగు వారు బాణోత్ వంశంగా ప్రసిద్ధిగాంచారు. వీరు కూడా రాఠోడ్ వంశస్థులుగా గుర్తించబడ్డారు. కావున తెలంగాణ ప్రాంతంలోని బంజారులు భూక్యా -బానోతు వారిని పెళ్ళి చేసుకోరు. కాని కొంతమంది చేసుకుంటున్న ఘటనలున్నాయి.

**తూరీజాత్ వంశం :**

పురశురామ్‌కు పుట్టిన వారు నలుగురు. 1. మోహలారాణి, 2.జోగలారాణి, 3. సామలరాణి, 4. హేమలారాణి. ఈ నలుగురు రాజా పమారు కుమార్తె బ్రాహ్మణ కుమారుడైన పరుశురామ్‌కు పుట్టిన వారు. వీరిని 'తూరీజాత్'గా వ్యవహరిస్తారు.

**వడితియా వంశం :**

రాధా కుటుంబంలో మోలా మరణిస్తాడు. అప్పుడు భవయ్యతో కలిసి మచ్చర్ ఘడ్ అనే పట్టణానికి వెళుతుంది. అక్కడ రాజు అనుమతితో భవయ్య ఆ వూళ్ళో ఉన్న దోమల బెడదను తన గారడీతో బందిస్తాడు. తిరిగి వాటిని బంధ విముక్తులను చేయటానికి ప్రయత్నించగా అతని తల నరికేస్తారు. భవయ్య గారడీ విద్య తెలిసిన శక్తిమంతుడవటం చేత అతని తల ఆ వూరి చుట్టు తిరగసాగింది. దాంతో భయపడ్డ రాజు ఆ వూరి జనం ఆ తలను ఊరి మధ్యలో పూడ్చారు. అప్పటి నుంచి ప్రతి గ్రామంలోని మధ్య భాగంలో 'బొడ్రాయి' అనే పేరుతో ఒక కొయ్య గాని లేదా రాయి గాని పాతే సంప్రదాయం మొదలైంది.

ఇది తెలుసుకున్న రాధా రాజును నిలదీయగా భవయ్య అంతటి గారడీ తెలిసిన గవయ్యను రాధాకు ఇస్తాడు. కొంత కాలానికి రాధా కూడా మరణిస్తుంది. దాంతో కుటుంబ పోషణను గవయ్య తన భుజాలపై వేసుకొని ఆ వూరి (గంగాఖైడ్) దగ్గరలో ఉన్నా జాబు (ఎర్రమట్టి) పర్వతం దగ్గరికి వెళ్ళి, ఆ పర్వత యజమాని దేమాగురువును, వీరి గాధను వినిపించి, ఎర్రమట్టి బస్తాకి నాలుగు (4) అణాలు చొప్పున ఇచ్చి ఆ మట్టిని ఇతర ప్రదేశాలకు తీసుకొని పోయి అమ్మి జీవనం

కొనసాగించే వారు. చివరికి వీరి సంతానం పెరగటంతో దేమా గురువు దగ్గర అప్పు ఎక్కువైంది. ఆ బాకీని తీర్చే మార్గం లేక అక్కడి నుండి పారిపోయి పాల్‌ఖేడ్ అనే గ్రామంలో చేరారు.

దేమ గురువు శిష్యుడు జాబు బ్రహ్మాణ్ తనతో కొంత మందిని వెంట పెట్టుకొని పాల్కేడ్ అనే గ్రామంలో వారిని కలిసి అప్పు అడగగా వారు మేము ఇవ్వలేమని స్థితిలో వున్నాం కొంత కాలం గడువిప్పించండని వేడుకొనెను. ఆ బాకీ వసూలు కొరకు జాబు బ్రహ్మాణ్ వారి వద్దకు తరచు వస్తూపోతూ వుండేవాడు. అతనికి పాలు ఇచ్చుటకు పరిచర్యలు చేయుటకు ఝుర్పల గారి కూతురు హంస్కిబాయి అనే అమ్మాయిని నియమించారు. యుక్తవయస్సున్న, అందెగత్తైన అమ్మాయితో జాబుగారికి సంబంధం ఏర్పడి గర్భం దారించెను. ఈ విషయం తెలిసి కులమంతా బ్రాహ్మాణ్ గారిని నిందించిరి.

అప్పుడు నన్ను క్షమించండి. నేను చేసిన తప్పుకు మా గురువుగారి అప్పు ఎదో ఒక విధంగా రద్దు చేయిస్తానని వేడుకొనగ జరిగిన దానికి ఆలోచించి సరే అన్నారు. అలాగే గురువుగారితో వాళ్ళు అప్పుతీర్చలేరని చెప్పాడు. దయామయుడైన గురువుగారు బంజారులను పిలిచి మాలాంటి వారి ఋణం ఉండటం మంచిది కాదు. మీరు మగపిల్లవాడి పెండ్లి చేసేటప్పుడు నా పేరిట 'గోసాయిదాగ్' అనే కార్యం జరిపి కుడిదండ (కుడి చేయి) మీద నేను చెప్పిన "క్వాళి ఆవె, క్వాళి జావె, ధ్వాళో ఘోఢా హంసలో, పాల్లియాసవార్. మాయిబ్యాటో పూజారి, బడోసదాన్ తల్లీ అత్రాడయొరో, ముంగె అత్రాకబాన్ సాంజ్‌పడె, గోసాయి బావ సదా! సదా!" బీజాక్షరాలు 7 సార్లు చదివి సూదిని నువ్వుల నూనే దీపంపై కాల్చిన తర్వాత చిటుక (అంటించు) వేసుకొండి. పెండ్లికి పోయేటపుడు ధ్వాళో, పిళో, (తెలుపు, పసుపు) ముడుపు కట్టి సాడీపూజెరో కార్యం చేసి, ఆ రెండు రూపాయలు ఖర్చు చేయండి. అలా చేస్తే నా బాకీ తీరుతుంది. మీకు మంచి జరుగుతుందని చెప్పాడు. అదేవిధంగా బంజారులు ఇప్పటివరకు ఈ కార్యాలను చేస్తున్నారు. తమ అప్పు తీర్చుకుంటున్నారు.

తర్వాత బాకీ రద్దు చేయించినందుకు జాబుబ్రాహ్మాణ్‌ను శిక్షించకుండా వదిలేసారు. హాంస్కిబాయి తొమ్మినెలలు పూర్తయిన తర్వాత ఒక మగ శిశు

వును కన్నది. బంజారులందరు ఆ శిశువును ఒక వటవృక్షం (మర్రి చెట్టు) కింద పాతి పెట్టాలని గుంట తవ్వారు. అందులో నుండి చలిచీమలు గుట్టలు గుట్టలుగా వస్తుంటాయి. ఇదంతా భగవంతుని లీలా అనుకొని, వడేర్‌జాడ్ (మర్రిచెట్టు) కింద రక్షించబడ్డాడు. కాబట్టి వడ్తియా (వడితియా) అని పేరు పెట్టారు. వెంటనే కాకి కావుమన్నదట. దీనికి కాకే సాక్షిఅని నిర్ధారించారు.

బ్రాహ్మణుడికి, హంస్కిబాయికి పుట్టిన పిల్లవాడికి బౌహు అని పేరు పెట్టారు. ఇతనికి ఎవరు పిల్లన్విటంలేదు. తాతగారు ఝుర్పులాగారి సలహా మేరకు బభూత్‌మూడ్ కుమార్తెను బౌహు ఇష్టపరుకొని, ఆమెను తీసుకొని వస్తాడు. ఆ రాత్రే బభూత్ మూడ్ కుమారైన సామిణిబాయితో పెళ్ళి చేస్తారు.

బౌహు, సామిణిబాయికి లహు, లహుకు కీక్, కీక్‌కు పలక్, పలక్‌కు **1.** కేంజి, **2.** పేంజి, **3.** నేంజి అనే ముగ్గురు కుమారులు పుట్టారు. **I.**కేంజికి **1.** లకావత్, **2.** నూణావత్, **3.** ధారావత్, **4.** గుగులోత్ అనే నలుగురు కుమారులు పుట్టారు. **II.** పేంజికి **1.** హాలావత్, **2.** కుణోసోత్, **3.** జేట్, **4.** భరోత్, **5.** బోడ, **6.** జళోత్, **7.** తేజావత్ అనే ఏడుగురు కుమారులు పుట్టారు. **III.** నేంజి. **1.---** **2.---**, **3.---** (ముగ్గురు పేర్లు పరిశోధనలో తెలియలేదు). వీరినే 'తీడ్‌తగత్ చౌదఘర్ వడ్తియా' అంటారు. వీరు వడ్తియా గోత్రంగా, వడ్తియా వంశంగా ప్రసిద్ధికెక్కారు. ఇందులో జాదవ్ అనేది కూడా మిళితమైంది.

**అజ్మీరా వంశం :**

వడ్తియా వారి నుండి అజ్మేరా జాతి పుట్టింది. వడ్తియా గోత్రంలో బర్మావతు భీమ్లా, భీక్రిబాయికి చాలా కాలం వరకు సంతానం లేదు. దాంతో 'అజ్మీర్‌ఘడ్'లో ఒక సాధువున్నాడని, వారి దయవల్ల సంతానం పొందాలని బయలుదేరి వెళ్ళారు. వారి పోయే మార్గంలో అజ్మేర్ వాడి (వాముతోట) కన్పించెను. ఆ తోటలో ఒక మగ శిశువు ఏడుపు విని, చూసి, భగవంతుడే మనకు ఈ పిల్లవాడినిచ్చాడనుకొని, బాలున్ని తీసుకొచ్చారు. అతను అజ్మేర్ వాడిలో దొరికాడు కాబట్టి అతనికి 'అజ్మేరా' అని పేరు పెట్టారు.

ఈ పిల్లవాడికి ఎవరు పిల్లనివ్వటానికి ఇష్టపడరు. ఆ గ్రామంలో ఒక

సద్గుణవతి తన కూతురును ఇవ్వటానికి ముందుకొచ్చింది. మంచి ముహూర్తంలో పెళ్ళి చేసారు. వారికి 1. సీతా, 2. సామా, 3. తోటా, 4. బాండా, 5. మన్నా, 6.బల్లా అనే ఆరుగురు కుమారులు పుట్టారు. వారు వడ్తియా గోత్రంతో, అజ్మీరా వంశంతో ప్రసిద్ధికెక్కారు.

మొత్తంగా వెరసి బంజారులు గోత్రాలు నాలుగుగా ఏర్పడ్డారు. అవి 1. పమార్ దీన్నె పవార్ అంటున్నారు, 2. చౌహాన్, 3. రాథోడ్ (భూక్యా, బాణోత్), 4. వడ్తియా. ఈ గోత్రాలు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలో ఉన్నాయి. ఇవన్నీ క్షత్రియ సంతతికి చెందిన వర్ణాలు కాబట్టి క్షత్రియ వర్ణాలుగా పిలువబడుతున్నాయి.

## క్షత్రియేతర వర్ణాలు : ఉపతెగలు (వర్ణాలు)

బంజారాల్లో అగ్ర, నిమ్న కులాల తారతమ్యాలున్నాయి. వారు చేసే వృత్తిని బట్టి తారతమ్యాలు ఏర్పాడ్డాయి. అవి 1.గోర్, 2. మధురె, 3. డాడి, 4. సనార్, 5. నావి, 6. ఢాలియా, 7. సీంగాడియా, 8. మారు, 9. బామిణీయా, 10. బగోరా, 11. జగోరా, 12. చరన్, 13. బాడి, 14. భాజిగార్, 15. భరావా, 16. రోహిడాన్, 17. ధన్‌కోటి మొదలైన వారిని భారతదేశంలో ఉపవర్ణాలుగా పేర్కొంటారు.

ఆంధ్రప్రదేశ్‌లో 1. భాట్, 2. డాడి, 3. ఢాలియా (డప్టియా), 4. నావి, 5. సనార్, 6. ఖాతీ అనువారు మాత్రమే ఉన్నారు. వీరితో పాటు జాంగడ్ (పెంపుడు కొడుకు) అనే ఉపవర్గం కూడా ఉంది. వీరు కూడా బంజార తెగవారే అయినప్పటికి ఒకరినొరకు పెళ్ళి సంబందాలు పెట్టుకోరు. "These groups also adpted the clan organization of main Lambada community. But inter-group marriage are strictly prohibited. All the sub-divisions are considered inferior in social status to main group" వారు లంబాడ (Lambada) అనే వ్యాసంలో పేర్కొన్నారు. క్షత్రియులైన బంజారులు వారి నిత్యావసరాలు తీర్చుకోవడం కోసం వీరిని తమలో కలుపుకున్నారు. కాని వీరిని అంటరాని వారిగానే చూస్తారు. వీరిలో డప్టియా, నావి, సనార్, ఖాతీ ప్రతి తండాలో ఒకరు ఉంటారు. ఖమ్మం జిల్లాలో ఉన్న ఉపతెగలను మాత్రమే కింద వివరించాను.

**1. డాఢీ :**

భవయ్య స్థానంలో వచ్చిన గవయ్య బంజార తెగకి చెందినవాడు కాకపోవటంతో అతనికి 'డాఢీ' అని పిలిచారు. గవయ్య కుమారులు ఝూల్‌డాఢీ, వీరి గోత్రాన్ని డమ్మాడాడి అంటారు. వారి పేర్లు 1. గాజుడాఢీ, 2. గద్రడాఢీ, 3. తాజాడాఢీ, 4. పొసావత్ డాఢీ, 5. దేపావత్ డాఢీ, 6. కానావత్ డాఢీ, 7. ఘడాసాద్ డాఢీ మొదలైవారు. వీరు 'మల్లిన' అనే గ్రామంలో నివసించేవారు. మొదట ఈ జాతికి చెందిన మలయాఢాడి ఉండేవాడు. అతని కుమారుడు మర్ధానిఢాడి. మర్ధానీ ఢాడి కుమారుడు ఝుంకాఢాడి. వారి కుమారుడు కర్టోటోఢాడి, వీరికి ముగ్గురు 1. ఖాటో, 2. భర్టో, 3. సోటా వీరందరూ బంజారా కులాలకు సంబంధించిన కథల్ని, కవితల్ని మంత్రియా ఢాడి భట్రాసు దగ్గర నేర్చుకున్నారు.

"Dhadis sing songs on family history by playing musical instruments called "Jange" and "Kinjri" during marriage ceremonies" అని Lambada అనే వ్యాసంలో పేర్కొనబడింది. వీరు తంబూర (కేంబ్రి)ను, భుజాన పెట్టుకొని లంబాడే తండాలలో ఎక్కడ పెళ్ళి, శుభకార్యాలు జరిగితే అక్కడికి వెళ్ళి వారి చరిత్రను, వీర పురుషుల గాథలను గానం చేస్తారు. ఆ తర్వాత వారికిచ్చిన ధాన్యం, డబ్బులు ఇతర కానుకలు స్వీకరించి ఆశీర్వచనాలు పలికి వెళ్ళిపోతారు.

**2. భాట్ :**

భాట్ అనగా భట్రాజు అని అర్థం. మంత్రియా భాటో భట్రాజు ఢాడి వారికి తన కవిత్వం నేర్పి ప్రయోజనం లేక భటో వంశం వారికి కవిత్వం నేర్పాడట. అట్టి భాట్‌ల పేరు 1. డమ్మబాటో, 2. ధేయావత్‌బాటో, 3. డాంగీ భాటో, 4. తారీకం భాటో, 5. సోటా భాటో, 6. సోడ్యాభాటో, 7. ఆప్వాల్ భాటో, 8. కేరాళి భాటో, 9. పితావత్ భాటో, 10. మోటావత్ భాటో, 11. సోగావత్ భాటో, 12. రోత్వాని భాటో మొదలైనవారు ఖమ్మం జిల్లాలో మాత్రం ఢాడి, భాట్ ఒకే తగగా గుర్తించబడ్డారు.

**డపడియా (డపుకోడు) :** డప్డియా అనేది బంజారా తెగలోని ఉపతెగ. డప్టియా అంటే డప్పు వాయించువాడని అర్థం. ఒక మేదరి పిల్లవాణ్ణి తెచ్చి, అతనికి

చిన్నతనం నుండే డప్పుకొట్టుట నేర్పించి, డప్డియా అను పేరు పెట్టారు. తండాకు సంబంధించిన కార్యక్రమాల్లో నాయకుడికి సహాయకులుగా ఉంటారు. నాయకుడు చెప్పిన సమాచారాన్ని డప్పు చాటించి వస్తాడు. పెళ్ళిళ్ళకు, పండుగకు, ఉత్సవాలకు, జాతర్లకు, చావుకు ఇతను డప్పుకొట్టి కార్యం నిర్వహిస్తాడు.

బంజారుల డప్పు నృత్యం ప్రత్యేకమైంది. డప్డియా డప్పు వాయిస్తుంటే, అతని చుట్టూ స్త్రీలు వలయంగా మారి(చేరి) నృత్యం చేస్తారు. అలాగే పురుషులు కూడా నృత్యం చేస్తారు. వీరికి తండాలోని వారందరితో సత్సంబంధాలు ఉంటాయి. వీరిని తండాలోని నాయకుడితోపాటూ, అందరు ఆదరిస్తారు.

**3.డప్డియా:**(డపుకోడు) : డప్డియా అనేది బంజారా తెగలోని ఉపతెగ. డప్డియా అంటే డప్పు వాయించువాడని అర్థం. ఒక మేదరి పిల్లవాణ్ణి తెచ్చి, అతనికి చిన్నతనం నుండే డప్పుకొట్టుట నేర్పించి డప్డియా అను పేరు పెట్టారు. తండాకు సంబంధించిన కార్యక్రమాల్లో నాయకుడికి సహాయకులుగా ఉంటారు. నాయకుడు చెప్పిన సమాచారాన్ని డప్పు చాటించి వస్తాడు. పండుగలకు, ఉత్సవాలకు, జాతర్లకు, చావుకు ఇతను డప్పుకొట్టి కార్యం నిర్వహిస్తాడు.

బంజారుల డప్పు నృత్యం ప్రత్యేకమైంది. డప్డియా డప్పు వాయిస్తుంటే అతని చుట్టూ స్త్రీలు వలయంగా మారి(చేరి) నృత్యం చేస్తారు. అలాగే పురుషుల నృత్యం కూడా ఉంటుంది. వీరికి తండాలోని వారందరితో సత్సంబంధాలుంటాయి. వీరిని తండాలోని నాయకుడితో పాటూ, అందరు ఆదరిస్తారు.

**4.నావి (మంగలి) :**

ఒక కొండ మంగలి జాతి పిల్లవాన్ని తెచ్చి ఆ పిల్లవానికి మంగలి పని నేర్పించి వానికి 'నావి' అని పేరుపెట్టారు. బంజారులలోనే ఉంటూ, బంజారులకే సేవ చేయటంతో వీరు కూడా ఒక బంజార ఉపతెగగా స్థిరపడ్డారు. "There are traditional barbers to Lambadas called Navi" అని Lambada అనే వ్యాసంలో వివరించారు. వీరు తండాలోని బంజారులకు ఇంటికి వెళ్ళి క్షవరాలు, గడ్డాలు చేస్తారు. వీరు చేసిన సేవకు సంవత్సరానికి ఒకేసారి పంటలప్పుడు మేర (కూలి) ఇస్తారు. వీరికి ఏ కష్టం వచ్చిన తండా నాయుకుడు ఆదుకుంటాడు.

పెళ్ళిళ్ళకు, పేంటాలకు వీరు లేనిదే కార్యం నడవదు, పెళ్ళిళ్ళలో వధువు, వరులకు మైలపోలు తీసి, కాళ్ళు చేతులకు గోర్లు కత్తిరించనిదే కార్యం జరగదు. ఇతను తండా నాయకునికి, కారోభారి (సహాయకుని)కి సహాయంగా ఉంటారు.

**5. సనార్ (కంసాలి) :**

బంజారులు వేషాధారణ ప్రత్యేకంగా ఉంటుంది. వాటిని తయారు చేయటం కొరకు కంసాలిని ఏర్పాటుచేసుకొని, వారికి 'సనార్' అని పేరు పెట్టారు. "These are endogmous sub-division called Sonar Lambadas who manufacture silver and gold ornaments" అని Lambada అనే వ్యాసంలో పేర్కొన్నారు. వీరు బంజారులుగానే ఉంటూ, బంజారా స్త్రీ, పురుషులకు కావలసిన నగలు నట్రా తయారుచేస్తుంటారు.

**6.ఖాతీ (వడ్రంగి) :**

ఖమ్మం జిల్లా బంజారుల వృత్తి వ్యవసాయం. కావున వ్యవసాయ సామాగ్రిని తయారు చేయటం కొరకు వీరు ఖాతీని తమ తండాలో ఏర్పాటు చేసుకున్నారు. వారే క్రమంగా బంజార ఉపతెగగా మారిపోయారు. వ్యవసాయ పనిముట్లను వీరు తండాలోని బంజారులకు తయారు చేసిస్తారు. అలాగే ఎడ్లబండ్లు, ఇంటి నిర్మాణాలు (జుంప్టా, జుంప్టి, పంద్రి), ఇంటి సామాన్లు తయారు చేస్తారు.

వీరిని కూడా తండాలోని నాయకుడు, ప్రజలు ఆదుకుంటారు. వ్యవసాయం పనిముట్లు చేసినందుకుగానూ, సంవత్సరానికి ఒకసారే పంటలపుడు మేర (కూలీ) చెల్లిస్తారు.

**7.జాంగడ్ (పెంపుడు కుమారుడు) :**

కొంత మంది బంజారులు తమకు పుత్ర సంతతి లేనపుడు బంజారేతర పిల్లలను పెంచుకుంటారు. అటువంటి వారిని 'జాంగడ్' అంటారు. వారికి బంజారుల పిల్లలతో పెళ్ళిళ్ళు చేయరు. అదే సంతతికి చెందిన వారి పిల్లలతో బంధుత్వం చేస్తారు. ఈ విధంగా ఏడు తరాల వరకు వారిని కలుపుకోరు. ఏడు తరాల తరువాత ఒక గొప్ప సభను ఏర్పాటు చేసి చుట్ట ప్రక్కల తండాలలోని

ఈ సంతతివారి అందరిని ఒక చోట ఆహ్వానించి కొన్ని శాస్త్రాలను చేపట్టి వారినందరిని బంజారాలతోపాటు ఒకే బంతిలో కూర్చోబెట్టి వారికి వడ్డించిన కంచంలో ఆహారంలో వారు తింటూ ఎంగిలి చేసిన అన్నాన్ని అక్కడ చేరిన తండా పెద్దలందరు ఒక్కొక్క పిడచ (ముద్ద) తీసుకొని తింటారు. ఈ కార్యక్రమం తర్వాత వారు కూడా బంజారులుగా మారిపోతారు. కొందరు ఒకే కంచంలో యాటపోతు మాంసం కూర కలిపి, జాంగడ్ తిన్న ఎంగిలి ముక్కను ఊరి పెద్దలందరు వరుసగా తింటారు. ఆ రోజు నుండి అతను కూడా బంజారుడిగా మారిపోతాడు.

## 2. 3. చారిత్రక నేపథ్యం (Historical Background) :

బంజారులకు చాలా గొప్ప చారిత్రక నేపద్యం వుంది. వీరు క్షత్రియులైన రాజపుత్రులనీ, వీరు ఢిల్లీ, రాజస్థాన్ ప్రాంతంలో రాజపుత్రులుగా రాజ్యాలేలిన క్షత్రియులని నిరూపించే ఆధారాలు 1. పృథ్వీరాజ్ చౌహాన్ (ఢిల్లీ రాజు), రాణా ప్రతాప్ సింగ్ రాథోడ్ (చిథోడ్ రాజు)ల కథలు, నేపథ్యాలు మనకు స్పష్టపరుస్తాయి.

**1. పృథ్వీరాజ్ చౌహాన్ :**

పృథ్వీరాజ్ చౌహాన్ అనే రాజు ఢిల్లీ రాజ్యాన్ని పరిపాలించేవాడు. అతనికి కుమారులు పుట్టలేదు. ఇద్దరు కుమార్తెలే పుట్టారు. వారిని పెంచి పెద్దచేసి, వారి వివాహాలు జరిపించి అల్లుళ్ళను ఇల్లరికంగా తన రాజ్యంలోనే ఉంచుకున్నాడు. కొంతకాలానికి వారిద్దరికి ఇద్దరు కుమారులు పుట్టారు. పెద్ద కుమార్తె కుమారుడు కొంచెం మందబుద్ధిగా (లేజీగా) ఉండేవాడు. చిన్న కుమార్తె కుమారుడు చురుకైనవాడు, తెలివైనవాడు. జ్ఞానసంపన్నుడు కావటంచేత పృథ్వీరాజ్ అతనికే తన సమస్త రాజ్యపాలననూ అప్పగిస్తాడు. ఆ రాకుమారుడు ఎంతో భక్తి శ్రద్ధలతో రాజ్యకార్యనిర్వహణ చేస్తుంటాడు. ఆ సమయంలో ఒక శుభముహూర్తాన ఆ రాజకుమారునికి రాజ్యాభిషేకం చేసి పెద్ద కుమార్తె కుమారునికి సర్వసైన్యాధిపతిగా పృథ్వీరాజ్ నియమిస్తాడు.

పృథ్వీరాజ్ రాజ్యంపై ఎన్నోసార్లు కాబోలు రాజైన, ముస్లీం రాజైన మహమ్మద్ (గోరీ) ఘోరీ దండయాత్ర చేసి విజయం సాధించలేక, అవమానంతో

వెనుకకు తిరిగి పోయాడు. కాని పృథ్వీరాజ్‌గారి పెద్దమనుమడైన సైన్యాధిపతి దురాలోచనాపరుడై నా పినతల్లి కుమారుడు నాకన్నా చిన్నవాడు రాజుగా ఉంటే, నేను అతని దగ్గర సైన్యాధికారిగా ఎలా వుండగలనని, ఇది నాకు అవమానమని తలచి, తన తాతగారి రాజ్యాన్ని శత్రురాజైన ఘోరీకి వశపచాలని అనుకొని ఘోరీకి వెంటనే ఒక లేఖ రాసి పంపిస్తాడు. ఆ లేఖను ఘోరీ నమ్మలేదు. మరొక లేఖలో 'నా మాటలు నిజం, నీవు నాపై నమ్మకం వుంచి మా తాతగారి రాజ్యాన్ని వశపరుచుకోవాలి' అని రాసాడు. అప్పుడు ఘోరీ ఈనాటికి పృథ్వీరాజును జయించగలననే నమ్మకంతో తెల్లవారే సరికి తన సైన్యాలతో ఢిల్లీ కోటను ముట్టడించాడు. ఈ వార్త తెలిసిన పృథ్వీరాజు తన మనుమడైన సైన్యాధిపతిని శత్రుసైన్యాలను ఎదిరించి రాజ్యరక్షణ చేయాలని ఆజ్ఞాపిస్థాడు. సైన్యాధిపతి తనకేమీ తెలియనట్లు నటించి ఘోరీని దూషిస్తూ యుద్ధానికి బయలుదేరాడు.

క్రీ.శ. 1192లో సైన్యాధిపతి తనసైన్యాన్ని తీసుకొని వెళ్ళి ఘోరితో రెండు, మూడు రోజులు పోరాడాడు. సైన్యాధిపతి కుట్రచే పృథ్వీరాజు సైనికులు చాలామంది హతమైనారు. ఈ సంగతి పృథ్వీరాజుకు తెలిసి తన మనువడు కొత్తగా సైన్యాధిపతి అయ్యాడు కనుక, ముస్లీం సైన్యాలు తమ సైన్యాన్ని ఊచకోత కోస్తున్నారని అనుకొని తనే స్వయంగా యుద్ధానికి బయలుదేరి శత్రు సైన్యాలను భయపెట్టాడు. ముస్లీం సైన్యాలు పారిపోవటానికి ప్రయత్నించాయి. ఈ సంగతి తెలిసి సైన్యాధిపతి తన సైనికులతో పృథ్వీరాజును బంధించమని ఆజ్ఞ ఇచ్చాడు. సైన్యాధిపతి మాటలను అతిక్రమించలేని సైనికులు పృథ్వీరాజును బంధించారు. వెంటనే ఘోరీ ఆజ్ఞననుసరించి ముస్లీం సైనికులు పృథ్వీరాజు కళ్ళను తీసివేసారు, చితక పొడిచారు. తర్వా బంధించి కాబోలు తీసుకుపోయి, 9 మణుగుల ఇనుప గొలుసును మెడకు, కాళ్లు చేతులకు వేసి చీకటి గదిలో (కారాగారంలో) పడేస్తారు.

ఆ విషయం పృథ్వీరాజు గురువు, మంత్రియైన చాంద్‌బర్దాయి (భట్)కి తెలుస్తుంది. అతను చాలా దుఃఖితుడై అతి కష్టం మీద కాబోలు చేరుకొని ఘోరీని దర్శిస్తాడు. తనను గురించి విషయాన్ని తెలుపుతూ, ఈ అవసాన దశలో తన రాజును, శిష్యుడిని దర్శించుకొని తనువు చాలించుకొంటానని ప్రార్ధిస్తాడు.

అప్పుడు రాజు కొంతమంది సైన్యాన్ని తన వెంట పంపి చూసి రమ్మని ఆజ్ఞాపిస్తాడు. ఇతను రాజును చూసి గౌరవంతో దూరం నుండే మహారాజా, పృథ్వీరాజా అంటూ పొగడుతూ దగ్గరికి వెళ్తాడు. చీకటి గుహలో బంధించబడి వున్న పృథ్వీరాజు ఎవరు అని అడుగుతాడు. నేను తమ గురువును చాంద్ బద్దాయిని అని చెప్పిన వెంటనే గురువుకు నమస్కారంచేయు ఉద్రేకంతో తన రెండు చేతులను పైకెత్తి నమస్కరించబోయారు. అంతలో తొమ్మిది మణుగుల ఇనుపగొలుసు పటపటమని తెగిపోయింది. ఈ దృశ్యాన్ని చూసిన రాజభటులు ఘోరీతో చెప్పారు. అప్పుడు ఘోరికి 18 మణుగుల గొలుసు వేయమని ఆజ్ఞాపిస్తాడు. అది విని చాంద్ బద్దాయి గారు చాలా దుఃఖితుడైనాడు.

చాంద్ బద్దాయి ఘోరి దగ్గరకు వెళ్ళి "అయ్యా" ఈ పృథ్వీరాజు సామాన్యుడు కాదు. ఇతనికి సమస్త అస్త్ర శస్త్ర విద్యలు వస్తాయి. ఇప్పుడంధుడైనప్పటికీ అస్త్రశస్త్ర విద్యలను ప్రదర్శించగలడు. కావాలంటే ఇప్పుడే ప్రదర్శించగలడని చెప్తాడు. అంధుడెలా అస్త్రాన్ని సంధించగలడని ఘోరీ ఆశ్చర్యంతో సరే అంటాడు. రాజుగారితో ఒక సభను ఏర్పాటు చేసి, ఆ సభ మధ్యలో ఒక స్తంభాని పాతించి ఆ స్తంభం చివరి కొనలో గంట కట్టించారు.

ఆ సభలో పృథ్వీరాజును రప్పించి, చాంద్ బద్దాయి ముస్లింలకు అర్థం కాకుండా తమ భాషలో ఇలా అంటాడు. "రాజా! ఈ అస్త్రాన్ని చేబూని నే చెప్పినట్లు ప్రయోగించు. గంట ఇక్కడికి 50 గజాల దూరంలో 5 గజాల 5 అంగుళాల ఎత్తులో వుంది. నీవు ఆ పరిధిలో అస్త్రాన్ని ప్రయోగించి గంటను ఛేదించుమ"నెను. అదేవిధంగా పృథ్వీరాజు అస్త్రాన్ని ప్రయోగించి గంటను ఛేదించాడు. అది చూసి ఘోరీ 'శభాష్ శభాష్' అని గద్దెమీద నుండి అంటాడు. వెంటనే పృథ్వీరాజు ఆ కంఠ ధ్వనిని బట్టి మరో అస్త్రాన్ని సంధించాడు. ఆ బాణానికి ఘోరీ తల ఎగిరి పడుతుంది. ప్రజలంతా హాహాకారాలతో ఘోరీ వున్న ప్రదేశానికి వెళ్ళిపోతారు.

అప్పుడు చాంద్ బద్దాయి పృథ్వీరాజుతో "అయ్యా! మీరు వదిలిన బాణానికి ఘోరీ మరణించాడు. ఇక మనగతి ఏమి" అని ప్రశ్నిస్తాడు. అందుకు రాజు వీరు మనల్ని ఎలాగైనా చంపుతారు. ఇలాంటి నీచుల చేతులలో

మరణించటం కన్నా ఆత్మహత్య చేసుకోవటం మంచిదన్నాడు. నీ కరవాలంతో నా శిరస్సు ఖండించు, తర్వాత నేను నీ కంఠాన్ని పిసికేస్తాను అని పృథ్వీరాజు చెప్పాడు. అలాగే ఇద్దరు అక్కడే మరణిస్తారు.

మహమ్మద్ ఘోరి దగ్గరున్న జనులంతా ఒక్కసారిగా పట్టండి, చంపండి వాళ్ళను అంటూ వచ్చి చూసే సరికి ఇద్దరూ చనిపోయి వుంటారు. అప్పుడు ఘోరి మంత్రి తన సైన్యాలకు ఇట్లు ఆజ్ఞాపిస్తాడు. "ఈ క్షత్రియ జాతి వాళ్ళను నమ్మరాదు. ఒక గుడ్డివాడు, ఒక ముసలివాడు మన రాజును చంపారు. ఈ జాతి వుంటే మనకు చాలాప్రమాదం. కావున ఈ జాతిని నాశనం చేయండి" అని ఆజ్ఞాపిస్తాడు.

అప్పటికప్పుడే ముస్లీం సైన్యాలు (తురక సైన్యాలు) మండిపడుతూ ముందు వెనక ఆలోచించక, ఢిల్లీ, చిత్తోడ్, ధారుణి ఘడ్, జునాఘఢ్ మొదలైన పట్టణాలకు, గ్రామాలకు వెళ్ళి క్షత్రియుల తలలు నరకసాగారు. ఇదంతా తెలుసుకున్న క్షత్రియులు అరణ్యాలపాలై పర్వత గుహల్లో, పొదల్లో దాక్కొని ప్రాణాలు రక్షించుకున్నారు. అలా తప్పించుకున్న వారిని కూడా వచ్చి నరకటం ప్రారంభించారు. అప్పుడు ఒక ఉపాయం ఆలోచించి, తమ వేష, భూషణాల్ని మార్చుకున్నారు. ముస్లీం సైన్యాలు వచ్చి ఎవరు మీరని అడిగితే క్షత్రియుల పేరు చెప్పక, ఒక అడవి జాతి పేరు లంబాడీ (తెగ)లమని చెప్పి, తమ వస్త్రాన్ని ఎర్రని మట్టితో, మోదుగ పూలరసంలో ముంచి ధరించసాగారు. తమ తల రుమాళ్ళను చీలికలు చీలికలుగా చేసి 30 గజాల పొడవుతో తయారు చేసి తలకు చుట్టకోవటం మొదలు పెట్టారు. అలా ధరించిన ధోవతిని 'రాతడ్ ధోతి' అంటారు. తలకు చుట్టిన 30 గజాల తలపాగను "తీస్ గజేర్ పాంక్డి" అంటారు మీద వేసుకున్న వస్త్రాలను "ఖ్యాళ్" అంటారు.

పురుషులు ఇలా తప్పించుకుంటే ముస్లీం సైన్యాలు స్త్రీల మీద పడి మానభంగం చేయటం, ముక్కు కోయటం, స్తనాలు కోయటం, ప్రాణాలు తీసి చిత్రహింసలు చేస్తుంటారు. అప్పుడు స్త్రీలందరు కలిసి ఆలోచిస్తారు. వారు ధరించే రంగు రంగు చీరలను, వస్త్రాలను ముక్కలు ముక్కలుగా చేసి,

రవికలన్నింటిని పారేసి, ఆ ముక్కలతో కొత్త విధంగా రవికలు తయారు చేసుకున్నారు. వెన్నుభాగం వెన్ను కనిపించేటట్లు, ముందు భాగంలో స్తనాలు కన్పించకుండా 'కాళి (కాంచళి)' తయారు చేసుకున్నారు. వారి అందమైన మోఖాలకు కర్ర బొగ్గును అరగదీసి నొసటిపైన, బుగ్గలపైన, ముక్కుకు, కణతలకు చుక్కలు పెట్టుకున్నారు. బూరుగు పూవులను చెవులకు వేలాడదీసుకున్నారు. కొన్ని పూల తీగలను హారాలుగా మెడల్లో వేసుకొన్నారు. కాళ్ళు, చేతులకు తీగ కడియాలు తయారుచేసి తగిలించుకున్నారు. పూర్తిగా రాచస్త్రీల అలంకారాలను మార్చి కొత్త వేషాలను ధరించారు. ప్రాణం కన్న మానం గొప్పదని భావించిన మీరు లంబాడీలుగా పేరు పెట్టుకున్నారు. అలాంటి సమయంలో ముస్లీం సైన్యాలు వచ్చి ఎవరు మీరు! అని ప్రశ్నించగా "అయ్యా! మేము 'లంబాడీ'లమనే అడవి జాతి వారమని నచ్చజెప్పి పంపించారు. సైన్యాలు ఎంత వెదికినా బంజారులు కనబడలేదు. దాంతో వాళ్ళు తిరిగి వెళ్ళి పోయారు.

అప్పుడు లంబాడీలందరూ కొంత కుదుట పర్చుకొని భగవంతుని ప్రార్థించారు. హే! భగవంతుడా! మమ్ములను అందరిని ఇంతటి దుస్థితికి తీసుకు వస్తావనుకోలేదు. మేము విధివశాత్తు అనుభవించిన కష్టాలు ఇక జన్మలో అనుభవించకుండా ఇక నుంచి సామాన్య మానవులుగా జీవించేందుకు కొన్ని శపథాలు చేస్తున్నాం. ఈ అరణ్యాలలోనే నివసిస్తూ ఉంటాం. మిద్దెలూ, మేడలూ కట్టకోము. గ్రామాలలో నివసించం, దీపాలు వెలిగించుకోం. మంచాలు, కుర్చీలు వంటివి వాడము. మంట వెలుగులతోనే మా నిత్యకృత్యాలు తీర్చుకుంటాం. మట్టి పొయ్యిలను వాడతాం. ఈత చాపలపైన పడుకొని కాలం గడుపుతాం. రాళ్ళ పొయ్యిల మీదనే మా వంటలు చేసుకొంటాం. తెల్లని వస్త్రాలు ధరించం. స్త్రీలను ఇలాగే లంగా, ఓణి (ఫేటియా, కాళి) వస్త్రాలతోనే ఉంచుతాం. మేము ఈ బైరాగి వేషాలతోనే కాలం గడుపుతామని శపథం చేసారు. స్త్రీలు మాములు అలంకరణకు బదులుగా తము చెవులకు వ్రేలాడతీసుకున్న బూరుగు పూల శేర్లకు బదులు వెండితో (టోప్లీలు) దిద్దులను, మెడలో వేసుకున్న పిచ్చి పూర శేర్లకు బదులు (హార్) హారాన్ని, కంఠంలో చంద్రహారాలకు బదులుగా (హంస్లీ)

కంఠకడియం ధరించారు. చేతులకు వేసుకున్న తీగ చుట్టలకు (పిళోనిర్ వేల్) బదులు ఏనుగు దంతాలు, దుప్పి కొమ్ములతో తయారైన గాజులను (బళ్యా) చేతులకు ధరించారు. కాళ్ళకు వేసుకొనే తీగలకు బదులు ఇత్తడితో తయారుచేసిన (వాంకడీ) కడియాలు వేసుకున్నారు. రకరకాల గుడ్డ పేలికలతో రంగు రంగులుగా పరికిణీలు కుట్టుకొని ధరించారు. వారు చేసిన శపథం ప్రకారం స్వరాజ్యం ఏర్పడే వరకు వారు అదే విధంగా ఉంటూ వచ్చారు కాని క్రమంగా వీరు ఈ వికృతాకారలను వదిలి పెట్టి గ్రామాలలో నివసించటం, ఇళ్ళు, మేడలు కట్టుకోవటం, మంచాలు, కుర్చీలు ఉపయోగించటం, నేల పొయ్యిలు తవ్వుకోవటం అరణ్యంలో ముఖానికి పెట్టుకున్న బొగ్గు చుక్కలను బదులు పచ్చబొట్లు పొడిపించుకున్నారు.

ఈ యుద్ధం కన్న ముందు జరిగిన యుద్ధంలో పృధ్వీరాజు గారి సైన్యం మూడు భాగాలుగా విడిపోయారు. ఒకటి రాజస్థాన్ కోటలోనూ, రెండవది అడవుల పాలు, మూడవ భాగం పర దేశాలకు పోయారు. వారినే జిప్సీలూ లేక రోమా బంజారాలు అంటారు. వీరు యూరప్ ఖండంలోని 60 దేశాలలో విస్తరించారు. రాజస్థాన్‌లో ఉన్న వారు క్షత్రియులుగా పిలువబడుచున్నారు. అడవుల పాలైనవారు కొంత కాలం తర్వాత చిథోడ్ కోటను నిర్మించుకున్నారు. వీరిలో రాణాప్రతాప్ సింగ్ ముఖ్యులు. వీరు అక్బరు బాదుషా కాలంలో యుద్ధాలు చేసి చేసి వారి ధాటికి తట్టుకోలేక మళ్ళీ అడవుల పాలయ్యారు. కొంత కాలానికి పశువులను సేకరించుకొని, బంజారులుగా మారి పశువులపై వస్తు సామాగ్రిని, నిత్యావసర వస్తువులను వేరే ప్రదేశాలకు చేరవేస్తూ జీవనం సాగించారు.

ఈ విధంగా రాజపుత్రులైన బంజారులు లంబాడీలుగా మారారని ఈ ఐతిహ్యం వల్ల తెలుస్తుంది. ఇలాంటి నేపధ్యాలున్న లంబాడీలు ఇప్పటికే తమ రాచఠీవిని ప్రదర్శిస్తుంటారు.

## 2. రాణా ప్రతాప్ సింగ్ రాఠోడ్ :

భారత దేశంలో మొగలుల పాలన ప్రారంభానికి ముందు కొన్ని రాజవంశాలు చిన్న చిన్న సంస్థానాలను పాలిస్తూ వుండేవారు. అలాంటి వంశాలలో రాజపుత్ర వంశం ఒకటి. వీరిలో సుప్రసిద్ధుడు రాణా ప్రతాప్ సింగ్. ఇతను రాజస్థాన్,

ఢిల్లీలోని కొన్ని ప్రదేశాలను పాలించాడు. అప్పటికే భారతదేశంలో ముస్లీంల పాలన ప్రారంభమైంది. ఈ సమయంలో మొగలు సామ్రాట్ అక్బర్ క్రీ.శ॥ **1576**లో ఉదయపూర్ మీద దాడి చేసాడు. ఈ దాడిలో అక్బర్ ప్రతాపానికి తట్టుకోలేక రాణా ప్రతాప్ హలధిఘాట్ అనే ప్రాంతానికి పారిపోయాడు. ఎంతో మంది రాజభక్తి గల కుటుంబాలు అక్కడికి వెళ్ళారు. మళ్ళీ అక్కడ కూడా ఆక్రమణ జరిగింది. అందువల్ల ప్రతాప్ సింగ్ హలధిఘాట్ యుద్ధంలో ఓటమిని అనుభవించవలసి వచ్చింది.

విజయుడైన అక్బరు నీవు శరణాగతుడవై వస్తే తిరిగి నీ రాజ్యాన్ని ఇస్తాను అని సందేశాన్ని పంపాడు. అప్పుడు వీరక్షత్రియుడైన రాణా ప్రతాప్ సింగ్ "నేను నా శక్తి సామర్ధ్యాలతో రాజ్యాన్ని తిరిగి పొందుతానే కాని శరణాగతుడను కాను" అని తన రాజ్యాని పొందేవరకు తాను అరణ్యంలోనే నివసిస్తానని ప్రతిజ్ఞ పూని అడవికి చేరాడు. అతనితోపాటు ఎంతో మంది సైనికులు కూడా వెళ్ళారు. ఇదే సమయంలో రాజపుత్రులు మీద మొగలుల అత్యాచారాలు ఎక్కువ అయ్యాయి. దీనితో అనేక రాజపుత్ర కుంటుంబాలు కూడా అడవిలో తలదాచుకున్నాయి. తమ రాజతోపాటు అనేక కష్టనష్టాలు అనుభవిస్తూ రాజు చేసిన ప్రతిజ్ఞే తమ ప్రతిజ్ఞ అని భావిస్తూ వచ్చారు. ఆ ప్రతిజ్ఞా ఎమిటంటే "ఈ భారతదేశానికి 'సర్వ స్వాతంత్రం' వచ్చేవరకు చిథోడ్ కోటలో కాలు పెట్టమని చుట్టే గుడిసెలలో కాపురం చేస్తామని, కఠిన నేలపై పడుకుంటామని, మట్టి పాత్రలో భోజనం చేస్తామని" ప్రమాణంచేసారు. అదే ప్రకారం బంజారాలు బంజార భూములలో, గ్రామాలకు దూరంగా, అరణ్యాలకు దగ్గరలోని బంజార భూములలో నివాసాలేర్పాటు చేసుకొని వ్యవసాయం, వ్యాపారాలు నేర్చుకొన్నారు. కాని స్వాతంత్రం వచ్చే వరకు చదువు సంధ్యలు లేక జీవనం సాగించారు. దురదృష్టవశాత్తు రాజప్రతిజ్ఞ నెరవేరలేదు. ఆ దిగులుతో రాజాప్రతాప్ సింగ్ మరణించాడు. కాని మొగలు సైన్యం రాజాప్రతాప్ సింగ్‌ని వెతకటానికై తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించాయి

ఈ సందర్భంలో మొగలుల దాడి నుండి తమను తాము సంరక్షించుకోవటానికి వారు చాలా కష్టాలు ఎదుర్కొన్నారు. ఈ కష్టాలను

ఎదుర్కొనే శక్తిలేక మార్వాడి, గూర్జరి మొదలైన వంశాలు తిరిగి తమ నివాసస్థానమైన రాజస్థాన్‌కు వెళ్ళారు. ఈ బంజారులు మాత్రం అడవిలోనే మిగిలిపోయి ప్రతాప్ సింగ్ ప్రతిజ్ఞను అనుసరిస్తూ సంచార జీవులైనారు.

**3. జంగి - భంగి :**

రాణాప్రతాప్ సింగ్ మరణంతో అడవులలో వుండిపోయిన ఈ బంజారులు కాలక్రమంలో జీవనోపాధి కోసం పశువుల పెంపకం చేపట్టారు. దీని వల్ల ప్రతి ఒక్క కుటుంబానికి చాలినంత పశుసంపద పెరిగింది. వీరు తమ పశు సంపదతోపాటు మాతృభూమియైన 'రాజస్తాన్, పహాడ్‌ఘడ్' ప్రదేశాలను వదిలి దక్షిణం వైపు పయనించారు. బంజారులు మొగలు సైన్యానికి, ఆహారధాన్యాలను, యుద్ధసామాగ్రిని సరఫరా చేసేవారు. రాథోడ్ గోత్రానికి చెందిన 'జంగి-భంగి' వాళ్ళ నేతృత్వంలో ఎద్దులపై లదణి (బిడారి) వ్యాపారాన్ని సాగిస్తూ వచ్చారు. జంగికి 1,80,000 పశువులు, భంగికి 52,000 పశువులు ఉండేవట.

షాజహాన్ కాలంలో అతని వజీర్ అయిన అసఫ్‌ఖాన్ నేతృత్వంలో దక్షిణ బీజాపూర్ ఆదిల్‌షా మీద ఆక్రమణ చేయటానికి క్రీ.శ॥ 1630 సంవత్సరంలో బంజారులు మొగలు సైన్యంతోపాటు దక్షిణానికి వలస వచ్చారు. కాలక్రమంలో అక్కడే స్థిరపడ్డారు. యుద్ధ సమయాలలో సైన్యానికి వీరు నిర్భయంగా ఆహారపదార్థాలు సరఫరా చేస్తుండేవారు. యుద్ధం చేస్తున్న మరో పక్షం కూడా వీరిని పీడించేవారు కాదు.

సంచార సమయంలో, యుద్ధ సమయంలో జంగీ-భంగీ నాయకులు పశువులకు ఆహారం కోసం అసఫ్‌ఖాన్ దగ్గరికి పోయి తమ ఇబ్బందిని చెప్పుకున్నారు. జంగీ-భంగీ సేవలను పొందిన వాడు కావున అసఫ్‌ఖాన్ వారికి సువర్ణాక్షరాలతో తామ్ర (రాగి) ఫలకం మీద ఒక శాసనం (అధికారాన్ని) రాసి ఇచ్చాడు. ఆ శాసనమందు

"రంజన్ కాపాణీ, ఛప్పర్ కా ఘాస్!
దిన్‌కా తీన్ ఖూనీ మాఫ్!!
ఔర్ జహాఁ ఆసఫ్‌ఖాన్ కా ఘోఢే!
వహా జంగీ-భంగీ కా బైల్!! "అని వుంది. దీనికి తోడు నాయకుని

స్థానంలో వచ్చే ప్రతి ఒక్క బంజారా వ్యక్తికి నిజాం సర్కారు నుండి గౌరవం బహుమతి పంపేవాడు. ఈ అధికార శాసనం హైదరాబాదు కోర్టు ప్రవేశ ద్వారం వద్ద వున్న ఖిలాత్ అధికార పత్రరూపంలో దొరుకుతుందట. అదే విధంగా గోల్కొండ కోటలో వీరి కొరకు ఒక ప్రత్యేక ద్వారాన్ని ఏర్పాటు చేయించాడు. దీన్నే 'బంజారా ద్వారం' అంటారు. ఈ విధంగా బంజారులు నైజం రాజ్యంలో అధికారాన్ని పొంది ఉన్నారు.

ప్రస్తుతం హైదరాబాదులోని బంజారాహిల్స్ అని ఉన్న కొండ ప్రాంతా ఒకప్పుడు వీరు తండాలనీ నిర్మించుకొని తమ గోవులను ఆహారం నీటి వసతిని కలిగి వున్న ప్రాంతం. బంజారా హిల్స్ అని పేరు. నిలిచిపోయింది కానీ బంజారులు మాత్రం లేకుండా చేసారు.

ఆ కాలంలోనే వడితియా గోత్రంలోని ప్రముఖుడు శ్రీ భగవాన్‌దాస్ నవాబ్‌గారి వద్దకు వెళ్ళి తాము కూడ జంగీ-భంగీ లాగనే ఆహార పదార్థాలు, యుద్ధ సామాగ్రిలను అందిస్తున్నాం కావున మాకు ఒక తామ్రపత్రం ఇవ్వాలని కోరారు. అందుకు నైజాం నవాబు అంగీకరించలేదు. దాంతో భగవాన్‌దాస్ జంగీ-భంగీ వల్లే తమకు నవాబు తామ్రపత్రం ఇవ్వలేదని అనుకొని జంగీ-భంగీ నవాబు దర్బారు నుండి కోట బయటకు వచ్చే సమయంలో కాపుకాచి తన సైన్యంతో వారిని చంపేస్తారు. ఇది తెలుసుకున్న భంగి కుమారులు నారాయణ భంగి వందలాది మంది సైనికులతో వెళ్ళి భగవాన్‌దాసును, వారి సైన్యాన్ని సంహరిస్తారు. వారి వద్ద ఉన్న సువర్ణాక్షరాలతో లిఖించబడిన తామ్రపత్రం మళ్ళీ వారి హస్తగతం చేసుకుంటారు.

ఈ పై మూడు ఐతిహ్యాలు, నేపథ్యాల వల్ల బంజారులు రాజపుత్ర వంశానికి చెందిన వారని స్పష్టమౌతుంది. వీరి వృత్తి వ్యాపారమని, వీరు ఉత్తర భారతం రాజస్థాన్ నుండి దక్షిణం వైపు వచ్చి హైదరాబాదు పరిసర ప్రాంతంలో నివసించారని తెలుస్తుంది. వీరే కాలక్రమేణ ఆంధ్రదేశమంతట వ్యాపించి, గ్రామానికి దూరంగా అడవులకు దగ్గరగా బంజరు భూములలో, కొండ ప్రాంతాలలో తమ నివాసాలను నిర్మించుకొని, గుంపులు గుంపులుగా తమ

తండాను ఏర్పాటు చేసుకున్నారు. వ్యవసాయాన్ని నేర్చుకున్నారు. విద్య నేర్చుకొని, తెలివి తేటలతో అనేక వృత్తులు, ఉద్యోగాలు చేస్తున్నారు. రాజస్థాన్‌లోని రాజపుత్ర గూర్జారి, మార్వాడి మొదలైన ఉప జాతులలో కనిపించే ఆచార వ్యవహారాలు, వీరిలో కనిపిస్తాయి. కాబట్టి వీరి మూలస్థానం రాజస్థానేనని, వీరు క్షత్రియులైన రాజపుత్రలేనని స్పష్టమౌతుంది.

ప్రస్తుతం కూడా వీరి యొక్క రాజఠీవి, క్షత్రియ లక్షణాలు కనిపిస్తాయి. ఆకారంలోనూ, వేష భాషలలోనూ, వ్యవహారాలలోనూ జీవన విధానంలోను వీరు క్షత్రియ పుత్రులేనని స్పష్టమౌతుంది.

బంజారులు బంజారేతరులతో కలిసి ఉండటానికి ఇష్టపడతారు. అందుకే గ్రామాలకు దూరంగా ప్రత్యేకంగా ఒక తండాను ఏర్పాటు చేసుకుంటారు. ఆ తండాలోనే సకల సౌకర్యాలు ఏర్పాటు చేసుకుంటారు. రాజులు ఏర్పాటు చేసుకున్నట్లే ఒక ప్రత్యేక వ్యవస్థను నిర్మించుకుంటారు. ఒక తండాకు ఒక నాయకుణ్ణి (నాయక్) ఎన్నుకొంటారు. నాయకునికి సహాయకుడిగా 'కారోభారి' (సలహాదారుడు), డప్డియా (డప్పువాయించువాడు) ఉంటారు. రాజ్యాధికారాలు వంశపారంపర్యంగా ఉన్నట్లే, ఈ నాయకత్వం కూడా ఉంటుంది. రాజుమాటకు తిరుగులేనట్లే, నాయకుడి మాటకు తిరుగుండదు. ఆయన మాటే శాసనం.

ఈ నాయకుడు గ్రామంలోనే పంచాయతీ 'నసాబ్' చేసి న్యాయాన్ని కాపాడి తీర్పు ఇస్తుంటాడు. వీరు ఇచ్చే తీర్పును శిరసావహించవలసిందే. తండాలో జరిగే పండుగలు, పెళ్ళిళ్ళు, జాతరలు, చావు, పుట్టుక మొదలైనవి ఏవైనా నాయకుని ఆధీనంలోనే జరుగుతుంటాయి.

బంజారులు తమకు కావలసిన అవసరాలనూ తీర్చుకోవటం కొరకు వారికి అవసరమైన వారికి శిక్షణ ఇప్పించి, వారి తెగలోనే ఉప తెగాలుగా స్వీకరిస్తారు. అలాంటి వారే డప్డియా, బాట్, డాడి, నావి, సనార్, ఖాతీ మొదలైన వృత్తి వారు.

ఇలాంటి వ్యవస్థను నిర్మించుకొని పరిపాలన, జీవనం కొనసాగిస్తున్నందు వల్ల వీరు పూర్వం రాజపుత్రులైన క్షత్రియులేనని నిర్ధారించవచ్చు.

## 2.4. ఖమ్మం జిల్లా బంజారులు

స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ నిర్మాతలు భారత రాజ్యాంగంలో గిరిజనుల కొరకు కొన్ని ప్రత్యేకమైన నిబంధనలను రూపొందించారు. భారత రాజ్యాంగంలో షెడ్యూల్ తెగలకు నిర్దేశించబడిన రిజర్వేషను సౌకర్యం, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో నివశిస్తున్న బంజారా (సుగాలీ)లకు 1950వ సంవత్సరం నుండి అమలులో ఉంటే, తెలంగాణాలోని బంజారులకు 1976వ సంవత్సరం నుండి అమలులోనికి వచ్చింది. అప్పటి నుండి ఖమ్మం జిల్లాలో బంజారులకు ప్రభుత్వం అమలు చేసిన "సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ" ద్వారా ఎంతో మేలు చేకూరుతుంది. గిరిజనుల అభివృద్ధికి, ప్రగతికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు జరుపుతుంది. ఐనప్పటికి ఇప్పటికీ ఖమ్మం జిల్లాలోని బంజారా గిరిజన తెగ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎంతో వెనుకబడి వుంది. ఖమ్మం జిల్లాలోని షెడ్యూల్ తెగలలో బంజారా (లంబాడీ) పెద్దతెగ.

బంజారులు జీవన విధానం విలక్షణమైంది. వైవిధ్య భరితమైంది. వీరి జీవన విధానం ఒక భిన్నమైన వేషధారణను, ఆహారపు అలవాట్లను, గృహ నిర్మాణాలను, రాజకీయ సామాజిక వ్యవస్థను కలిగి ఉంది. వీరు ప్రత్యేకమైన భాషా సాంస్కృతిక విధానాన్ని కలిగి, మిగతా సమాజంతో తక్కువ సంబంధాన్ని కలిగి వున్నారు.

**జీవన విధానం :**

బంజారులు బ్రిటీషు పరిపాలనా కాలంలో సరుకుల రవాణాను ప్రధాన వృత్తిగా చేపట్టిన చారిత్రక ఆధారాలున్నాయి. వీరు ఆహార ధాన్యాలు, ఉప్పు, సుగంధ ద్రవ్యాలు చేరవేస్తూ మంచి రవాణాదారులుగా ఖ్యాతి గడించారు. వీరు రవాణా కొరకు ఎడ్లను, గుర్రాలను, ఒంటెలను ఉపయోగించారు. భారతదేశంలో బ్రిటిషువారు ఎన్నో రాజ్యాలను తమ హస్తగతం చేసుకొని పాలించటం జరిగింది. రానురాను రవాణా సౌకర్యాలు కల్పించి వాణిజ్యాన్ని అభివృద్ధి పరిచే ఉద్దేశంతో బ్రిటిషువారు రోడ్లు, రైలు సౌకర్యాలు ఏర్పాటుచేసుకున్నారు. తద్వారా బంజారుల రవాణా వ్యవస్థ మరుగును పడి వృత్తిని కోల్పోయారు. అప్పటికే భారతదేశమంతటా వ్యాపించి ఉన్న బంజారులు ఎక్కడికక్కడే వివిధ రవాణాలావాదేవిలను

పరిష్కరించుకొని గుంపులు గుంపులుగా ఎవరికి అనుకూల ప్రదేశాల్లో వారు స్థిర నివాసాలు ఏర్పరచుకొని, వారి వారి వృత్తులను ఏర్పరుచుకున్నారు. అలాగే ఖమ్మం జిల్లాలోని బంజారులు ప్రధానంగా వ్యవసాయం, పశుపోషణను ప్రధాన వృత్తులుగా చేపట్టి స్థిరపడ్డారు. తమ పశువులకు అనుకూలంగా ఉండే ప్రదేశాలను, తమ పశువులకు ఎల్లవేళలా గ్రాసాన్ని అందించే అడవి ప్రాంతాలలో, కొండవాలు ప్రాంతాలలో, అరణ్య మైదాన ప్రాంతాలలో, నదీ తీర ప్రాంతాలలో గుంపులు, గుంపులుగా నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ గుంపునే 'తండా' అంటారు. క్రమంగా వ్యవసాయం నేర్చుకున్నారు. ఇదే ఇప్పుడు వీరి ప్రధాన వృత్తిగా మారింది.

**తండా :**

'తండా' బంజారుల నివాసప్రాంతం. 'తండా' శబ్దాన్ని అక్బర్ బాదుషా ఆవిష్కరించినట్లు చరిత్ర చెబుతుంది. 16వ శతాబ్దానికి ముందు బనారస్ సమీపంలో గుంపులుగా ఏర్పడిన బంజారా నివాసాలను అక్బర్ 'తండా' అని పేరు పెట్టాడట. బంజారులు అప్పట్లో సంచార జీవనాన్ని కొనసాగిస్తుండేవారు. 16వ శతాబ్దంలో కత్వాలు, జులహాలు ఆ ప్రాంతంలో స్థిరనివాసాలు ఏర్పరుచుకున్నారు. 18వ శతాబ్దంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ ఏజెంట్లు వాణిజ్య కేంద్రాలను స్థాపించారు. ప్రస్తుతం ఆ తండా ఒకే ప్రత్యేక వాణిజ్య కేంద్రంగా ఉంది. బంజారుల నివాసాలకు అక్బరు ఆనాడు పెట్టిన పేరే నేటికీ పిలువబడుతుంది.

బంజారుల నివాస ప్రదేశమైన 'తండా' ఒక చిన్న గ్రామాన్ని పోలి వుంటుంది. సాధారణంగా బంజారులు అటవీ ప్రాంతాల్లో, మిగిలిన కులాలకు దూరంగా, బంజరు భూములలో నివాసాలు ఏర్పాటుచేసుకుంటారు. వీరికి ఇండ్లు కట్టుకోవటానికి భూపరిమితి అంతగా ఉండదు. వీరు తమకనుకూలమైన భూమిని చదును చేసుకొని దీర్ఘ చతురస్రాకారంగా గుడిసెలను, పూరిళ్ళను నిర్మించుకుంటారు. మట్టిని, రాళ్ళను ఇళ్ళ నిర్మాణానికి వాడతారు. ఇళ్ళకు ఎడమవైపు కాని, ఎదురుగా కాని పశువుల కొట్టాలను నిర్మించుకుంటారు. ఇంటిపై కప్పును పూరి లేదా వరిగడ్డి లేదా జొన్నచొప్ప లేదా సజ్జ చొప్ప లేదా అడవిలోని మొదుగాకులతో కప్పుతారు. ఇళ్ళకు ఎదురుగా లేదా పక్కన గుంజలతో నిర్మించిన

పందిరి ఉండి, రేండు లేదా మూడు వైపులా మట్టితో కట్టిన గోడలు కలిగిన కొట్టాలు పశువుల కొరకు నిర్మించుకుంటారు.

**తండాలో రాజకీయ వ్యవస్థ :**

ఖమ్మం జిల్లాలో నివసించే బంజారులకు ప్రత్యేకమైన సామాజిక కట్టుబాట్లు ఉంటాయి. బంజారులు తండా న్యాయవ్యవస్థకు, స్వరాజ్యపాలనకు కట్టుబడి వుంటారు. వివాదాలను పరిష్కరించే న్యాయవ్యవస్థ తండా పంచాయితీ ద్వారానే కొనసాగుతుంది. తండా రాజకీయ వ్యవస్థలో 'నాయక్ (నాయకుడు), కారోభారి (సలహాదారుడు, కార్యదర్శి), డప్టియా (సమాచారం, సందేశాన్ని చేరవేసేవాడు)' మొదలైన వారు ఉంటారు. బంజారులు నిర్వహించే పంచాయితిని 'నసాబ్' అని అంటారు. 'నసాబ్' అంటే సమస్యా పరిష్కారానికి జరిపే సామూహిక పంచాయితీ అని అర్థం. ఈ 'నసాబ్'కి తండా 'నాయక్' అధ్యక్షత వహించి 'కారోభారి' సలహామేరకు కొనసాగిస్తారు. వాద ప్రతివాదనలు విన్న తర్వాత తండా ప్రజల అభిప్రాయాల మేరకు 'నాయక్' ఒక తీర్మానాన్ని, తీర్పును ప్రకటిస్తాడు. 'నాయక్' పంచాయితీలో తీసుకున్న నిర్ణయమే శిరోధార్యం. అటువంటి నిర్ణయాన్ని వాద ప్రతివాదులు తప్పక పాటించవలసిందే. లేని పక్షంలో కుల బహిష్కరణకు లేదా గ్రామ బహిష్కరణకు గురి కావలసి వస్తుంది. బంజారులు భారత న్యాయవ్యవస్థలో భాగమైనప్పటికీ చట్టపరమైన తీర్పుల కంటే కుల పంచాయతీలలో తీసుకున్న నిర్ణయాలకే ప్రాధాన్యత ఇస్తారు. ఒకవేళ తండా పంచాయితీ తీర్మానం తమకు ససేమీరా వద్దనుకున్నప్పుడు మాత్రమే భారత ప్రభుత్వ న్యాయవ్యవస్థలను ఆశ్రయిస్తారు.

**పంచాయితీ  నిర్వహించే పద్ధతి :**

ఖమ్మం జిల్లా బంజారులు తండాలో నిర్వహించే పంచాయితీ పద్ధతి ఎంతో విలక్షణంగా ఉంటుంది. ఆర్జీదారు తనకు జరిగిన అన్యాయాన్ని తండా నాయక్, కారోభారీలకు విన్నవించిన తరవ్వాత 'డప్టియా' ద్వారా తండావాసులకు సందేశాన్ని పంపిస్తారు. సందేశకర్త అయిన 'డప్టియా' ఒక విలక్షణమైన రీతిలో డప్పును వాయిస్తూ, తండా వాసులకు నాయకుడి సందేశాన్ని తెలియజేస్తాడు.

'నాయక్' నిర్దేశించిన సమయంలో ఒకచోట అందరూ సమావేశమై పంచాయితీ నిర్వహిస్తారు. పంచాయితీ మధ్యలో వాద ప్రతివాదనల సందర్భంలో 'సాకీసాత్రాలు' (పొడుపు కథలు, సామెతలు) చెప్తూ లోకంపోకడ గురించి తెలియజేస్తూ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నం చేస్తారు. దీనిని బట్టి బంజారులకు తండా పంచాయితీ ఎంత ముఖ్యమైన న్యాయ్యవస్థగా తండాల్లో ఉందో తెలుస్తుంది. బంజారులు ఇప్పటికీ తమ జాతి పంచాయితీ వ్యవస్థనే ఎక్కువగా విశ్వసిస్తారు. గోర్‌కుల పంచాయితీ వ్యవస్థ ద్వారానే తమ సామాజిక, వివాహ సంబంధ వివాదాలను పరిష్కరించుకుంటున్నారు.

పంచాయితీకి సమావేశమైన తండావాసులు, నాయక్, కారోభారీలు గుండ్రంగా కూర్చుంటారు. పంచాయితీ నిర్వహించి వాద ప్రతివాదనలు విన్న తర్వాత అందరూ చర్చించి పరిష్కారాన్ని నిర్ణయిస్తారు. పంచాయితీ ముగిసిన తర్వాత వాద ప్రతివాదుల చేతులు కలుపుతారు. తర్వాత అందరూ సారా తాగి వెళ్లిపోతారు. బంజారుల న్యాయపంచాయితీ సాధారణంగా తండా 'నాయక్' ఇంటి ఆవరణలో కానీ ఏదైనా సమావేశాలనుకూల ప్రదేశంలో కాని నిర్వహిస్తారు. ఒక వేళ పంచాయితీ రెండు లేదా మూడు తండాల మధ్యలో జరిగినట్లయితే ఆయా తండాల పొలిమేరలలో ఎక్కడో ఒకచోట అనుకూల ప్రదేశంలో నిర్వహిస్తారు. అలాంటి పరిస్థితుల్లో ఇతర తండాల 'నాయక్', 'కారోభారీ'ల సమన్వయంతో పంచాయితీ నిర్వహించబడుతుంది. పంచాయితీ నిర్వహణకయ్యే ఖర్చులు వాదప్రతివాదుల నుండి వసూలు చేయటం జరుగుతుంది. పంచాయితీ పూర్తయిన తర్వాత పంచాయితీకి వచ్చిన తమ తోటి గిరిజనులకు, అతిధులకు సారా పంపకం చేస్తారు. పంపకం జరిగిన తర్వాత 'నాయక్' అందరి వైపు సారాను చూపిస్తూ 'దారూ లోర్ నాయక్' అని అనుమతిస్తాడు. తర్వాత అక్కడ వున్న వారందరూ 'దారూ లోర్ నాయక్' అని ప్రతివాదం చేస్తూ అందరూ సారా సేవిస్తారు. ఈ విధంగా ఖమ్మం జిల్లా బంజారుల పంచాయితీ వ్యవస్థ కొనసాగుతుంది. ఒక వేళ పోలీస్‌స్టేషన్లలో కేసు నమోదు అయినా, చివరికి ఆ కేసు కుల పంచాయితీతోనే ముగుస్తుంది.

**భాష :**

బంజారులకు ప్రత్యేకమైన భాష ఉంది. 'గోర్‌బొలి', 'గ్వారేర్ వాత్'గా ఈ భాషను పేర్కొంటారు. తెలుగు భాష శాస్త్రవేత్తలు బంజార భాషను ఇండో ఆర్యన్ భాషలో చేర్చారు. కానీ ఈ భాషకు లిపి మాత్రం లేదు. ఖమ్మం జిల్లా కొత్తగూడెం నివాసి 'భూక్యా బాలాజీదాసు రాఠోడ్' బంజార భాషకు లిపి కనిపెట్టి, అనేక గేయాలు, రచనలు చేసినప్పటికి, ప్రభుత్వ కృషి లేనందున అది మరుగున పడింది. ప్రస్తుతం వీరి భాషను తెలుగు లిపిలోను రాస్తున్నారు. వీరి లిపి ఆమోదం పొందితే ఆచార వ్యవహారాలు అంతరించిపోకుండా చూడవచ్చు. నేను ఈ గ్రంథాన్ని తెలుగు లిపిలో రాసే అవకాశం ఉండేది కాదు.

**వస్త్రధారణ :**

ఖమ్మం జిల్లా బంజారుల వస్త్రధారణ ఒక ప్రత్యేకతను కలిగి వుంది. వీరి పిల్లలు, యువకులు, వయోవృద్ధుల వేషధారణలో అంతగా వ్యత్యాసం లేకున్నమా స్త్రీలు మాత్రం ఒక ప్రత్యేకమైన వస్త్రధారణ కలిగి వుంటారు. బంజారుల్లో వివిధ వయస్సులో ఉన్నవారి వేషధారణ ఎలా ఉంటుందో పరిశీలించినట్లయితే వారి జీవన సరళిలోని విశిష్టత తెలుస్తుంది.

బంజారా స్త్రీలు 'కాళి' (రవిక)ను ఛాతీ భాగానికి, 'ఫేట్యా (లంగా)ను నడుముకు, 'టుక్రి', 'ఘూంగ్టో' (ముసుగు, పైటా వంటి తలనూ, వంటినీ కప్పుకునే దుపట్టా) ధరిస్తారు. కాళి, ఫేట్యా, ఘూంగ్టోలు కొన్ని రంగుల గుడ్డముక్కలను ముఖ్యంగా ఎరుపు, నీలం, పసుపు, నలుపు, ఆకుపచ్చ రంగుల్లో సమ్మిళితం చేసి కుడ్తారు. స్త్రీల వస్త్రాలపై చతురస్రాకార (పలుకల), వృత్తాకార (గుండ్రంగా) అద్దపు ముక్కలను అలంకరణ కొరకు వాడుతారు. ఇట్టి వస్త్రధారణ రంగుల మయంగా ఉండి చూపరులను ఆకట్టుకొనే విధంగా ఉంటుంది.

బంజారా స్త్రీల వస్త్రాలు వారే కుట్టుకుంటారు. బంజారా స్త్రీలు కుట్టుపనిలో బాగా ఆరితేరినవారు. తమ కాళీ ఫేట్యాలపై ఒక ప్రత్యేకమైన అల్లికను కుడతారు. రంగు రంగుల దారాలను, రంగురంగుల ఖాదీ గుడ్డలను తమ వస్త్రాల అలంకరణకు ఉపయోగిస్తారు. అద్దాలను, రూపాయి బిళ్ళలను అక్కడక్కడా

అమర్చి అందంగా కుడతారు. ప్రస్తుత కాలంలో, సమాజంలో బంజారా కుట్టు చాలా ప్రాచుర్యాన్ని పొందుతుంది. బంజారుల వేషధారణను పోలిన ఫ్యాన్సీ డ్రస్సులు, గీతాంజలి డ్రస్సులు ఆధునిక సమాజాన్ని ఆకర్షిస్తున్నాయి.

బంజారా పురుషులు అతి సాధారణ ధోవతి, చొక్కా ధరిస్తారు. ఒక ఎర్రని పొడవైన దుపట్టాను తలపై రుమాలుగా ధరిస్తారు. ఒక సామాన్య బంజారా వయోజనుడి ధోవతి, చొక్కా ఎర్రమట్టిలో పులిమిన రంగులో ఉంటాయి. కొంత మంది తెలుపు లేదా నీలిరంగువి వాడతారు. రుమాలు మాత్రం తెలుపు, ముదురు ఎరుపు రంగు లేదా ఆకుపచ్చ రంగులో ఉండి తల భాగాన్ని పూర్తిగా కప్పే విధంగా చుట్టుకుంటారు. సాధారణ బంజారా పురుషులు తలవెనుక భాగంలో మెడ వరకు వేలాడేటట్లు పాంక్టో (ఛుంగా) (తోక) చుట్టకుంటారు. తండా నాయకుడు మాత్రం తలనుండి వీపుమీదగా నడుము భాగం వరకు వేలాడేటట్లు పాంక్టో చుట్టుకుంటారు. ఈ పాంక్టోను పట్టి నాయకుడని గుర్తిస్తారు. కొన్ని ప్రాంతాలలో బంజారులు తలరుమాలు మాత్రవే చుట్టుకుంటారు. ఛుంగాలుండవు. తండా నాయకుడికి మాత్రమే ఛుంగా ఉంటుంది. బంజారుల వేషధారణ భారతదేశంలోని రాజాస్థానీ వేషధారణను పోలి ఉంటుంది. బంజారులు రాజస్థాన్ నుండి వలస వచ్చి దేశంలోని నలుమూలలో వ్యాపించారనటానికి ఇది ఒక ఆధారంగా పేర్కొనవచ్చు.

**అలంకరణలు :**

ఖమ్మం జిల్లా బంజారా స్త్రీలు తలపై నడినెత్తిన పాపిట తీసి తలను దువ్వుకొని వెండితో చేయబడిన వివిధ ఆభరణాలను తలలో అలంకరించుకుంటారు. వీటినే టోప్లిలు (బుట్టలు) అంటారు. టోప్లిలను వెండితో చేయబడిన ప్రత్యేకమైన రెండు బుట్టలవంటి ఆభరణాలను తల వెంట్రుకలతోపాటు అల్లుకొని రెండు చెవులకు కొంత పై భాగంలో అలంకరించుకుంటారు. కన్యలు ధరించే టోప్లీలకు ఘుగ్రి (గజ్జెలు) ఉండదు. ఘుగ్రి కలిగిన టోప్లిలు ముత్తయిదువలు మాత్రమే ధరిసారు. స్త్రీలు మెడలో 'హాంస్లీ' లేదా 'హాంస్లో' అనే ఒక వెండి గుండ్రని కంఠ కడియాన్ని ఆభరణంగా ధరిస్తారు. ఈ ఆభరణం ఒక గుండ్రని కడ్డీకి వివిధ వెండి ఝుంకాలు

తగిలించబడి హారంలా ఉంటుంది. 'హాంస్లి' సాధారణంగా చిన్నగా ఉండి పెళ్ళికాని యువతులు ధరిస్తారు. 'హాంస్లో' ముత్తైదువలు ధరిస్తారు. స్త్రీలు ముంజేతులకూ, భుజాల వరకు 'బల్యా'లు (ఏనుగు కొమ్ములతో చేయబడిన మందపు తెల్లని గాజులు) ధరిస్తారు. కన్యలు ముంజేతులకు మాత్రమే ధరిస్తారు. స్త్రీలు చేతులకు ఉంగరాలు సాధారణంగా ధరిస్తారు. పెళ్ళయిన స్త్రీలు కాళ్ళకు కస్ (మెట్టెలు), 'వాంక్డీ'(కాళ్ళ పట్టీలు)లు ధరిస్తారు. పెళ్ళికాని కన్యలు కాళ్లకు 'ఘుగ్రా' (మువ్వలు) హారాలు కుట్టుకుంటారు. చెవులకు కన్యా (కమ్మలు), ముక్కుకు 'ఫూలీ', 'భూర్యా' (ముక్కుపోగు)ను ధరిస్తారు. బంజారా పురుషులు కాళ్ళకు, చేతులకు 'కోల్డా' (కడియం), చెవులకు, ముక్కుకు నత్లి (పోగు)ని అలంకరించుకుంటారు.

ప్రస్తుత సమాజంలో ఆధునిక, నాగరిక వేషధారణకు ఆకర్షితులై ఈ వేషధారణను విడనాడుతున్నారు. ఒకప్పుడు ఇవి సులభంగా లభించేవి. ప్రస్తుత సమాజంలో ఇవి చాలా ఖరీదు. తయారు చేయటానికి సంవత్సర కాలం పట్టటం వల్ల వీటిని విడనాడుతున్నారు. పట్టణ, నాగరికతకు ఆకర్షితులై తమ వేషభాషలను మార్చుకుంటున్నారు. ఇంకోతరం మారితే ఈ వేషధారణ పూర్తిగా అంతరించిపోతుంది.

**ఆహారపు అలవాట్లు :**

ఖమ్మం జిల్లా బంజారులు అధికంగా మాంసాహారులే. మాంసాహారంతో పాటు ఆకుకూరలు (భాజీ) ఎక్కువగా తింటారు. వీరి మాంసాహార, శాకాహార వంటకాలను కింది విధంగా పేర్కొనవచ్చు.

**మాసాంహారం :**

బంజారులు సాధారణంగా మాంసప్రియులు. వీరి మాంసాహార వంటకాలలో 'బోటిర్ లోంగాణ్' (మాంసం కూర), సళోయి (రక్తంతో మాంసాన్ని కలిపి వండిన నల్ల), ఇందులో గుడ్లా హడ్కా (కీలు, మూలిక, బొమిక) ముఖ్యమైనవి. మాంసతోపాటు జొన్నరొట్టె తప్పనిసరి తీసుకుంటారు. అందుకే 'బాటి, బోటి, సళోయి' అనే నానుడి ఉంది. వీరు కోడి, మేక, గొర్రె, చాపలు మాత్రమే తింటారు. కొన్ని పాడా (కులాలలో)లో పందిమాంసంకూడా తింటారు.

**శాకాహారం :**

బంజారులు ముఖ్యంగా 'జారేర్' (జొన్నల), 'బాజ్రీర్' (సజ్జల) 'బాటీ' (రొట్టె)లను ఇష్టంగా తింటారు. వీరు అత్యధికంగా సాగునీరు అందని మారుమూల అటవీ ప్రాంతాలలో, మైదాన ప్రాంతాలలో నివసించటం వల్ల సాధారణంగా మెట్టపంటలైన జొన్నలు, సజ్జలు, రాగులు పండుతాయి. కావున వీరు జొన్న లేదా సజ్జ రొట్టెలను తమదైనందిన ఆహారపదార్థంగా అలవాటు చేసుకొని ఉంటారు. బంజారులకు అత్యంత ఇష్టమైన మరో వంటకం 'జారేర్ భల్డూ' (జొన్న గటక), 'బాజ్రీర్ ఖీడో' (సజ్జ అన్నం). సజ్జలను కడిగి దంచి వండిన వంటకం, జొన్నలను ఘట్టీ (ఇసురురాయి)లో బొరుసుగా పట్టి వండిన వంటకం అంటే ఎంతో ఇష్టం. అలాగే 'రాయ్' (రాగుల) 'రాబ్డీ' (జావ), వరి బియ్యపు అన్నం, బియ్యం పాలు బెల్లం కలిపి వండిన 'లాప్సి' లేదా 'ఖీర్' (పాయసం) వీరికి పండుగలలో పబ్బాలలో చేసకొనే ప్రత్యేకమైన వంటకం. ప్రస్తుత సమాజంలో బిర్యాని, పలావు లాంటివి. వివిధ రకాల ఆకుకూరలు (భాజీ) వీరి వంటకాలలో సాధారణంగా ఉంటాయి. 'దాళ్' (పప్పు), ఖోడీ (చట్నీ), ఆఛార్ (పచ్చడి), లోంగాణ్ (కూరగాయాల కూరలు) వీరి ఆహారంలో భాగమే. వీరు పశుపోషకులు కావున సాధారణంగా మజ్జిగ, పెరుగు, నెయ్యి మొదలైనవి కూడా వీరి ఆహారంలో భాగంగా ఉంటాయి.

**మధ్యపానం :**

బంజారులు మధ్యాన్ని అధిక శాతం మంది స్వీకరిస్తారు. వీరు తాము జరుపుకునే ప్రతి పండుగల సందర్భంలోనూ, ప్రత్యేకమైన సందర్భాలలోనూ, కుల పంచాయితీలలోనూ, చావు పుట్టకల సందర్భంగా సారా సేవిస్తారు. వీరు సారాను తమ సంస్కృతిలో ఒక భాగంగా భావిస్తారు. వివిధ రకాల మధ్యపానాలను తామే స్వయంగా కాచి ప్రత్యేక సందర్భాలలో వాడుకుంటారు. 'మోబ్‌డార్ దారు' (విప్పపూల సారా), 'గోళేర్ దారూ' (బెల్లం సారా), 'సీంది' (కల్లు)ను సేవిస్తారు. నేటి సమాజంలో వీటితో పాటూ బ్రాంది, విస్కి, రమ్ములు సేవిస్తున్నారు.

**ధూమపానం :**

బంజారులు తమ జీవనంలో ధూమపానాన్ని కూడా ఒక అలవాటుగా వాడుతున్నారు. చుట్టా (పొగాకు చుట్ట), బీడిలను తాగుతారు. వీరే చుట్టాలను

పొగాకుతోనే ప్రత్యేకంగా పొరచుట్టగా, ఢాంక్డార్ పాన్ (మోదుకు ఆకుల)తో చుట్టలు అప్పటికప్పుడే చుట్టుకొని వెలిగిస్తారు. నేటి సమాజంలో ఆధునిక చుట్టాలు, బీడిలు, సిగరేట్‌లు కూడా వాడుతున్నారు.

ఇంతటి గొప్పజీవన విధానాన్ని, రాజకీయ వ్యవస్థనూ, వేష భాషలనూ, ఆచార వ్యవహారాలను కలిగి వున్న బంజారా వ్యవస్థ, ఆధునిక సమాజంలో, నాగరికతకులోనై తమ అలవాట్లనూ, వేషభాషలనూ, ఆచారవ్యవహారాలనూ, జీవన విధానాన్ని, సంస్కృతి - సంప్రదాయాలను విడనాడి, వీరు బంజారులేనా అనే అనుమానం వచ్చే విధంగా సమాజంలో కలిసిపోయారు. తమకున్న ప్రత్యేక ప్రతిపత్తి కనుమరుగైపోతుంది. బంజారా వస్త్రాలు పోయి, చీరెసారెలొచ్చాయి, లంగా ఓణీలు పోయి పంజాబీ డ్రస్సులొచ్చాయి. పంచే దోవతిలు పోయి పయింటు చొక్కాలొచ్చాయి. బంజార అలంకరణలు పోయి నకిలేసులు, హారాలు, రంగురంగు గాజులు వచ్చాయి. కాళ్ళకు గజ్జెలు (మువ్వలు) పోయి గజ్జల పట్టిలొచ్చాయి. ఇప్పటికైనా వీరు తమ సంస్కృతిని - ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలని ఆశిద్దాం.

# 3. ఖమ్మం జిల్లా బంజారా పండుగలు :

భారతదేశంలోని గిరిజనులు వివిధ సంస్కృతులు, సంప్రదాయాలను కలిగి వున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 33 గిరిజన తెగలుంటే, బంజార (లంబాడీ), చెంచు, గదబ, గొండు, జాతపు, కోయ, కోలాము, కొండదొర, ఎరుకల, కొండరెడ్లు, సవరులు, యానాది మొదలైన ప్రధాన తెగలున్నాయి. భారతదేశంలో 17 రాష్ట్రాలలో బంజార తెగవారు వ్యాపించివున్నారు. ఆదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాలలో బంజార తెగవారు నివశిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బంజారులు ప్రత్యేకమైన సంస్కృతి సంప్రదాయాలను కలిగి వున్నారు. అందులో ఖమ్మం జిల్లా బంజారులు ఒక ప్రత్యేకమైన సంస్కృతి సంప్రదాయాలను కలిగి వున్నారు. బంజారులు సంస్కృతి సంప్రదాయాలలో, ఆచార వ్యవహారాలలో భాగంగా పండుగలు ప్రధానమైనవి. ఖమ్మం జిల్లాలోని బంజారుల పండుగలు ఒక ప్రత్యేక విలక్షణాలను కలిగి వున్నాయి. హిందువుల పండుగలకు బంజార పండుగలకు కొంత తేడా వుంది. కొన్ని పండుగలు హిందువులు జరుపుకోనివి కూడా వుండటం విశేషం.

బంజారులు హిందువులు అయినప్పటికి వీరు పండుగలను జరుపుకునే విధానం ప్రత్యేకమైంది. బంజారులు పండుగలను సామూహికంగా జరుపుకుంటారు. బంజారులు తమను, తండాను, తండావాళ్ళను, పాడి పంటలను క్షేమంగా ఉంచాలని కోరుతూ ఈ పండుగలు జరుకుంటారు. వీటిలో సీత్లా, తీజ్, దస్రా, దవాళి, కార్తీక పున్నం, కొర్ల పున్నం, సంక్రాంతి, శివరాత్రి, హోలి, ఆటమ్, శ్రీరామనవమి ప్రధానమైనవి. ఇవే కాక తమ ఇష్ట దేవతలైన శ్రీవేంకటేశ్వర స్వామి, హాతిరాం బావాజీ, సేవాలాల్ మహరాజును ప్రత్యేక భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. అలాగే తమ పూర్వీకులైన డోక్రా, డోక్రిలకు నైవేద్యాన్ని పెడతారు.

బంజారుల పండుగలలో ఒక ప్రత్యేక లక్షణం ఉంది. జంతుబలి చేయటం, యాటపోతు, గొర్రెపోతు, కోడి బలి ఇస్తారు. సోలోయి (నల్ల), బోటి (మాంసం కూర), బాటి (రొట్టెలు), దారు (సారా) మొదలైనవి తప్పకుండా వుండవలసిందే. ఖమ్మం జిల్లాలోని బంజారులు బాటి, బోటి, దారుకే అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఖమ్మం జిల్లా బంజారుల పండుగలు ఎక్కువగా రాజస్థాన్,

గుజరాత్ ప్రాంతాల పండుగలతో పోలి వుంటారు. కారణం వీరు కూడా ఆ ప్రాంతాల నుండి వచ్చిన వారు కావటమే. ఈ పండుగలన్ని తండా నాయకుని ఆధ్వర్యంలోనే జరుగుతాయి.

ఈ పండుగలను 1) ప్రధాన పండుగలు, 2) అప్రధాన పండుగలుగా వివరించటం జరిగింది.

## 3.1. ప్రధాన పండుగలు :

ఖమ్మం జిల్లా బంజారులు అన్ని పండుగలు ఒకేలా జరుపుకోరు. వారికి ఇష్టమున్న వాటిని, వారి ఆచార వ్యవహారాలలో భాగమైన వాటిని మాత్రమే ప్రధానంగా జరుపుకుంటారు. వీటిలో 1. సీత్లా పూజ, తీజ్ పండుగ, 3. దవాళి (దీపావళి) పండుగ, 4. హోలి పండుగ, 5. భోగ్ పూజ, 6. భవానీ పూజలు ప్రధానమైనవి.

### 3.1.1. సీత్లా (దాటోడి) పూజ :

బంజారులు ఏడుగురు శక్తి దేవతలను పూజిస్తారు. అవి తౌళ్జా, మత్రాల్, హింగళా, ధ్వాళాంగర్, కంకాళి, దండి (మేరామా), సీత్లా భవానీలు. ఈ ఏడుగురు శక్తి దేవతలను 'సాత్ భమాణీ'గా పిలిచి, వీరిని అక్క చెల్లెళ్ళుగా పేర్కొంటారు. వీటిలో సీత్లా భవానీకి చేసే పూజనే సీత్లా అంటారు. దీనినే తెలుగులో 'దాటోడి' అని వ్యవహరిస్తారు.

ఖమ్మం జిల్లా బంజారుల జీవనాధారం వ్యవసాయం. వ్యవసాయానికి పశువులు ఆధారం. కాబట్టి పశుసంపద కొరకు, పశువుల ఆరోగ్యం కొరకు, తండా సౌభాగ్యం కొరకు సీత్లా దేవిని పూజిస్తారు. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత శ్రావణమాసంలో ఈ పూజ జరుపుకుంటారు. వర్షాకాలంలో వచ్చే మశూచి, కలరా వంటి రోగాలు సోకకుండా, పశువులకు రోగాలు రాకుండా చల్లగా చూడమని సీత్లా భవానిని పూజిస్తారు.

శక్తి దేవతలో తౌళ్జా, మాత్రాల్, హింగళా, కంకాళి, దండి భవానీలను బంజారులు జరుపుకునే దస్రా, దవాళీ, ఆటమ్ (ఉగాది) పండుగల సందర్భాలలో ప్రత్యేకంగా పూజిస్తారు. కానీ సీత్లా భవానీని (మింగిలిన 6 భవానులతో కలిపి)

కొత్తగా తండాను ఏర్పాటుచేసేటప్పుడు తండాకు తూర్పు దిక్కులో ఝింఝేర్, ఆకోలా, బోర్ (రేగి) చెట్టి కింద ప్రతిష్ఠిస్తారు. ఈ దేవతలకు ఎదురుగా కాపలాగా 'లూంకడియా' (పోతురాజు)ను ప్రతిష్ఠిస్తారు. దీనికి ఒక ఐతిహ్యం ఉంది.

పార్వతీదేవి కూతురులు అయిన ఏడుగురు శక్తిదేవతలు నదిలో స్నానమాడుతుండగా ఒక మగవ్యక్తి అందరిలో చిన్నకూతురైన సీత్లాదేవి బట్టల్ని ఎత్తుకొని నదికి దగ్గరలో 'ఝింజేర్' చెట్టు ఎక్కి కూర్చుంటాడు. నదిలో వీరు బట్టలిమ్మని ఎంత బతిమాలినా ఇవ్వకపోయేసరికి సీత్లాదేవి ఒడ్డున ఉన్న చెట్ల ఆకులను చుట్టుకొని బయటకు వచ్చి, తన మంత్రశక్తితో చెట్టు మీదున్న ఆవ్యక్తిని కిందకు దింపి, నదికి ఈ బడ్డున అదే చెట్టు కింద మేము శక్తిదేవతలుగా మారుతామని నది మరో ఒడ్డున నీవు మాకు మరియు ఈ నదిలో నీటికొరకు వచ్చే గోవులకు కాపలాగా ఉండాలని శపిస్తుంది. అప్ప నుండి ఝింజేల్ చెట్టు కింద సీత్లాదేవి మధ్యలో ఇరువైపులా తలో ముగ్గురు దేవతలు కూర్చుంటారు. వారికి కాపలాగా లూంకడియా (పోతురాజు) కూర్చుంటాడు.

అదే విధంగా బంజారులు తండా తూర్పు దిక్కులో, తండాకి బయట లేదా పొలిమేరల్లో ఝింజేర్(రాగి), ఆకోలా (సండ్ర), బొరేర్(రాగి) చెట్ల క్రింద మధ్యలో సీత్లా భవాని ప్రతిరూపమైన పెద్ద పొడవాటి రాయిని, ఇరుపక్కలా మూడు చిన్న పొడవాటి రాళ్ళను ఏడు శక్తి దేవతలుగా, వీటికి ఎదురుగా కొంత దూరంలో పడమర ముఖం పెట్టి లూంకడియా (పోతురాజు)ను ప్రతిష్ఠిస్తారు. లూంకడియా ముందు ఒక గుంటతీసి అందులో నీళ్ళు పోస్తారు.

బంజారులు శ్రావణ మాసంలో మొదటి లేదా రెండో మంగళవారం సీత్లా పండుగను జరుపుకుంటారు. పండుగ ముందురోజు సోమవారం రాత్రి తండా నాయకుని ఆదేశం మేరకు తండాలో 'డప్టియా' వీధులందు డప్పుకొట్టుకుంటూ చాటింపువేస్తాడు. ఆ చాటింపులో "సవార సీత్లార్ వాషిడోరోయ్" అంటూ వీధులలో ముందుకు సాగుతాడు. మధ్య మధ్యలో డప్పు కొట్టుట ఆపి, రెండు మూడు ఇళ్ళ దగ్గర మళ్ళీ అరుస్తూ వెళ్తాడు. మధ్యలో ఆపి అడిగినా చెప్పడు. ఆయన అనుకున్నపుడు చెప్పినపుడే వినాలి.

మంగళవారం ఉదయమే పిల్లలు, పెద్దలు అందరూ స్నానాదులు పూర్తి చేసుకొని సీత్లాదేవి కోసం లాప్సి (పాయసం), జోన్న గుగ్గిళ్ళు వండుకుంటారు. తండా వారందరు కొత్త బట్టలు వేసుకొని తయారవుతారు. తర్వాత ప్రతి ఇంటి నుండి వత్తడి పళ్లెంలో పూజకొరకు వండిన పాయసం, గుగ్గిళ్ళు పెట్టుకొని దానిపై అందంగా తయారు చేసిన ప్రత్యేక వస్త్రాన్ని కప్పుతారు. దాన్నే 'గొణ్ణో' అంటారు. ఇది చతురస్రాకారంగా, గవ్వలతోను, అద్దాలతోను, రంగు రంగుల దారాలతోను ఎంబ్రాయిడరి చేసి దారంతో తయారు చేసిన 'ఫూందా' అనే చిన్న చిన్న కుచ్చులు దానికి అతికించి, దాని రకరకాల ఎంబ్రయిడరి చేసి ఉంటుంది. ఆ తర్వాత అలంకరించబడిన ఇత్తడి పళ్ళెన్ని తమ తలపై ఉంచుకొనుటకు వీలుండేడట్లు "గాలా, ఫూల్వా" అను వాటిని తయారు చేస్తారు. నెత్తి మీద ఉంచుకొనే చుట్టు ప్రత్యేకంగా దారంతో తయారు చేయబడుతుంది. ఇది మందుగా, గుండ్రంగా భద్రంగా దారంతో తాడులా పేని తయారు చేసుకుంటారు. దీని వెనుక భాగాన '8' అంగుళాల వెడల్పు, ఒక మూర పొడవుతో గుడ్డను వేలాడదీస్తారు. ఇది రకరకాల దారాలతో ఎంబ్రయిడరి చేయబడి, గవ్వలతోను, గాజు ముక్కలను బాగా అలంకారంగా తయారు చేస్తారు. నైవేద్యం తీసుకొని వెళ్ళే స్త్రీ, అమ్మాయి దీనిని నెత్తిపై పెట్టుకుంటే చూడముచ్చటగా ఉంటుంది. ఆ తర్వాత 'గొణ్ణో'తో కప్పబడిన ఇత్తడి (కంచు) పళ్ళెన్ని నెత్తిపై ఉంచుకుంటారు.

ఆ విధంగా అలంకరించుకొన్న నైవేద్యం గల కంచు పళ్ళెన్ని అందరు స్త్రీలు, అమ్మాయిలు నాయకుని ఇంటి వద్దకు తీసుకొని వెళ్తారు. అందరు అక్కడ చాలాసేపు పాటలు పాడి, డప్పు నృత్యాలు చేస్తారు. ఇందులో డప్టియా రకరకాల బాణిలతో డప్పు వాయించి తన నైపుణ్యాన్ని చాటుకుంటాడు. అక్కడి నుండి సీత్లాదేవి ఉన్నచోటుకు బయలు దేరుతారు. డప్టియా డప్పు వాయిస్తూ ముందుగా, పాటలు పాడుకుంటూ స్త్రీలు వెనుకా, వారి వెనుకే పురుషులు, పిల్లలు వెళ్తారు. మధ్య, మధ్యలో ఆగి వలయంగా మారి స్త్రీలు నృత్యం చేస్తారు. వారి మధ్యలో డప్టియా ఉండి డప్పువాయిస్తాడు. నృత్యం చేసే సమయంలో స్త్రీలు, అమ్మాయిలు నెత్తిన ఉన్న కంచు పళ్ళాన్ని, చేతిలో ఉన్న నీళ్లను చెంబును వారు ఏర్పరుచుకున్న వలయం మధ్యలో ఒకే చోట వుంచి, వాటి చుట్టూ నృత్యం చేస్తారు. మళ్ళీ నైవేద్యాన్ని

నెత్తిన పెట్టుకొని పాటలు పాడకుంటూ, డప్పు వాయించుకుంటూ తండా వీధుల గుండా సీత్లా దేవత ఉన్న చోటుకి చేరుకుంటారు.

తండా నుండి సీత్లా భవానీని పూజించటానికి బయలు దేరే సందర్భంలో మహిళలు అందరు కలిసి పాడే పాట. ఇది వినటానికి వినసొంపుగా ఉండి, వారి భక్తిని చాటి చెప్పె పాట : (ఈ పరిశోధకుడికి వచ్చిన పాట)

"సాతి యాడీ నికళి మలక దేకేన
జగజగ నందియా నందరేచ
ఒన యాలేమ దనియా ధారేచ
సీత్లా యాడీ నికళి మలక దేకేన
జగజగ కేకడా ఝూంకరేచ
ఓన యాలేమ దనియా ధోకరేచ
సీత్లాయాడీ నికళి మలక దేకేన
జగజగ గావడి ఝూంకరేచ
ఓన యాలే మ దనియా బొకాడ కాటరేచ
సీత్లాయాడీ నికళి మలక దేకేన
జగజగ బోకాడ ఝూంకరేచ
ఓన యాలేమ దనియా వింతికరరేచ"

**భావం :** అందరి కోర్కెలు తీర్చే కల్పవల్లి సీత్లాయాడి ఈ లోకాన్ని చూడటానికి బయలుదేరింది. ఎక్కడ చూసిన నందీశ్వరులు, ఎద్దులు, ఆవులు, దూడలు ధగధగ మెరుస్తున్నాయి. అదే విధంగా సీత్లాదేవికి నైవేద్యం కోసం తెచ్చిన యాటపోతులు కూడా ధగ ధగ మెరుస్తున్నాయని అర్థం.

సీత్లాదేవి పండుగ జరుపుకోవటానికి తండావాసులంతా బయలుదేరేటప్పుడు పాడే పాట :

"కుణేసే నాయకేరో టాండో ఝుంపూ వాళో దేవజనేరో?
వసి నాయకేరో టాండో ఝుంపూ వాళో దేవజనేరో!
కిమితి లాదో టాండో ఝుంపూ వాళో దేవజనేరో?

గార్ల గామేనలాదో టాండో ఝుంపూ వాళో దేవజనేరో!
కాయీ భరలాయె టాండో రుంపూ వాళో దేవజనేరో?
గోళ భరలాయో టాండో రుంపూ వాళో దేవజనేరో!
కి మతో ఢాళో టాండో రుంపూ వాళో దేవజనేరో?
చ్వాడే మా ఢాలీయాయే టాండో రుంపూ వాళో దేవజనేరో!
కాయీ పూజరేచే టాండో రుంపూ వాళో దేవజనేరో?
సీత్లా పూజరేచే టాండో రుంపూ వాళో దేవజనేరో!

( గంగావతు తులసి, వయస్సు 60 సంవత్సరాలు, పెద్దకిష్టాపురం, గార్ల మండలం)

**భావం :**

ప్రశ్న : ఏ నాయకుని తండావాళ్ళు ఊరేగుతూ పోతున్నారు?
జవాబు : వశ్యానాయకుని తండావాళ్ళు ఊరేగుతూ పోతున్నారు!
ప్రశ్న : ఎక్కడికి తండావాళ్ళు ఊరేగుతూ పోతున్నారు?
జవాబు : గార్ల (గ్రామం)కు తండావాళ్ళు ఊరేగుతూ పోతున్నారు!
ప్రశ్న : ఏమి తెద్దామని తండావాళ్ళు ఊరేగుతూ పోతున్నారు?
జవాబు : బెల్లం తెద్దామని తండావాళ్ళు ఊరేగుతూ పోతున్నారు!
ప్రశ్న : ఎక్కడి కొచ్చారు తండావాళ్ళు ఊరేగుతూ పోతున్నారు?
జవాబు : వాళ్ళు ఊరేగుతూ విశాలమైనా ప్రదేశంలో వచ్చారు!
ప్రశ్న : ఎవరి పూజకొరకు వాళ్ళు తండావాళ్ళు ఊరేగుతూ పోతున్నారు?
జవాబు : సీత్లాదేవి పూజ కొరకు వాళ్ళు ఊరేగుతా వచ్చారు! అని భావం.

సీత్లాదేవి ఉన్న ప్రదేశానికి చేరుకున్నాక స్త్రీలు పాటలు పాడుకుంటూ వుంటారు. ఆ సమయంలో కొందరు పురుషులు ఏడుగురు శక్తిదేవతలను (రాతి ప్రతిమలను) తాము తెచ్చిన గేరు (జాజు)ను పూసి, వాటిని అలంకరిస్తారు. వాటి ముందు భాగం ఎర్రమట్టితో గాని, ఆవు పేడతోగాని అలికి ముగ్గు వేస్తారు. దాన్నే 'చ్వాకో పూరేర్' అంటారు. ఆ 'చ్వాకో' పైన మోదుగు ఆకులు పరుస్తారు. ఆ ఆకులపైన స్త్రీలు తెచ్చిన గుగ్గిళ్ళు, పాయసం, పసుపు, కుంకుమ మొదలైన పూజా సామాగ్రిలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఆ తర్వాత స్త్రీలందరు దేవతలకు

ముందున్న 'లూంకడియా' దగ్గరకు వెళ్తారు. గేరుతో అలంకరిచబడిన దాని ముందువున్న గుంటలో తాము తెచ్చిన చెంబులలోని నీళ్ళు పోస్తారు. ఆ తర్వాత అప్పటికే సిద్దపరచిన మేకపోతు లేదా గొర్రెపోతు మీద నీళ్ళుపోసి దాన్ని పసుపు కుంకుమతో అలంకరించి, అమ్మా! ఈ పూజకు నీవు సంతోషంతో అంగీకరిస్తే 'ఢడ్ ఢడి' తెప్పించమని స్త్రీ, పురుషులు, పిల్లలందరు అర్ధచంద్రాకారంలో నిలబడి ప్రార్థిస్తారు. పోతు శరీరాన్ని ఒకసారి విదిలించినట్లయితే సీత్లా భవాని బలితీసుకోవటానికి సిద్దపడిందని భావించి, ఆ వెంటనే దాన్ని దేవికి బలిఇస్తారు. పోతును కోయగా వచ్చిన రక్తాన్ని ఒక పళ్ళెంలో పడ్తారు. తలను దేవి ముందుచుతారు. పళ్ళెంలో పట్టిన రక్తాన్ని దేవతల మీద పూస్తారు. అదేవిధంగా 'లుంకాడియా' మీద కుండా పూస్తారు. పొట్ట నుండి పేగులు తీసి దేవి నుండి 'లూంకాడియా' వరకు పరుస్తారు. భవాని దగ్గర గుగ్గిళ్ళ, పోతు రక్తం, పొట్ట పేగులో ఉన్న పెండను తీసి వాటిని కలుపుతారు. దీనినే 'వాసిడో' అంటారు. ఆ తర్వాత అప్పటికే సిద్దంగా ఉన్న పశువుల (ముందుగా నాయకుడి)ను పరిచిన పొట్ట పేగులపై నుండి దాటిస్తూ 'వాసిడో' చల్లుకుంటూ, కోళ్ళను కోసి వారి వారి పశువుల మందలోకి విసిరి, కేకలు వేస్తారు. ఇలా పశువులను దాటించడానే'దాటోడి' అంటారు.

బలి ఇచ్చిన మేకపోతు తలకు ఇరువైపుల కోళ్ళతలను అర్ధచంద్రాకారంగా పెడ్తారు. మేకపోతు ఎడమకాలు, కోళ్ళ ఎడమకాలు, రెక్కలు తీసి భవాని ఉన్న 'ఝింజేర్' చెట్టుకు కట్టి వేలాడదీస్తారు. ఆలోపు పొట్ట పేగులు, కొన్ని మెత్తటి మాంసం ముక్కలు, ఏడు పెద్ద ఎముకలను ఉడక బెట్టి వాటిని ఒక మోదుగాకులతో చేసిన విస్తరాకులో పెట్టి, వాటిలో గుగ్గిళ్ళు, పాయసం కొంత పెట్టి నైవేద్యంగా సమర్పించుకుంటారు. ఆ తర్వాత సీత్లాదేవిని అందరు కలిసి ప్రార్ధిస్తారు. ఆ సమయంలో తండా నాయకుడు, కొంత మంది పెద్దలు కలిసి ఇలా ప్రార్థిస్తారు.

"సాయీ వేజాయేస్ సీత్లాయాడి, సాతి భవాని యాడీ
వర్షే మా ఏక్ దాడ తార్ పాండ్గ కర్రేచా యాడీ
గాప్డీ, గోదా, దూద్, ఫీ సే వేణూయాడీ,

కుడీ వెలేర్ నై వదాడేస్ యాడీ,
పోతడియా మా పీసా రకాడేస్ యాడీ,
ఆందీ అంగోళేన్ దూర్ రకాడేస్ యాడీ,
సాయీవేన్ సవారో కరేస్ యాడీ,
వరస్ దాడేర్ ఈ పూజా తోన పూంచ్ యాడీ"

(మాలోత్ మాన్‌సింగ్, వయస్సు 70 సంవత్సరాలు, బర్లగూడెం, కామేపల్లి మండలం)

**భావం**: అమ్మా! సీత్లాదేవత, ఏడుగురు దేవతలారా! సంవత్సరానికి ఒక రోజు నీకు పూజ జరుపుతున్నాం. మాకు గోసంపదను, వాటి ద్వారా వచ్చే పాలు, నెయ్యి మొదలైనవి సమృద్ధిగా ఇవ్వు. దోసకాయ తీగవలె గోసంపదను పెంచమని ప్రార్థిస్తారు. పొతిడియా అంటే స్త్రీలు డబ్బులు దాచుకునే చిన్న సంచి. దీనిని స్త్రీలు నడుములో తోసుకుంటారు. ఆ సంచుల నిండా ధనం ఉంచమని, గాలి దుమారాలను దూరంగా వుంచి కాపాడమని ప్రార్థన.

ఈ విధంగా ప్రార్థించిన తర్వాత అందరూ కూర్చుంటారు. అప్పుడు అక్కడి పెద్దలు. ఒకరు నైవేద్యాన్ని, మరోకరు వండిన (ఉడకబెట్టిన) మాంసాన్ని తీసుకొని అందరికి ప్రసాదంగా పంచుతారు. ప్రసాదం పంచేటప్పుడు ఒక పద్దతిని పాటిస్తారు. మొదటి ప్రసాదం తండా నాయకుడికి, తర్వాత కార్యదర్శికి, కారోబారికి, ఊరిలో అత్యంత పెద్దవారైన ఐదుగురు ఇతర తండా పెద్దలకు ఏడు పెద్ద ఎముకలు వచ్చేటట్లు జాగ్రత్తలు తీసుకుంటారు. దీని వల్ల పెద్దలకు గౌరవం ఇస్తారని, నాయకున్ని గౌరవిస్తారని అర్థమవుతుంది. ఇలా అందరికి ప్రాసాదం పంచేవరకు ఎవరు ప్రసాదాన్ని తినరు. తండా నాయకుడు అందరికి ప్రసాదం అందిన తర్వాత 'సే నాయక్ లోని' అని అనుమతి ఇచ్చిన తర్వాతనే తింటారు. ఇది తంగా నాయకుడి మాటకు గౌరవం (ఇందులో ఒక మెలిక వుండవచ్చు ప్రసాదం అందరికి సరిపోకపోతే, సర్దుబాటు చేసుకోవచ్చనేమో).

తర్వాత వ్యకిగత ప్రార్ధనలు చేస్తారు. తండాలోని కొత్త కోడళ్ళు తమకు సంతానం కలిగేలా చూడమని మనసులో కోరుకుంటారు. పెళ్ళికాని ఆడపడుచులు

తమకు చక్కటి భర్తను ప్రసాదించమని మనసులో వేడుకుంటారు. తమ కుంటుంబాలను, పిల్ల జల్లను, తమ ఆరోగ్యాలను కాపాడమని ఊరిలో ఉన్న వారందరు ఒక్కొక్కరు ఒక్కొక్క కోరిక దండం పెట్టి అగరుబత్తులు వెలిగించి కొబ్బరికాయ కొట్టి ప్రార్థిస్తారు. ఇలా ప్రార్థిస్తే తమ కోరికలు తీరుస్తుందని వారి నమ్మకం.

ఆ తర్వాత మిగిలిన యాటమాంసాన్ని తండాలో ఎన్ని కుటుంబాలు ఉంటే అన్ని పోగులు (భాగాలు) వేసి, అందరికి పంచుతారు. తల, కాళ్ళు మాత్రం తప్పక నాయకుడికే ఇవ్వాలి. లేనిపక్షంలో మనుషుల తలకాయలు పగిలిన సంఘటనలున్నాయి. ఆ తర్వాత మిగిలిన ప్రసాదాన్ని అందరికి వారు తెచ్చిన కంచు పళ్ళాలలో పెటి, ఎవరి కోళ్ళ తలను వారికిచ్చి, అందరు కలిసి పాటలు పాడుకుంటూ, నృత్యాలు చేసుకుంటూ ఆనందంగా ఇంటికి చేరుకుంటారు. వారు ఇంటికి వచ్చే సమయంలో కాని, ముందుకాని వర్షం తప్పక వస్తుంది. వర్షంలో తడుస్తూనే పాటలు పాడుకుంటూ, నృత్యాలు చేసుకుంటూ తండాకు చేరుకుంటారు. యాట మాంసాన్ని, కోడి మాంసాన్ని వండి ఇంట్లోవాళ్ళు, వచ్చిన బంధువులు కలిసి తిని ఆనందిస్తారు. అయితే ఇంట్లో మగవారు, ఇంటికి వచ్చిన బంధువులు (మగవారైతే) సారా (మధ్యపానం) తాగి, తిని ఆనందిస్తారు. బంజారులకు బాటి (రొట్టెలు), బోటి (మాంసం), దారు (సారా) అలవాటు తప్పనిసరిగా వుంటుంది. దైనందిన జీవితంలో వీటిని అనుభవించే బంజారులు కూడా లేకపోలేదు.

ఈ విధంగా సీత్లా పూజను ఒక ఉత్సవం లాగా జరుపుకుంటారు. ఇంట్లో పెళ్ళి అయిన కూతుర్లను, అల్లుళ్ళను పిలిపించుకొని ఇంటిల్లిపాది సంబరాలు జరుపుకుంటారు. తండాలన్ని కొత్తకోడళ్ళు, అల్లుళ్ళతో కళకళ లాడుతాయి. తండా వాసులందరికీ మానసికోల్లాసాలను నింపుతాయి. బంజారుల పండుగలన్ని ఈ సీత్లాపూజతోనే ప్రారంభమవుతాయి.

ఆ రాత్రి డప్టియా కుటుంబంలోని డప్పణ్ణి కాని వారి సంతానం కాని తండాలోని అన్ని ఇళ్ళూ తిరిగి కూర, అన్నం అడిగి తీసుకొచ్చి వారు కూడా పండుగ చేసుకుంటారు.

## 3.1.2 తీజ్ పండుగ :

తీజ్ పండుగను ఉత్తరభారతదేశంలోని రాజస్థాన్‌లోనూ, బీహార్‌లోనూ, ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లోను జరుపుకుంటారు. నేపాల్‌లో ఈ పండుగను శ్రవణమాసంలో జరుపుకుంటారు. తెలంగాణా ప్రాంతంలోని ఖమ్మం, నల్గోండ, వరంగల్లు జిల్లాలోని బంజారులు ఈ తీజ్ పండుగను ఒకేలా (ఒకేరకంగా) జరుపుకోవటం విశేషం. ఈ పండుగ ఆంధ్రప్రదేశ్ అంతటా జరుపబడుతుంది. కాని కొన్ని జిల్లాలో కొద్ది తేడాతో నిర్వహిస్తారు.

తీజ్ ప్రధానంగా పెళ్ళికాని ఆడపిల్లలు జరుపుకునే పండుగ. స్త్రీలు తమ మాంగళ్యాన్ని కాపాడుకోవటం కొరకు చేస్తారు. ఈ పండుగను శ్రావణ మాసంలో జరుపుకొంటారు. తండాలోని ఆడపిల్లలందరూ కలిసి పాటలు పాడుతూ ఇంటింటికి తిరిగి వారి పెద్దవాళ్ళను కలుస్తారు. ఈ తీజ్ పండుగను జరిపించాలని కొరుతారు. పెద్దలందరూ కలసి తీజ్ వేడుకను జరపటానికి తండా నాయకుని అనుమతి తీసుకుంటారు. ఏ పండుగైనా, ఏ శుభకార్యమైనా నాయకుని అనుమతి లేనిదే తండాలో ఎవరు జరుపుకోరు. ఇది తండా కట్టుబాటు.

ఈ సందర్భంలో పాడే పాట.

"కనాయిలోలర మారో బాపూ జబరజ్ హూంసియో
కనాయిలోలర ఓరి బేటివూన తీజ్ బొరాదూ కేరో
కనాయిలోలర కూవారీర ఆసీస్‌లూ కేరో
కనాయిలోలర బడలారేజూ వదియావ కేరో
కనాయిలోలర ఘరలేజు ఫాలియావ కేరో"

(ఆంగోతు జీజాబాయి వయస్సు 55 సంవత్సరాలు. చూంచేపల్లి, కొత్తగూడెం)

**భావం:** మమల్ని కన్న మా తల్లితండ్రులు చాలమంచివారు. మాకు తీజ్ పండుగను జరుపుకోనిస్తామని అంటున్నారు. వారు కన్యలమైన మా ఆశీస్సులు తీసుకుంటున్నారు. మా తీజ్ మర్రిచెట్టువలే, మేడిచెట్టువలే ఏపుగా పెరుగుతుందని ఆశీర్వదిస్తున్నారని అర్ధం.

ఆడపిల్లల తల్లిదండ్రులు ఈ సంవత్సరం వున్న ఆడపిల్లల పెళ్ళిళ్ళు అయితే వచ్చే వంవత్సరానికి వారు పుట్టిన ఇళ్ళలో ఇండరనే ఉద్దేశంతో, 'నాయక్' ను అడిగి తీజ్‌పండుగను జరుపుకోవడానికి అనుమతిని కోరి వారిని ఒప్పిస్తారు. తండా నాయక్ తీజ్ పండుగ జరుపుకోవడానికి ఒప్పుకొన్న తర్వాత కన్యలందరూ కూడి ఈ పాటను పాడుతారు.

"నాయక్ బాపూ బొరాయో తీజ్, బాయీ తారో పాలేణా!
నాయెక్ బాపుతి రాజీయేగి తీజ్, బాయీ తారో పాలేణా!
మారీ హూాంసణ గౌరీ తీజ్, బాయీ తారో పాలేణా!
మారీ హూాంసియా బాపూ బొరాయో తీజ్ బాయి తారే పాలేణా!
మారీ హూాంసణి గవేరి తీజ్, బాయీ తారోపాలేణా!"
(బాణోతు ఛావళి ఎడ్జర్ల, కురవి మండలం)

**భావం :** మా తండా నాయకుడు తీజ్ పండుగకు ఒప్పుకున్నారు. ఆ నాయకుడి అనుమతితో సంతోషించిది తీజ్. మా ముద్దల గౌరీ తీజ్ ఆనందించింది. అలాంటి గౌరీ తీజ్‌కు కంచే తయారు చేయాలి అని అర్ధం.

బంజారుల దృష్టిలో తీజ్ అంటే ఒక కన్నెపిల్ల. ఆమె ఎవరో కాదు సాక్షాత్తు గౌరి (మేరా మా భవాని). ఈ పండుగను పార్వతి దేవి ఈశ్వరుణ్ణి మెప్పించుటకు చేసారట. శంకరుడు అడవిలో ఘోర తపస్సు చేస్తున్న సమయంలో పార్వతి దేవి అదే అడవిలో ఈ తీజ్ పండుగను చేసిందట. అదే విధంగా బంజార స్త్రీలందరు తమ మాంగళ్యాన్ని కాపాడుకోవటం కొరకు ఈ తీజ్ పండుగను జరుపుకుంటారు. తండాలోని కన్నెపిల్ల లందరు కలిసి ఈ తీజ్ పండుగను జరుపుకుంటారు.

**తీజ్ బోరాయేర్ :**

తీజ్ నిర్ణయం జరిగిన తర్వాత రోజు తెల్లారి ఆడపిల్లలందరూ కలిసి ఇంటింటికీ తిరిగి తీజ్ పండుగ కొరకు విరాళాలు వసూలు చేస్తారు. దీనినే 'మేర మాంగేరో' అంటారు. సేకరించిన విరాళాలతో అంగడి నుండి గోధుమలు, సెనగలు తీసుకొస్తారు. తెచ్చిన గోధుమలను, సెనగలను రాత్రి నానబెడ్తారు. నానబెట్టె సందర్భంలో పాడే పాట :

"ఘేవూలారే తోన శారేతి మంగాయిా
ఘేవూలారే తోన టపారే మా గోకి
ఘేవూలారే తోన నంగరిమా గోకి
ఘేవూలా ఘుమకోరోళేకయే నయ్యి
ఘేవులారే తోన ఝురలే మా గోకి
ఘేవూలరే తోన టోకణీ మా గోకి
ఘేవూలరే తాతి టోకణి వెరాదు
ఘేవులా ఘుమ కోరోళ ఏ కయే నయ్యి"

(వాంకుడోతు మాల్కి 60సం॥లు ఉప్పలపాడు, బయ్యారం మండలం)

**భావం**: ఓ గోధుమా! నిన్ను పట్నం నుండి తెప్పించాను. పెట్టెలో భద్రపరిచాను. నంగరిలో ఉంచాను. ఆ తర్వాత సర్వ (కుండ)లో నానబెట్టి, ఆ సర్వతో పాటే నిన్ను నిమర్జనం చేస్తానని అర్థం.

గోధుమలు నానబెట్టి "పిలోణీర్ వేళ్" (దుసేరుతీగ)తో చిన్న చిన్న బుట్టలను ఆడపిల్లలే స్వయంగా అల్లుతారు. ప్రస్తుతం మాత్రం మేదరి వాళ్ళు అల్లిన వెదురు, ఈత బుట్టలను కొనుకొస్తున్నారు. చక్కగా స్నానమాడి సన్నటి ఇసుకలో మేక ఎరువును కలుపుతారు. ఇసుకను, మేక ఎరువును తీసుకురావటానికి వెళ్ళిన ఆడపిల్లలను, పెళ్ళి కాని మగపిల్లలు వారిని తీసుకురాకుండా అడ్డగించే ప్రయత్నం చేస్తారు.

తండా నాయకుని ఇంటి ముందు కొచ్చి పాటలు పాడుకుంటూ, దండియాడి, సేవా భాయా, తొళ్జాభవాని, సీత్లాదేవి మొదలైన దేవతల పేర్లతో దుసేరు తీగతో తయారు చేసిన బుట్టలో తండానాయకుని చేత మొదటగా ఎరువు కలిపిన ఇసుక మట్టిని నింపిస్తారు. నాయకురాలు చేత గోధమలను చల్లిస్తారు. మిగిలిన బుట్టలలో కన్యలే స్వయంగా మట్టిని నింపి గోధుమలను చల్లుతారు.

ఈ సందర్భంలో పాడే పాట!

"ఘువులా ధనకో పడేచిక కొనరే!

ఘవులా కుణసి భాయిరో వీరారే!

ఘవులా సామణి యాడిరో వీరారే!"

(బానోతు సాంతిబాయి, 50సం॥ బర్లగూడెం, కామేపల్లి మండలం)

**భావం**: ఓ గోధుమా! తొందరగా బుట్టలో పడుతావా! లేదా! గోధుమ ఏ తల్లి కొడుకువో, సామాణితల్లి కుమారుడు అని అర్థం.

గోధుమలను బుట్టలో చల్లేటప్పుడు కన్నెపిల్లలు పాడే పాటను 'తీజ్ బోరాయేరో గీద్' అంటారు. గోధుమలు చల్లుతూ పాడే పాట :

"సీత్లాయాడీ బొరాయీ తీజ్, బాయీ తారే పాలేణ,
సొనేరో డాంకళో ఘలాన్ బాయీ తారే పాలేణ,
రూపేరో పాలణో ఘలాన్ బాయీ తారే పాలేణ,
సోనేరో డాండియా ఘడాన్ బాయీ తారే పాలేణ,
నవదాడేరి నవసెరి హార్ బాయీ తారే పాలేణ,
నాకేన నతలి ఘడాన్ బాయీ తారే పాలేణ,
కొపున రాసళి ఘడాన్ బాయీ తారే పాలేణ,
గళెన హంసళి ఘడాన్ బాయీ తారే పాలేణ,
కానేన కనియా ఘడాన్ బాయీ తారే పాలేణ,
టాంగేన పింజణ ఘడాన్ బాయీ తారే పాలేణ,
కడేన కమ్మరోపట్టో ఘడాన్ బాయీ తారే పాలేణ,
నవదాడేరి నవసెరి హార్ బాయీ తారే పాలేణ,

(ఝుర్వాల సక్రి, 60 సం॥ బొక్కల తండా, సింగరేణి మండలం)

**భావం**: ఓ సీత్లాతల్లి! నీకోసం బంగారు పందిరి వేసి, వెండి పీటను వేసి బంగారు బుట్టలో పెట్టి పోసించుకుంటాం. ముక్కకు ముక్కుపుడకా, మెడకు కంఠహారం, చెవులకు కమ్మలు, కాళ్ళకు గజ్జెలు, నడముకు వడ్డాణం మొదలైన వాటిని బంగారు, ఇత్తడితో చేయించి నిన్ను కొలుస్తామని అర్థం.

ఇలా పాటలు పాడుకుంటూ గోధుమలు బుట్టలో చల్లుతారు. చల్లటం పూర్తయిన తర్వాత ఎవరి బుట్టను వారు డాంకళో (ఒక మంచె) మీద

బుట్టలను వరుసగా పెట్టి నీళ్ళు పోస్తారు. ఆ రోజు నుండి దగ్గరలో ఉన్న బావిలో నుండి లేదా ఏటిలో నుండి నీళ్ళు తీసుకువచ్చి, మూడు పూటలు పోస్తారు. వారితో పాటే వెళ్ళే పెండ్లికాని మగపిల్లలు వారికి ఏదో ఒక రకంగా అడ్డుపడుతుంటారు. తీజ్ పండుగ అయ్యేంత వరకు ఈ ఆకతాయిల గొడవ వీరు భరించవలసిందే. వారు వేసే అడ్డంకులన్నింటిని దాటుకుంటూ, సరదాగానే తిప్పికొడుతూ గడుపుతారు.

తీజ్ బోరాయి (తీజ్ నాటిన)న రోజు నుండి 9 రోజులు తండాలోని వారందరు ఉత్సాహంగా గడుపుతారు. ప్రతిరోజు మూడు పూటలు పాటలు పాడుకుంటూ, నృత్యాలు చేసుకుంటూ తీజ్ మంచెమీద నీళ్ళు చల్లుతారు. ఈ 9 రోజులు 'డప్టియా' వీరితో పాటే ఉండి, డప్పు వాయిస్తూ ఉంటాడు. ఈ సందర్భంలో పాటలు పాడేటప్పుడు, నృత్యాలు చేసేటప్పుడు వాయించే డప్పు దరువుతో తండా అంతా మారుమోగిపోతుంది.

కన్నె పిల్లలు తీజ్ పండుగ రోజుల్లో శుచికీ, శుభ్రతకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చి, ఉపవాసం ఉంటారు. అంతేకాక మూడు పూటలా స్వయంగా బావుల దగ్గరికి వెళ్ళి నీళ్ళను తెచ్చి తీజ్ మంచె మీద చల్లుతారు. తొమ్మిది రోజులు జరిగే ఈ తీజ్ పండుగ సంబరాలు ఆడపిల్లలకు కలిగించే ఆనందం వర్ణించలేనిది.

తీజ్ పండుగ ప్రతి సందర్భంలో ఒక పాట ఉండటం గమనించవలసిన విషయం. నీళ్ళకోసం బావి దగ్గరకు వెళ్లినప్పుడు అమ్మాయిలు పాడే పాట 'సేవాభాయా' సేవాతత్పరతను తెలియజేస్తుంది. నీటి అవసరం అందరికీ ఉ ంటుంది. కాబట్టి తవ్వే బావిని లోతుగా తవ్వితే చాలా కాలం ఉపయోగపడుతుంది.

ఈ కింది పాటలోని భావాన్ని పరిశీలిస్తే 'సేవాభాయా' బావిలో నీటిని అందరూ తోడుకోవటానికి వీలుగా లోతైన బావిని తవ్వించి ఎంతో మేలు చేశాడన్న విషయం స్పష్టమవుతుంది. బావిని తవ్వించటం వల్ల ఎంతో పుణ్యం వస్తుంది.

నీళ్ళకోసం బావి దగ్గరకు వెళ్ళినపుడు పాడే పాట :

"ఖొద ఖొదరే సేవభాయ కువలో ఖోద్

కువలేరో పాణి అకెలాబి భరే, సకేలాభీ భరే
చ్వారావాళీ భారే, చ్వారీ వాళీ భరే
తళ ఊండేరో సేవాభాయ కువల ఖోద్"

తండాలో ఉన్న భావిని సేవా భాయనే తవ్వించినట్లు భావించి ఆ బావి నుంచే ఈ 9 రోజులు నీళ్ళు తెచ్చి మట్టి బుట్టలో చల్లి, పాటలు పాడుతూ తీజ్ పట్ల అమ్మాయిలు తమ భక్తి శ్రద్ధలను ప్రదర్శిస్తారు.

బావిలో నీళ్ళను తోడుకొని వచ్చి తీజ్‌లపై చల్లుకుంటూ పాడే పాట :

"లాంబీ లాంబీయే లాంబడి ఎకేరియా
లార లేరియే లాంబడి ఎకేరియా
ధోక ఖారియే లాంబడి ఎకేరియా
లాంబీ లాంబీయే లాంబడి ఎకేరియా
( ఇస్లావత్ సామ్య 62 సం॥ గోవింద్రాల, కామేపల్లి మండలం)

**భావం** : లాంబడి (గునుగు పూల చెట్లు) పెరిగినట్లు బాగా ఏపుగా తీజ్ నారు ఎదుగుతుందని అర్థం.

అమ్మాయిలు ఆ విధంగా నీళ్ళు చల్లటం వల్ల క్రమంగా గోధుమలు, శనగలు మొలకెత్తి, ఆ మొలకలు గునుగుపూల వలెపొడుగ్గా పెరిగి వంగాలని ఆకాంక్షిస్తారు.

ఇదే సందర్భంలో పాడే మరోపాట :

"డండియాడీ బొరాయీ తీజ్ బాయీ తారోపాలేణ
డండియాడే రాజీ యేగి తీజ్ బాయీ తారోపాలేణ
మారీ హూంసణ గొరీ తీజ్ బాయీ తారోపాలేణ
మారీ సాతణుతి రాజీయేగి తీజ్ బాయీ తారోపాలేణ
మారి నంగరీతి రాజీ యేగి తీజ్ బాయీ తారోపాలేణ
సొనేరి డాకళో ఘలాన్ తీజ్, బాయీ తారోపాలేణ
(ధారవతు హీరాణి 35 సం॥లు నెమలిపురం, కామేపల్లి మండలం)

**భావం :-** తీజ్ పండుగను దండియాడి (మేరామా భవాని) జరిపిస్తుందని, ఆ దేవత ఈ పండుగతో రాజీ పడిందని, బంగారు మంచెమీద తీజ్ బుట్టలను పెట్టించి దేవతనే స్వయంగా ఈ పండుగను జరిపిస్తుందని అర్థం.

తీజ్ పండుగ జరిగే ఈ తొమ్మిది రోజులంటే బంజారా బాలికలకు అగ్ని పరీక్షే. ఎన్నో కఠోర నియమాలను పాటించవలసి ఉంటుంది. ఈ రోజుల్లో ఆడపిల్లలు ఉప్పుకారం లేని తిండి తింటారు. తీజ్ పండుగ సందర్భంలో వారు ఆచరించే పూజావిధానం అంతా సామూహికంగా జరుగుతుంది. కన్యలు ఆచారాలను ఆచరిస్తుంటే వారి సహచరులు వినోదంగా చూస్తుంటారు.

**బొరేడి :**

బొరేడి అంటే శెనగలను రేగుముళ్ళకు కుచ్చుటం అని అర్థం. నానబెట్టిన శెనగలను రేగు ముళ్ళకు గుచ్చే ఆచారాన్నే 'బోరేడి' అంటారు. 7వరోజు ఢమోళి రోజు సాయంత్రం 'బోరేడి' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 8వ రోజు నిర్వహించే 'గణ్‌గోర్' కార్యక్రమంలోను 'బోరేడి' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 'గణ్‌గోర్' తయారు చేయటం కొరకు చెరువు నుండి బంక మట్టి తీసుకురావటానికి వెళ్ళే సందర్భంలో ఇది నిర్వవహించబడుతుంది.

ఈ 'బోరేడి' పూర్తి వినోదభరితమైన కార్యక్రమం. శృంగారం, కరుణ మొదలైన రసాలకే కాక హాస్యరసానికి కూడా ఆలవాలమైన పాటలు బంజారా సాహిత్యంలో ఎన్నో ఉన్నాయి. వదినలు రేగుముళ్ళకు శెనగలు గుచ్చేటప్పుడు మరిది వరుసవారు ముళ్ళను కదిలిస్తారు. అయినా సాహసంతో వదినలు శనగలను ముళ్ళకు గుచ్చవలసిందే. ఇదే విధంగా చెల్లెల్ని ఏడిపించే అన్నలను కూడా ఈ సందర్భంలో చూడవచ్చు. ఈ సందర్భంలో ఒక వినోదభరితమైన వాతావరణం ఏర్పడుతుంది. ఈ సందర్భంలో పాడే పాట :

"కాచి పాకీయో బోరేడియో
కాయి కుణసి బాయిరియో బోరేడియో
కాయి డండి బాయిరియో బోరేడియో
కాయి తౌళజా యాడేరియో బోరేడియో
కాయి సేవల భాందోయో పాంకడియో బోరేడియో

(గంగావతు భద్రి 60సం॥ పెద్దకిష్టాపురం, గార్ల మండలం)

**భావం :-** ఓ పండి పండని రేగులారా! మిమ్ములను ఏ తల్లి పండించింది. దండియాడీ వాటిని పండిస్తుందా! తొల్జాయాడి వాటిని పండిస్తుందా! సేవాభాయా వాటి ఒడిలో కట్టాడా! అని అర్థం.

ఈ 'బోరేడి' కార్యక్రమం 7వరోజు 'ఢమోళి' సందర్భంలోనూ, 8వరోజు 'గణ్‌గోర్' సందర్భంలోనూ నిర్వహిస్తారు. సాయంత్రం తండా బయటికి ఖాళీ ప్రదేశానికి డప్పు, వాయిద్యాలతో, ఆటపాటలతో చేరుకుంటారు. విశాల ప్రదేశానికి చేరుకున్నాక అక్కడ వదినలు, కన్నెపిల్లలు రేగుముళ్ళ కంప చిన్న మండలను తీసుకొని ముళ్ళకు నాన బెట్టిన శెనగలను గుచ్చుతారు. అలా గుచ్చే సందర్భంలో మరుదులు వదినలకు, మగపిల్లలు కన్నె పిల్లలకు గుచ్చకుండా ఒక కర్రతో ముళ్ళను మండను కదిలిస్తారు. అలా కదిలించేటప్పుడు వాళ్ళ దగ్గర వున్న ఓణీలో దాచుకుంటారు. వాళ్ళను తప్పించుకొని పోయి, పరిగెడుతూ ముళ్ళకు శనగలు గుచ్చుతారు. చీకటి పడటంతో మళ్ళీ ఇంటికి ఆటపాటలతో చేరుకుంటారు.

**ఢమోళి :-**తొమ్మిది రోజుల తీజ్ పండుగలో భాగంగా ఏడోరోజు జరిపే కార్యక్రమాన్నే 'ఢమోళి' అంటారు. 'చుర్మో' (బియ్యపు రొట్టెలు, బెల్లం నెయ్యి కలిపిన ముద్ద)ను మేరామా భవానికి సమర్పించే కార్యక్రమాన్నే 'ఢమోళి' అంటారు. ప్రతి ఇంటి నుండి గిద్దెడు బియ్యం సేకరించి, విసురు రాయిలో పిండిచేసి, ఆ పిండితో రొట్టెలు చేస్తారు. రొట్టెలలో బెల్లం, నెయ్యి పెట్టి ముద్ద చేసిన చుర్మోను మేరామా భవానికి నైవేద్యం పెడతారు. ప్రతి ఇంటికి చుర్మోముద్దలను పంపిస్తారు. ఆ రోజు రాత్రి ఆటపాటలతో ఆనందంగా గడుపుతారు.

ఈ సందర్భంలో పాడే పాట :

"ఘర్ సంక్టాయిమే మకళాయ్ కరలేజో
రాత్త అందారియే దీవలో జాళలిచో"

(బాణోత్ పార్వతి 45సం॥లు, బర్లగూడెం, కామేపల్లి మండలం)

**భావం :** మేం వస్తున్నాం! చిన్న ఇల్లయితే దాన్ని పెద్దగా చేసుకోండి, చీకటి ఉంటే దీపాలు వెలిగించుకోండి అని అర్థం.

ఈ విధంగా చిన్నా పెద్ద, ఆడమగా అందరు కలిసి రాత్రంతా ఆటపాటలతో ఆనందంగా 'ఢమోళి' కార్యక్రమాన్ని జరుపుకుంటారు. ఇదే రోజు తండాలోని పెద్దలు, అమ్మాయిల అన్నలు కలిసి "హింజళో" (ఊయల) కడతారు. ఇందులో ఒకేసారి 5 నుండి 10 మంది కూర్చునేట్లు కడతారు. చివరి మూడు రోజులు ఊయల లూగీ, పాటలు పాడుకుంటూ ఆనందిస్తారు.

**గణోగోర్:** ఈ తీజ్ పండుగను రాజస్థానీయులు ఘనంగా నిర్వహిస్తారు. శ్రావణ మాసంలో పెళ్ళికాని అమ్మాయిలు, భాద్రపద మాసంలో పెళ్ళికాని అమ్మాయిల వదినలు ఈ పండుగను జరుకుంటారు. బంజారులు తీజ్ పండుగలో భాగంగా జరుపుకొనే 'గణ్‌గోర్'ను రాజస్థాన్‌లో ఒక ప్రత్యేక పండుగగా నిర్వహిస్తారు. 'గణ్' అంటే శివుడని గోర్ అంటే గౌరి(పార్వతి) అనే అర్థాలు రాజస్థాన్ ప్రభుత్వ అధికారి వెబ్‌సైట్‌లో పేర్కొనబడింది. కాబట్టి శివపార్వతులను ఆరాధించే విధానాన్నే 'గణ్‌గోర్' అంటారు.

ఎనిమిదవ రోజు సాయంత్రం ఆడపిల్లలు చెరువు నుండి బంకమట్టి తెస్తారు. ఆ మట్టితో ఆడపిల్లల అన్నదమ్ములు ఆడ, మగ, (శివ, పార్వతి) ప్రతిమలను తయారు చేస్తారు. వాటినే 'గణ్‌గోర్' అంటారు. ఈ రోజు ముందు రోజు సేకరించిన బియ్యంలో నుండి కొంత మిగుల్చుకున్న పిండితో రొట్టెలు చేసి బెల్లం, నెయ్యి కలిపి చుర్మో చేస్తారు. ఈ ఛుర్మో 'గణ్‌గోర్'ల ముందు పెట్టి కొంత నిప్పురవ్వలు తెచ్చి అందులో నెయ్యి పోస్తారు మంటలొచ్చినాక రెండు లేదా మూడు ముద్దలు ఆ మంటల్లో పెట్టి భోగ్ ఇస్తారు.

ఈ సందర్భలో పాడే పాట :

"మారీ ఊజళీ గణ్‌గోర్ సాబత్ ఆయీమే ఘర ఘర ఘాలోదో"

**భావం:** నా మంచి గణ్‌గోర్ నా వెంట వస్తుంది. ఇంటింటికి రానివ్వడని అర్ధం.

ఆడపిల్లలకు తీజ్ బుట్టలు ప్రతి ఒక్కరికి ఒక్కొక్క బుట్ట ఉంటుంది. కాని అందరి పొత్తులో ఒక బుట్ట ఉంటుంది. ఆ బుట్టనే 'చడక్లి ఓళ్డి' అంటారు. ఆడపిల్లల అన్నదమ్ములు వారిని ఏడిపించాలనే ఉద్దేశంతో ఆ బుట్టను కావాలని దాచి పెడతారు. ఆడపిల్లలంతా అన్నదమ్ములను బతిమిలాడి తీసుకుంటారు.

ఈ సందర్భంలో పాడే పాట :

"నవ దాడేరి భూకిరే భీయా, తరసిరే భీయా, మార చడకలి మనద!

భాజీరో బాద మ కదిరే భీయా, ఖ్వాడీరో బాద మ కిదిరే భీయా మార చడకలి మన ద!

నవ దాడేడి భూకిరే భీయా, పగల పడూంచూరే భీయా, మార చడకలి మన ద!"

(గంగావతు గీతాంజలి 25సం॥ ఖమ్మం)

**భావం :** అన్నలారా! తొమ్మిది రోజులుగా ఉపవాసం ఉన్నాం. దాహంతో ఉన్నాం. ఆకుకూరలు తిన్నాం. కాబట్టి మీతో పోట్లాడే శక్తి మాకులేదు. దయచేసి మా చడక్లి(బుట్ట) మాకివ్వండి అని వేడుకుంటారు.

ఈ తొమ్మిది రోజుల పాటు కన్యలు ఏ విధమైన ఆహారం తీసుకుంటారో ఈ పాట వల్ల తెలుస్తుంది. ఆడపిల్లలు బుట్టలో నీరు పోసి నారును పెంచిన ఈ తొమ్మిది రోజులు కఠోర నియమాలు పాటించినట్లు కేవలం శాకాహారాన్నే తీసుకున్నట్లు, చప్పిడి తిండి తిన్నట్లు, ఉపవాసాలున్నట్లు ఈపాట ద్వారా తెలుస్తుంది. ఆడపిల్లలు ఇవన్నీ చెప్పుకొని 'మీ కాళ్ళు పడతాం' మా 'చడక్లి' (బుట్ట) మాకిమ్మని ఏడుస్తారు. చివరికి అన్నదమ్ములు ఆ బుట్టను ఇచ్చేస్తారు.

**తీజ్ తొడేరో (తీజ్ నారును తెంపటం) :-**

తొమ్మిదో రోజు మధ్యాహ్నం ఇంటింటికీ వెళ్లి ఈ రోజు సాయంత్రం తీజ్ తెంపటానికి అందరూ రావాలని చెప్పి వస్తారు. ఆ రోజు సాయంత్రం దేవతల పేర్లమీద వున్న బుట్ట(ఓళ్లి)లను పీటల మీద పెట్టి వాటిలో నుంచి ఐదుగురు ముత్తయిదువలు తీజ్ నారును తెంపుతారు.

ఈ సందర్భంలో పాడే పాట :

"సేవా భాయ బోరాయో తీజ్, బాయియా తారో పాలేణో
సేవా భాయతి రాజీ యేగి తీజ్, బాయియా తారో పాలేణో
మేరామా యాడి బోరాయియా తీజ్, బాయియా తారో పాలేణో
మేరామా యాడీతి రాజీ యేగి తీజ్, బాయియా తారో పాలేణో

డండీయాడీ బోరాయీ తీజ్, బాయీ తారో పాలేణో

డండీ యాడీతి రాజీయేగి తీజ్, బాయీ తారో పాలేణో

నవ దాడేరి నవసెతె వార్, బాయీ తారో పాలేణో

(గుగులోతు చంప్లి, 85సం॥ కొక్యాతండా, కూసుమంచి మండలం)

**భావం :-** తీజ్‌ను సేవాభాయా, మేరామా యాడి, దండియాడిల పేరుమీద భక్తి శ్రద్ధలతో పెంచినందుకు అవి వారితో రాజీ అయ్యాయి. ఆ తీజ్‌లను తొమ్మిది రోజులే పెంచినప్పటికీ తొమ్మిది వందల రోజులూ తాము ఆ పనిలో పాలు పంచుకున్నామని, తమకు ఈ తీజ్ సంతృప్తిని మిగిల్చాయనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

తీజ్ నిమర్జనానికి ముందు తండావాసులంతా తలపాగలు కట్టుకొని వలయాకారంలో కూర్చుంటారు. ఆడపిల్లలు తీజ్ నారును అత్యంత భక్తితో తెంపి మొదట తండా నాయకుని తలపాగకు కడ్తారు. తర్వాత మిగిలిన వారి తలపాగల్లో అమరుస్తారు. దీనినే చుంగా (తురాయి పించం) అంటారు. చిన్న పిల్లలకు, తలపాగ లేని వారికి చెవిలోకానీ చొక్కా జేబులో తీజ్ పెడతారు. ఆడవాళ్ళకు లంగా బొందు చివర కడతారు. అందుకు వారు కొంత డబ్బు ఇస్తారు. పూర్వం రూపాయి చెల్లించేవారు. ప్రస్తుతం వారి వారి స్తోమతను బట్టి ఇస్తుంటారు. పొరుగు తండా నుండి వచ్చిన మగవాళ్ళ వెంటపడి మరి వసూలు చేస్తారు. లేకపోతే రకరకాలుగా హేళన చేస్తూ ఏడిపిస్తారు.

ఈ సందర్భంలో పాడేపాట :

"కాచిక పాకియే బోరడియే

కాయి వసియా భాందోయో పాంకడియే

కసేరో రోళోయే ఛుంగేలా

కాయీ పాటేరో రోళోయే ఛుంగేలా

కాయీ దండియాడీరియే బోరడియే

కాయీ కాచీక పాకీయే బోరడియే

కుణసీ బాయీారియే బోరడియే

కాయీ బాలియ బాందోయే ఘుంగేలా
కాయీ కసేరో రోళోయ్ ఘుంగేలా
కాయీ పాటేరో రోళోయే ఘుంగేలా''

(ధరావత్ తావుర్యీ 75 సం॥ గొల్లచర్ల (మద్దివంచ) గార్ల మండలం)

**భావం :-** ఇందులో 'బోరడి' అంటే తీజ్. తీజ్ నారును ఆడపిల్లలు దేవతల పేర్లతో, తమ పేర్లతో తెంపటం జరుగుతుంది. వానిటిని సేవాభాయా, దండియాడీలతో పాటు ఇంట్లో వ్యక్తుల పేర్ల మీద పండించినట్లుగా చెప్తూ అందరి తలపాగాలలో తురాయిలుగా 'ఘుంగా' గుచ్చుతారు.

ఈ సందర్భంలో తమాషాగా వదినలు మరదులతోనూ, మరదల్లు బావలతోనూ, ఆడపిల్లలు వృద్దులతోను పరిహాసమాడతారు. అదే విధంగా ఆటపాటలు కొనసాగుతుంటాయి.

ఆ తర్వాత తీజ్ బుట్టలను తమ కుల దేవతలైన దండియాడి, సేవాభాయాల ముందు పెడ్తారు. దండియాడికి యాటపోతును బలి ఇస్తారు. తలను ఆ దేవత ముందు వుంచుతారు. యాటపోతు నుండి ఏడు పెద్ద మూలికలను, పేగులు, పొట్ట, కొంత మెత్తని మాంసాన్ని తీసుకొని 'వకాలి' (ఉడకబెట్టిన మాంసం) చేస్తారు. సేవాభాయా కొరకు బియ్యం పిండి, బెల్లం నెయ్యితో 'కడావో'(పాయసం) వండుతారు. సేవాభాయ శాఖాహారి కావటంతో ముందుగా కొన్ని నిప్పురవ్వలు తీసుకొని వాటిలో సాబ్రాణి, నెయ్యి పోస్తారు. మంటలు అంటుకొనేలోపు 'కడావ్' (సిరా)ను అందులో మూడు ముద్దలు వేసి నైవేద్యం ఇస్తారు. దండియాడి మాంసాహారి కావటంతో తర్వాత మోదుగు ఆకులతో దొప్ప(కప్పు) చేసి, అందులోఉడకబెట్టిన మాంసాన్ని ఉంచి నైవేద్యం ఇస్తారు. అందరు కలిసి ప్రార్ధన చేస్తారు.

ప్రార్ధన పూర్తయిన తర్వాత అందరూ అర్ధచంద్రాకారంలో కూర్చుంటారు. తండా నాయకుడు (పూజారి) ఆనైవేద్యం పెట్టిన విగ్రహాల దగ్గర కూర్చుంటాడు. ముందు తండా నాయకుడికి తర్వాత అందరికి కుడి నుండి ఎడమకు మోదుగాకులలో ముందు ఒకరు 'కడావ్'ను తర్వాత ఇంకొకరు ఉడక బెట్టిన

మాంసాన్ని పంచుతారు. 7 పెద్ద మూలికలలో ఒకటి తండా నాయకుడికి, రెండోది 'కారోభారి'కి పెడ్తారు. మిగిలిన వాటిని పొరుగు తండా నుండి వచ్చిన నాయకులకు పెద్ద మనుషులకు పంచుతారు. పంచటం పూర్తయ్యాక తండా నాయకుడు తినండి(ఖావో) అని అనుమతి ఇస్తాడు. అప్పుడు అందరు నైవేద్యాన్ని స్వీకరిస్తారు. మిగిలిన యాటపోతును భాగాలు చేసి ఇంటింటికి పంపిస్తారు. తర్వాత ఎవరి బుట్టలు వారు నెత్తిన పెట్టుకొని నిమజ్జనానికి బయలుదేరుతారు.

**తీజ్ వేరాయేర్ (తీజ్ నిమజ్జనం) :**

తీజ్ నిమజ్జనం సాధారణంగా దగ్గరలోని ఏటిలో చేస్తారు. ఏటి ఒడ్డుకు చేరుకుంటారు. మగపిల్లలందరిలో ఒకరిని ఎన్నుకొంటారు. అలా ఎన్నుకోబడిన వారిని గేరియా అంటారు. అతని చేతిలో 'పిడియా' (పీట) ఉంటుంది. ఆ పీటను పాట రూపంలో అడుగుతారు. "సాత్ గామేరో పటలియా బాణావూరే విరా పిడియా దేదరా'' (విరా అంటా సోదరా) అని పాడుతారు. దీనికి 'ఆ పిడియా నాకు ఇవ్వు. నేను నిన్ను ఏడు ఊర్ల పటేలును (నాయకుణ్ణి) చేస్తాను' అని ప్రార్థిస్తుంది. ఆమాటలకు 'గేరియా' ఆ పీటను ఇచ్చేస్తాడు. ఆ పీట తీసుకున్న తర్వాత ఆ అబ్బాయిని ఎక్కిరిస్తూ, హేళన చేస్తూ పాట పాడతారు.

ఈ సందర్భంలో పాడే పాట :

"హమారే పిడియా హమారే హాత్
వో గేరియారి ఛాతిమా లాత్''

**భావం :-**మా పీట మా చేతిలో ఉంది. నీ ఎదలో తంతానని అని హేళన చేస్తారు.

అలా తీసుకున్న అన్నదమ్ములు చెల్లెళ్ళ కాళ్ళను పీట మీద ఉంచి కడిగి దండాలు పెట్టి, తీజ్ బుట్టలను తీసుకొని పోయి ఏటిలో నిమజ్జనం చేస్తారు.

ఈ సందర్భంలో కన్నెపిల్లలు ఏడుస్తూ వినిపించే పాట :

"తూ కతేతి ఆయీయే వ్యారణ గంగా
మారి ఓడలిరో జోడ్ లేయీ చాలీయే డగరచాలి
తూ కతేతి ఆయేరే సోళగాసో ఖాళీయా
మారి సాతణురో జోడ్ లేయిచాలోరే డగరే చాలో

తూ కతేతి ఆయీయే పాపణీయే గంగా
మారి నంగరీరో జోడ్ లేయీ చాలియే డగరచాలీ''

(గంగావతు భద్రి 60 సం॥లు పెద్దకిష్టాపురం, గార్ల మండలం)

**భావం :-** ఓ గంగా! నీవు ఎక్కడి నుండి వచ్చావో కాని నేను తొమ్మిది రోజులుగా ప్రేమతో పెంచిన తీజ్ బుట్టలను తీసుకెళ్తున్నావు. నా తోటి వారిని తీసుకుపోతున్నట్లే ఉంది. మా తండా నుండి, నా నుండి వాటిని విడదీస్తున్నావు కదా! నీ వెంత పాపిష్టి దానిలా కనిపిస్తున్నావు అని అర్థం.

తొమ్మిది రోజులు తాము ప్రేమతో పూజించిన బుట్టలను తనతో పాటు తీసుకొని పోతున్నావని, మా ఇంటి ఆనందాన్ని తీసుకుపోతున్నావని, అందుకు నీవు 'పాపిష్టి గంగా' అని దూషిస్తారు. దీనివల్ల తీజ్ మీద పెంచుకున్న మమకారంతో పాటు, వారి యొక్క అమాయకత్వం కూడా కనిపిస్తుంది.

తీజ్ బుట్టలను నిమజ్జనం చేసిన తర్వాత అందరూ తీజ్ పెట్టిన తండానాయకుని ఇంటి ముందు చేరుకుంటారు. తర్వాత 7వరోజు 'ఢమోళి' కార్యక్రమంలో పెద్దలు, అన్నలు ఏర్పాటుచేసిన 'హింజ్ళో' (ఉయ్యాల) మీద ఊగి, ఆడి, పాడి ఎవరింటికి వారు వెళ్ళిపోతారు. అమ్మాయిలు సంతోషంతో ఉయ్యాలలూగుతూ పాడే పాట :

"తోళ్జ యాడీరో హింజోళో బాగే మా
హీంచలరే హీంజళో బాగేమా
డండీయాడీరో హీంజళో బాగేమా
సోనేరో హింజళో బాగేమా
మత బోలో లచ్చునాయకేరి బాగేమా
సోనేరో హీంజళో దేవళేమా
హీంచలరే హీంజళో నంగేరీయా
బుడియా బాపూరో హీంజాళో దేవళేమా
హీంచలరే హీంజళో గుడిబండమా''

(బానోతు అచ్చమ్మ 45 సం॥లు అంజనాపురం, గార్ల మండలం)

**భావం :-** అమ్మాయిలు తాము ఊగే ఉయ్యాలలను దండి, తొళ్జా దేవతలు

కట్టించిన బంగారు ఉయ్యాలలని, దేవతల గుడిలోని ఉయ్యాలలాంటివే తమ 'నంగరి' (తండా)లో తమ పెద్దలు కట్టించారని పరవశించారు. ఊయ్యాల మధ్యలో ఆడపిల్లలు కూర్చుంటారు. ఉయ్యాలకు ఇరువైపులా ఇద్దరు పురుషులు నిలబడి ఉయ్యాలను ఊపుతుంటారు. ఉయ్యాల ఊపు ఎక్కువైన కొద్దీ అమ్మాయిల రాగం (ఉత్సాహం) ఎక్కువవుతుంది.

తీజ్‌ను సాధారణంగా తండా నాయకుని ఇంటిముందే పూజిస్తారు. తీజ్‌ను ఎవరి ఇంటి వద్దనైతే పెట్టి పూజలు చేసారో, ఆ ఇంటి వారు అందరినీ సానంపేటప్పుడు పాడే పాట :

"ఆవేజో సాతణో జావేజో సాతణో ఒకర సరాణియా
జాంగియ పెరాణీయా హమరీయయే రుక్కాయే చ్వారీన
ఢాలేపడి తరువాలే పడి కోయీ లడేజో మత్ కోయీ ఫోడేజో మత్"

(గంగావత్ లక్ష్మణ్‌జీ 90సం॥ పెద్దకిష్టాపురం, గార్ల మండలం)

**భావం:-** తీజ్ పండుగను మీ అందరి సహకారంతో చాలా బాగా జరుపుకున్నాం. ఇన్ని రోజులూ పిలిచినా, పిలవకున్నా వచ్చారు. ఇప్పుడు కూడా అదేవిధంగా అందరూ వచ్చి వెళ్ళండి. అందరూ కలసి మెలసి ఉండండి. డాలు, తల్వార్లున్నా మనం కొట్లాటలకు దిగవద్దు అని చెప్పి పంపిస్తారు.

ఈ తీజ్ పండుగ తెలంగాణ ప్రాంతంలోని హిందువులు జరుపుకునే బతకుకమ్మ పండుగను పోలి ఉంటుంది. ఇక్కడ బతుకమ్మ దసరా ముందు జరుపుకుంటే, తీజ్ జులై - ఆగష్టు నెలలో జరుపుకుంటారు. బంజారులు వినాయకచవితి జరుపుకోరు. వినాయకుడి నిమజ్జనం స్థానంలో తీజ్ నిమజ్జనం చేస్తారు. కానీ ఆధునిక కాల ప్రభావంతో, నాగరికత ప్రభావంతో ఖమ్మం జిల్లా బంజారులు (కొందరు మాత్రమే) బతుకమ్మ వినాయక చవితి పండుగలను ఈ మధ్యకాలంలో జరుపుకుంటున్నారు.

## 3.1.3. దవాళి పండుగ :

దీపావళి పండుగను బంజారులు 'దవాళి' లేదా 'కాళీ అమాస్' అంటారు. భారతదేశమంతటా జరుపుకున్నట్లే, ఖమ్మం జిల్లా బంజారులు కూడా ఈ

పండుగను ఆశ్వయుజ బహుళ నరక చతుర్థశినాడు జరుపుకుంటారు. బంజారులు దీపావళి పండుగను రెండురోజులు జరుపుకుంటారు. ఆ రెండు రోజులు వాకిట్లో సానుపుచల్లి గొబ్బెమ్మలను పెడతారు. పూర్వం ఆడవాళ్ళు వెళ్ళి గొబ్బెమ్మలో తంగేడుపూలు కోసుకొచ్చేవారు. ప్రస్తుతం మగపిల్లలు కోసుకొచ్చి, గెబ్బమ్మలు పెడుతున్నారు. బంజారులు దీపావళి ముందురోజు పశుసంరక్షణ కోసం గోలక్ష్మిని పూజిస్తారు. పశువుల కొమ్ములకు, ఇసురాళ్ళకు, స్త్రీల ఘీగ్రీల (చెవికమ్మ)కు గేరు(జాజురంగు) పూస్తారు. పశువుల కాళ్ళకు గజ్జెలను, మెడకు గంటలను కడతారు. బాల బాలికలు అడవి నుండి కానీ, పంట పొలాల నుండి కాని పక్షిగూళ్ళను సేకరిస్తారు. రాత్రిపూట పశువల కొట్టంలోనూ, ఇంటి ముందు ఆవరణలోనూ దీపాలు వెలిగిస్తారు. తర్వాత పక్షిగూళ్ళను ఒక కర్రకు వరుసగా గుచ్చి మంటలను చూపుతారు. పశువుల కింది భాగంలో పెట్టి పాట పాడుతారు. ఇంట్లో మగవారు ఒక చాట తీసుకొని వాయిస్తాడు. పశువులను పక్షిగూళ్ళ మంటలతో పూజించేటప్పుడు పాడే పాట :

"అగ్ ఝుడ్ బగ్ ఝుడ్
గాప్డీర్ గొంగోడా ఝుడ్
హంజీ నాయకణేర్ పూంద ఝుడ్"

**భావం :-** పశువలను పట్టిన చీడ పురుగులన్ని తొలగిపోవాలి. మా తండా నాయకురాలి జుట్టు (సెగ)రాలిపోవాలని అర్థం.

తర్వాత యువకులు అడవి నుండి ముందే సేకరించిన 'కోలా' (కట్టెలను పేర్చి తయారు చేసిన కాగడా)లను తయారు చేసుకుంటారు. కాగడాలకు నిప్పు అంటించి కేరింతలు కొడుతూ పశువుల కొట్టాలలోకి వెళ్ళి పశువుల చుట్టూ తిప్పి, బయటికి వచ్చి కేరింతలు కొట్టుకుంటూ, ఊరిలోని యువకులందరు కలిసి బంజారులో రోడ్లపైన కేరింతలు కొడుతూ పరిగెడతారు. ముందుగా నాయకుడి ఇంటిముందుకు వెళ్ళి అక్కడి నుండి కాగడాను తిప్పుకుంటూ తండా మొత్తం పరిగెడతారు. ఈ సందర్భంలో పాడే పాట :

"కోలాగాలే, కొట్టం గాలే
వసినాయకుని వట్టలుగాలే" అంటూ కాగాడా తిప్పుకుంటూ, ఎవరి ఇంటి ముందు కొస్తే ఆ ఇంటి యజమాని పేరుపెట్టి పై పాట పాడుతారు. ఇలా అర్ధరాత్రి వరకు కోలా ప్రదర్శన సాగుతుంది. కోలలను పశువుల చుట్టూ తిప్పటం వల్ల పశువులకు రోగాలు రావని వారి నమ్మకం. గోవును పూజిస్తే, శ్రీకృష్ణుడిని పూజించినట్లు భావిస్తారు. ఈ విధంగా గోవులను అలంకరించి సామూహికంగా పూజలు చేయటం వల్ల బంజారులు గోవులను పవిత్రంగా భావిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుత సమాజంలో కోలాతో పాటు, మతాబులు (టపాకాయలు) కాల్చి దీపావళి జరుపుకుంటున్నారు.

దీపావళి సందర్భంగా బంజారులు తమ పితృదేవతలను కూడా పూజిస్తారు. ఈ కార్యక్రమాన్ని 'ధప్కార్' అంటారు. పొద్దున్నే పొయ్యి దగ్గర అలికి ముగ్గువేస్తారు. బియ్యాన్ని నానబెట్టి, ఆరబోసి, ఇసుర్రాయితో పిండిని పట్టి నెయ్యి, బెల్లంతో 'లాప్సి'(పాయసం) వండుతారు. పాయసాన్ని పితృదేవతలు పేరున మూడుసార్లు పొయ్యిలోనే అగ్నికి అర్పించి ప్రార్ధన చేస్తారు. వారిని, పశువులను చల్లగా చూడమని ప్రార్ధిస్తారు.

దీపావళి రోజు తండా ప్రజలందరు కలిసి దేవికి యాటపోతు లేదా గొఱ్ఱెపోతు బలిఇస్తారు. లేదా డోక్రి, డోక్రా (తాత; నాయనమ్మ)ల పేరు మీద జంతుబలి ఇస్తారు. బలి ఇచ్చేటప్పుడు రక్తాన్ని పట్టి రక్తంలో ఉప్పు, చింతపండు వేసి, మెత్తని మాంసం ముక్కలు, పేగులు, పెద్ద మూలికలను వేరుచేసి, అన్ని కలిపి 'సోళోయి' (నల్ల) వండుతారు. దేవికి నైవేద్యం పెట్టి, తర్వాత ప్రార్ధన చేసి అక్కడున్న వాళ్ళందరికి పంచుతారు. మిగిలిన యాటమాంసాన్ని పోగులు వేసి తండాలోని అన్ని కుటుంబాలకు పంపిస్తారు.

ఈ విధంగా రెండురోజులు దీపావళి పండుగ జరుపుకోవటం వెనుక శాస్త్రీయమైన పద్దతులున్నాయి. దీపావళి బురద బాగా ఉన్న కాలంలో, దోమల బెడద బాగా ఉన్నకాలంలో వస్తుంది. కాబట్టి, దోమల నివారణ కొరకు ఇంటిలో, పశువులు కొట్టాలలో కాగడాలు, పక్షిగూళ్ళు కాల్చటం వల్ల దోమల బెడద తగ్గవచ్చు.

మరోరకంగా బురదలో దున్ని దున్ని వర్షాలలో తడిసి తడిసి పశువులకు కొన్ని చీడపురుగులు 'గంగోడా', 'జంజోడి' పట్టి రక్తాన్ని పీల్చే అవకాశం ఎక్కువ, వాటిని దూరం చేయటం కోసం కూడా ఈ పండుగ జరుపవచ్చు.

దీపావళి రోజు లక్ష్మీదేవి పూజ కూడా చేస్తారు. ఆ రోజు రాత్రి ఇంట్లో దీపారాదనలు చేస్తారు. దీపంతలలో ఆముదం లేదా మంచి నూనె పోసి, వత్తులు తయారు చేసి వెలిగిస్తారు. ఇలా చేయటం వల్ల లక్ష్మీదేవి తమ ఇంటికి వస్తుందని భావిస్తారు. ఆ దీపాలలో రూపాయి నాణెలను వేసి మొక్కుతార. పశువుల కొట్టంలో ఎద్దులకు, ఆవులకు వాటి దూడలకు దీపాలను చూపించి, ఆ కొట్టం ఆవరణంలో కూడా దీపాలుంచుతారు. ఆవును వీరు లక్ష్మీదేవిగా భావించటం వల్లే ఈ పూజ చేస్తారు.

పూర్వం తండాలోని కన్నెపిల్లలు ఇంటికి ఒక దీపం వెలుగించుకొని, ముందు ఇంట్లో వాళ్లకు, తర్వాత తండా నాయకుని ఇంటికి, ఆ తర్వాత ప్రతి ఇంటికి వెళ్ళి మేర అడిగే పద్దతి ఉండేది. ఇది ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో అంతగా కనిపించటంలేదు.

ఈ సందర్భంగా పాడే పాట :

"రాత్ అందేరిరే వీరా! దీవలో బాళ్ దీ జో!!
పానీ రే తోడేరే వీరా! లోటా భర లిజో!!
ఘర సకడాయిరే వీరా! మక డాయి కరలిజో!!
ఖాడూ భడకోతో వీరా! హంకరీ లిజో!!
కొతర భసియేతో వీరా! హడకార తీజో!!"

(పోరిక లక్ష్మీబాయి 55సం॥లు ఖమ్మం)

**భావం :-** వీరా! (సోదరా) మేము మీ చెల్లెళ్ళు వస్తున్నాం. ఇంట్లో చీకటి ఉండే దీపాలేలిగించుకోండి. మా కోసం నీళ్ళ చెంబులు నింపుకోండి. ఇంట్లో చోటు సరిపోకపోవచ్చు. ఇల్లు సర్దుకోండి. మా రాకతో గోడ్లు బెదురుతాయి. వాటిని చూసుకోండి. కుక్కలు మొరుగుతాయేమో వాటిని దూరంగా తొలండని అర్ధం.

అదే విధంగా సూర్యోదయం అవగానే తంగేడు పూలు తెచ్చుటకు ప్రతి ఒక్కరు తమ తమ గంపలు తీసుకొని అడవికి లేదా పొలాలకు వెళ్తారు.

ఈ సమయంలో ఆనంద పారవశత్యంతో పాడే పాట :

"ఖడా కాడే ఘడా భరే లటకన బజోదే
కాయీ లేజా లేరి కాశీ వగోరియా
కాయీ లేజా లేరి ఏ లాంబడి వగోరియా
కాయీ లేజా లేరి ఏ అంబాడి వగోరియా
కాయీ లేజా లేరి బరు వగోరియా
కాశీ తోడ బల్డా మర్ లటకన్ భీజోదే
బాపూరే టోలయా లోగణ భడే లటకన్ భీజోదే"
(చీనియా నాయక్. బి 1998 : 244)

ఈ విధంగా తండా వాళ్ళందరు ఈ రెండు రోజులు కడురమ్యంగా, ప్రత్యేకంగా దీపావళి పండుగ జరుపుకొని ఆనందడోలికల్లో తేలుతారు.

## 3.1.4 హోలీ పండుగ :

హోలీ రంగుల పండుగ. బంజారుల పండుగల్లో అత్యంత ప్రధానమైనది 'హోలీ' పండుగ. ఖమ్మం జిల్లా బంజారులు హోలి పండుగను పదిహేను రోజులు చాలా ఉత్సాహంగా జరుపుకుంటారు. బంజారా భాషలో 'హోలీ' అంటే మంట అని అర్థం. హిరణ్యకశపుని సోదరి 'హోలిక' అగ్నిజ్వాలలో దహనమైన సందర్భంగా ఈ హోలి మంటలను పెట్టడం ఆచారంగా వస్తూవుంది. హిందువులు కామదహనానికి ప్రతీకగా కూడా హోలీని జరుపుకుంటారు. ఏది ఏమైనా హోలీ పండుగను మాత్రం విజయానికి, సంతోషానికి చిహ్నంగా జరుపుకొంటారు.

బంజారులు ఉత్తరభారతం నుండి వలస వచ్చి ఆంధ్రప్రదేశ్‌లో నివాసాలు ఏర్పరచుకున్నారు. ఉత్తరాదిలో హోలీ పండుగ చాలా ముఖ్యమైన పండుగ. అందుకే ఉత్తరాది నుంచి వచ్చిన ఆచారాన్ని బంజారులు ఇప్పటికీ పాటిస్తున్నారు. ఖమ్మంలో స్థిరపడ్డ రాజస్థానీయులు, మహారాష్ట్రియులు ఈ హోలీ పండుగను ఘనంగా జరుపుకుంటారు. అదే విధంగా బంజారులు వారి కంటే ఉత్సాహంగా, గొప్పగా హోలీ పండుగను జరుపుకుంటూరు.

హోలీ పండుగను పాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజు చెస్తారు. ఈ పండుగ

పూర్వంలో ద్వాపర యుగంలో రాధాకృష్ణులు జరుపుకొని. వసంతమాడినాట్లు ఆధారాలున్నాయి. పూర్వం కాముడనే రాక్షసుడు పాల్గుణ శుద్ధపౌర్ణమి రోజు చనిపోతే ఆయన దహనం చేసే బంధువులు ఏవరు లేకపోవటంతో బిక్షమడిగి పౌర్ణమి రోజు అతన్ని దహనం చేసినారట. పూర్వం ఆచారం ప్రకారం ప్రజలను బిక్ష అడిగి కొంత వారు భరించి హోలీ కొలుస్తారు. రెండవ రోజు వసంతం ఆడుతారు. ఆడ మొగ ముసలి మొతక పిల్లలతో సహా ఈ హోలీ పండుగ ఉత్సవంలో పాల్గొంటారు.

హోలీ పండుగకు బంజారులు 15 రోజుల ముందే సన్నాహాలు చేస్తారు. ఈ పదిహేను రోజులు బంజారులు బృందాలుగా ఏర్పడి, చుట్టు పక్కల వున్న గ్రామాలలో హాస్యచతురోక్తులతో కూడిన పాటలు పాడుతూ గెరియా (మగవారు), గేరణి (ఆడవారు) డబ్బునీ, దాన్యాన్ని సంపాదిస్తారు. హోలీ పండుగను స్వాగతిస్తూ పాటలు పాడుతారు. స్త్రీ పురుష బేధం లేకుంగా స్వాగత గీతాలాపన చేస్తూ, వారికి తటస్థించిన ఏ వ్యక్తినీ వదలకుండా డబ్బులు వసూలు చేస్తారు. కొన్ని సార్లు అపరిచిత వ్యక్తుల నుండి కూడా వసూలు చేస్తారు. ఈ విధంగా సంపాదించిన డబ్బుని హోలీ పండుగ జరుపుకోవటానికి ఉపయోగిస్తారు.

మొదటి రోజు చుట్ట పక్కల అడవులకు వెళ్ళి కలప (కట్టెలు) తెచ్చి హోలీ కాలుస్తారు. అందరూ హోలీ మంటల చుట్టు చేరి డప్టియా డప్పు, వాయిస్తూంటే స్త్రీ, పురుషులందరూ వలయంగా మారి పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ ఆనందంగా గడుపుతారు. బంజారులకు హోలీ పాటల విషయంలో ఒక నమ్మకం ఉంది. ఈ పాటలు పండుగ సందర్భంలో తప్ప ఎప్పుడంటే అప్పుడు పాడకూడదని, అలా పాడినట్లయితే శరీరం, నాలుక మీద దురద లేస్తుందని మూఢనమ్మకం ఉంది.

హోలి పండుగ సందర్భంలో యువకులు, లేదా పురుషులు జట్టులుగా ఏర్పడి  రెండు కర్రలు పట్టుకొని కోలాటం ఆడుకుంటూ డబ్బులు, ధాన్యం సేకరిస్తారు. ధాన్యం సంచి డబ్బులు వసూలు చేసే వారికి కర్రలుండవు, ఆ సమయంలో పాడే పాటలు లయబద్ధంగాను వినసొంపుగాను ఉంటాయి. అలా వసూలు చేసిన ధనంతో రంగులు కొనుక్కొని రెండు రోజులు రంగునీళ్ళు,

రంగుల పొడి చల్లుకుంటూ తండా మొత్తం కేరింతలు కొడుతూ తిరుగుతారు. తండాలో ఎవరైనా హోలీ ఆడటానికి రాకపోతే వారి ఇంటికెళ్ళి ఎక్కడ దాక్కున్న లాక్కొచ్చి మరి రంగులు పూస్తారు. రంగు నీళ్ళు చల్లుతారు. వీరు పచ్చని, ఎర్రని గులాల్ మాత్రమే రంగుల పొడిగా చల్లుతారు. ముందు రోజే పక్కనే వున్న అడవులకు వెళ్ళి మోదుగ పూలు తీసుకువచ్చి వాటిని నానబెట్టి ఎర్రటి రంగు నీళ్ళు చేసుకొని రెండు రోజులు చల్లుకుంటారు. ఈ మోదుగు రంగు శరీరానికి ఏమీ హాని చేయదు. ఇప్పుడు అన్నీ కలుషిత, రసాయన రంగులు వస్తున్నప్పటికి బంజారులు స్వచ్ఛమైన ప్రకృతి ప్రసాదించే రంగులనే అధికంగా వాడుతున్నారు. వీరి దగ్గర రంగులు అయిపోతే బురద నీళ్ళు, కుడితి నీళ్ళు కూడా చల్లిన సందర్భాలు ఉన్నాయి.

బంజారా యువకులు రెండు కర్రలతో కోలాటాలు ఆడి, ఇంటింటికి తిరిగి, అందరు వలయంగా మారి పాటలు పాడుతారు. ఒకరు పాడితే మిగిలిన వారు కోరస్‌గా పాడుతూ కోలాటం ఆడుతారు.

ఈ సందర్భంగా పాడే పాట.

"అత్తమత్త రోళ్ ఓత్తె గోపాలే నంగేరి
ఓ నంగేరిమా వసినాయక్ బాటోచ"

**భావం:-** గోపాలకుడైన శ్రీకృష్ణుని నంగేరి ఇంట్లో వశ్యా నాయకుడు కూర్చున్నాడని అర్థం.

ఇదే సందర్భంలో మరోపాట.

"వసిర నాయేక్ తారి ఘరే అంగ సాండియా భందోచే
సాండియానా చోడన్ పరేసి భాందియావ్
గేరియా ఆవచ ఖేలేన, గేరియా ఆవచ కూదేన।
గేరియా ఆవచ డండమారేన బాయీ బాయిరే"

(గంగావతు దస్మాబాయి 60సం॥లు పెద్దకిష్టాపురం, గార్ల మండలం)

**భావం :-** వశ్యానాయకుడా నీ ఇంటి ముందు ఆంబోతు ఉంది. దాన్ని తీసుకెళ్ళి దూరంగా కట్టేసిరా. ఎందుకంటే గేరియా వాళ్ళు వచ్చారు. కోలాటం ఆడటానికి, ఎగరటానికి దుమకటానికి అని అర్థం.

ఈ సందర్భంలోనే కొన్ని ప్రాంతాలలో బంజారేతరుల (హిందువులు) పాటలు కూడా పాడుతారు.

"వీరన్న బల్లికొడే
వీరగంధం పూసుకొని
జామచెట్ల పండబోతె
చిన్నిపాపకు తేలుకుట్టె
మందులు తేరా మామ కొడకా
అన్నివూర్లు తిరిగిన గాని
హనుమకొండ తిరగలేదు"

అంటూ కర్రలతో కోటాలాలు ఆడుతూ పాడుతూ చందాలు వసూలు చేస్తారు.

బంజారులు హోలీ పండుగ సందర్భంగా చేసే నృత్యం కన్నుల పండుగగా ఉండి చూసేవారి మనస్సుల్లో ఎంతో ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపుతుంది. వారు జట్లు జట్లుగా ఏర్పడి నృత్యం చేస్తూ ఇంటింటికీ తిరిగి డబ్బులు కూడా సేకరిస్తారు. ఈ సందర్భంలో పాడేపాట!

"అస్సీ ధరతీ పరే రామన్ లచమనర్ చాలగె।
అస్సీ ధరతి పరే నాయక్ లోక చాలగే
ఓరి బింతా చాలగే సీతా మాతో,
ధర్తీ టోపర్ బాయి భాయిరే,
ధరతీ టోపర్ భాయి భాయిరే,
ధరతీ టోపర గమ్మతేతి, ధరతీ టోపర డ్వాలేతి"

(అజ్మీరా భద్రునాయక్ 72 సం॥ బెతంపూడి, టేకులపల్లి మండలం)

**భావం :-** ఈ భూమి మీద రామలక్ష్మణులు, సీతా నడిచారు. వారు మనకు మంచినడవడిని చూపారు. సంతోషంగా, ఉత్సాహంగా హోళి ఆడాలి మనమంతా అని అర్థం.

బంజారుల ఇష్టదైవం రాముడు. వారు రామభక్తుడైన హనుమంతుని

వారసులమని తలుస్తారు. కాబట్టే వారు ఎవరైనా బంజారా వ్యక్తి ఎదురైనప్పుడు గాని, ఇంటికి ఎవరైనా వచ్చినపుడు గాని 'రాం! రాం!!' అంటారు. రాముని మాటే హనుమంతునికి వేదం. ఆ హనుమంతుని వారసులమని తాము భావించటం వల్ల రామలక్ష్మణుల దారిలో తాము నడవాలని లోకానికి చాటి చెప్తున్న వైనం ఈ పాట ద్వారా తెలుస్తుంది. హోలీని ఒక పండుగగా జరుపుకోవటమే కాకుండా, మహాపురుషుల జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, మంచి మార్గాన పయనించాలని పాటలు పాడుకోవటం వల్ల బంజారుల సాహిత్య ప్రయోజనం ఎటువంటిదో తెలుస్తుంది.

ఈ సందర్భంలో పాడుకునే మరో పాట.

"బారే బారే మీనా మా ఆయీచ యే హోలీయే
ఆజె మారే భీయా వూన హోలీ ఖేలేదో భాయి బాయిరే
హోలి రమ్మారద్వా లేతి, హోలీ రమ్మార గమ్మతేతి
కాకి దాది రీసమత కరజో హం ఖేలాంచా హోలీయే
హోలీయె మారి బమ్మర హోలీ భర ఛ్వారారీ ఝోలీ"

(నూణావతు మోత్యానాయక్ 85 సం॥ మునుసుబు బంజార కామేపల్లి మండలం)

**భావం :-** పన్నెండు నెలలకు ఒకసారి వచ్చింది హోలీ. ఈరోజు అదరినీ హోలీ ఆడనివ్వండి. చిన్నమ్మలు, నానమ్మలు ఎవరూ కోప్పడవద్దు. మేమంతా ఈ రోజు హోలి ఆడుతాం. ఈ హోలీ మాకు ఆనందానిచ్చే పండుగ. సంతోషంగా, ఉ త్సాహంగా ఆడుతాం అని అర్థం.

బంజారులు హోలీ సందర్భంగా పాడే పాటల్లో ఎన్నో సామాజిక అంశాలు వెల్లడి అవుతున్నాయి. బంజారా వయోజనులు చాలామంది సారా తాగుతారు. కొందరు అతిగా తాగి ఇల్లునూ, ఒళ్ళునూ గుల్ల చేసుకుంటారు. అటువంటి వారిని ఉద్దేశించి పాడిన పాట!

"బార మీనా మా ఆయీ బాయీ హంరమ్మా హోలీయే,
ఆజె మారే భీయా వూనె హోలీ ఖేలేదో భాయి భాయిరే,
ఏక ఘరే మా సాసూన్ బ్వాడి ఏకన్ ఏక్ మాతా ఫోడి,

ఘుర్ ఘుర్ జాతాణి నాతో జోడి ఈజ్ దారూ,
జగేమ నానేన మోడేన పడగే హేవా,
దారూ పీలేన్ ఆయో మాటి, పావో భరి లాయో బోటి బాయి,
చూలే పాచ బ్యాటి ఓరి బ్యాడి బాయి,
పీదోజే మా కళీకొని పక్కడలీదో బాయి,
బ్యాడి భాండ్తి భార ధాంటి
దారూ ఛోడ్డోర దారూర్ చాల్ ఛోడదోర,
పదర్ చోడ్డోర బాపు ఈ భారీ బల్లా.
కాయి కేరయి భందగీర మడ్గికాయి కేరి భందగీర ఝుంపడి తారి హాత్ జోడూంచు తారిటాంగే ఝుల్లూంచు ఈ భారి బల్లా.

(ధారావతు భీలునాయక్ 80 సం॥లు మునుసుబు బంజార, కామేపల్లి మండలం)

భావం :- తాగుడు ఎలా దారుణంగా మానవ విలువలను దిగజారుస్తుందో ఈ పాటలో తెలుస్తుంది. అత్తాకోడళ్ళ మద్య చిచ్చు పెట్టి ఇతరులతో స్నేహాన్ని పెంచుతుంది. వావివరుసలు కూడా మరిచిపోతారు. చిన్నా పెద్దా అందరూ ఈ సారా బారిన పడి పాడయి పోతున్నారు. దీని వల్ల ఇల్లు, ఒళ్ళు రెండు పాడవుతున్నాయి. అందుకే ఈ సారా మంచింది కాదు. దాన్ని మరిచిపోండని అర్ధం.

బంజారుల హోలీ హాస్యచతురోక్తులతో కూడిన సన్నివేశాల పాటలే కాకుండా శృంగారభరితమైన విషయాలు తెలిపే పాటలు కూడా పరిహాసించుకుంటూ పాడుతారు. ఈ సందర్భంలో పాడే పాట!

"చోరి గీచ గావడీమా,
సూతీచ ఖేతారీ మా
ఊతో సూతి సూతి షాన్ కరరీర లోన లోచనీయే,
ష్యారేరి కచ్చనీయే భాయి భాయిరే
హోలి రమ్మార భాయి భాయిరే

హోలి రమ్మార గమ్మతేతి,

హోలి రమ్మార డ్వాలేతి భాయి భాయిరే"

(బానోతు కిషన్ వ॥ 50 సం॥లు బర్లగూడెం, కామేపల్లి మండలం)

భావం :- ఒక అమ్మాయి గొడ్లు మేపటానికి వెళ్ళింది. గొడ్లు మేపటమేమోకాని చేనులో పడుకొని వచ్చిపొయ్యేవాళ్ళకు సైగ చేస్తుంది. అది ఎంత వయ్యారినో అని అర్థం.

శృంగార భరితమైన పాటల్లో మరొకటి :-

"ధణిలాయో ఖాంద్ టోపరో, మిండేడ్‌లాయో భూర్

తార్ టోపరో భారి జాడో, భూర్ మీటో

ఆంగేరో జలమ్ కూణ్ దీటో, భూర్ మీటో,

ధణిరో మాతో దూకో, మళమసియా లగాయీ,

మిండేడురో మాతోదూకో, మకతే రూమేరే."

(వాంకుడోత్ క్రిష్ణనాయక్ 58సం॥లు మర్రిగూడెం, గార్ల మండలం)

**భావం**:- జాతర కెళ్ళిన మొగుడు కొబ్బరి తెచ్చాడు. మిండేడెమో పీచు మీటాయి తెచ్చారు. మొగుడు తెచ్చిన కొబ్బరేమో లావుగా, గట్టిగా ఉంది. మీటాయి ఎమో తీయగ ఉంది. ముందు జన్మలో తర్వాత కానీ ఇప్పటి ఈ తీపిపైనే మోజు. మొగుడికి తలనొప్పి వస్తే, మందులు రాసింది. మిండేడుకి తలనొప్పి వస్తే, నీళ్ళలో నుండి ఒడ్డున పడ్డ చేపలా గిలగిల లాడిందని అర్థం.

ఇలాంటి శృంగార పరమైన పాటలు హోలీ పండుగలో ఎక్కువగా కనిపించినప్పటికి, బంజారుల నిత్య జీవితంలో శృంగారం పాటలు, మాటల శాతం ఎక్కువే. హోలీలో వసూలుకు వెళ్ళినపుడు ఎవరైన డబ్బులుగాని, ధాన్యం గాని ఇవ్వకపోతే వారి ఇంటిలో వున్న వారందరికి భూతులు తిట్లు తిట్టుకుంటూ పాటలు పాడి వస్తారు.

బంజారుల హోలీ ఆడటం మధ్యాహ్నం వరకు పూర్తి చేసుకొని, తర్వాత యాటపోతులను హోలీ సందర్భంగా బలి ఇచ్చి, పోగులు వేసుకొని, అందరు ఇంటికి ఒక పోగు చొప్పున తీసుకెళ్ళి వండుకొని భోజనాలు చేసి ఆనందిస్తారు.

మెత్తని, ప్రేగులు, పొట్ట మాంసం తీసి 'సలోయి' (నల్ల) పండుకొని అందరు పంచుకొని తింటారు. ఇంతటితో హోలీ పండుగ ఉత్సవాలు ముగిసినట్లే. తర్వాత రోజు ఈ పాటలు కానీ, మాటలు కాని మాట్లాకుండా సాధారణ జీవితం గడుపుతారు.

బంజారులు బ్రహ్మాండంగా జరుపుకునే హోలీ పండుగ గురించి అనేక సినిమాల్లో చిత్రించారు. లంబాడోళ్ళ రాందాసు సినిమాలో హోలి జరుపుకునే సన్నివేశ చిత్రణలున్నాయి. అదేవిధంగా, 'లంబాడోళ్ళ రాందాసు' నవలలో, 'లంబాడి రాండాసు' నాటకంలోను ఈ హోలీ జరుపుకున్న సంఘటనలు వివరించబడ్డాయి. కావున బంజారుల ప్రీతిపాత్రమైన పండుగ 'హోలీ' అని పేర్కొనవచ్చు.

"దవాళి హోలి చార్ మీనార్ భానే" అనే నానుడి ఉంది. అంటే దీపావళి హోలి నాలుగు నెలల అక్కా చెల్లెళ్ళు అని అర్థం. అంటే ఈ రెండు ప్రధానమైన పండుగలనే పేర్కొనవచ్చు.

## 3.1. 5. భోగ్ పూజ :

బంజారులు తమ ఇష్టదైవాలు బాలాజీ, హాతిరాం, సేవభాయా, హనుమాన్‌లకు పూజలు నిర్వహిస్తారు. తాము కోరుకున్న కోరికలు, మొక్కుకున్న మొక్కులు తీర్చుకోవటానికి ఇంటి ముందు ఆవరణలో ఈ పూజను నిర్వహిస్తారు. ఈ పూజనే 'బోగ్ దేర్' పూజ అంటారు. ఈ పూజను తండా వారందరు కలిసి ఒకేసారి జరుపుకునేవారు. ప్రస్తుతం కుటుంబాల వారిగా వారి వీలువున్న సమయంలో ప్రత్యేకంగా జరుపుకుంటున్నారు. పూర్వం తమ ఇష్ట దైవాలను దర్శించుకోవటానికి తండా వారందరు కలిసి బయలుదేరేవారు. బయలుదేరే ముందు ఈ పూజను నిర్వహించి తర్వాత బయలు దేరేవారు. కొంతమంది తిరిగి వచ్చిన తర్వాత ఈ పూజను నిర్వహించేవారు. ఈ సంప్రదాయం ఇప్పటికి కొనసాగుతుంది. ఈ పూజ గురు, శని వారాలలో మాత్రమే నిర్వహిస్తారు.

తాండా ప్రజలు తమ ఇండ్లను బాగా శుభ్రం చేసుకొని, అంటు ముట్లు లేకుండా ఉంచుతారు. ప్రతి ఇంటి ముందు ఆవు పేడతో కల్లాపు చల్లి ముగ్గులు

వేస్తారు. ఆ తర్వాత ఇంటి ముందు నేలపై దీర్ఘ చతురస్రాకారంలో చిన్న చిన్న 'ఛరి' (గాడిపొయ్యి)లు వరుసగా 3 లేదా 5 తవ్వి వాటిపైన కొత్త కుండలు, బానలలో నైవేద్యాన్ని వండుతారు. వారివారి స్థోమతలను బట్టి, బంధువులను బట్టి, బానలలో అన్నం, పప్పు, రసం ఒకపొయ్యిమీద వండుతారు. మరో పొయ్యిమీద బియ్యం, పాలు, బెల్లంతో పాయసం వండుతారు. మరో పొయ్యిమీద బియ్యాన్ని విసురురాళ్లతో పిండిచేసి రొట్టెలు పెనంపై చేసి, రొట్టెలను బెల్లం, నెయ్యి బాగా కలిపి ఛుర్మో చేస్తారు. ఈ వంటలు మగవాళ్ళు మాత్రమే చేస్తారు. ఈ వంటలు జరుగుతున్న సమయంలోనే వంట చేస్తున్న పూజారి (ఇంటి యజమాని) తండా వారికి కేక ద్వారా పిలుపు నిస్తారు. దీనినే 'హంకమారేరో' అంటారు.

ఈ సందర్భంలో పిలిచే కేక :

"సునోసామళో గోపాల భాయీ సామళోరే
బాలాజీర్ భండారో వేరోచ,
బాలాజీర్ భోగ్ లగారేచ సామళోరే"

**భావం** :- తండా ప్రజలందరు వినండోయ్! బాలాజీ దేవునికి నైవేద్యం పెడుతున్నారు. అందరు రావలసిందిగా పిలుపు ఇస్తారు.

అన్ని రకాల వంటలు అయిన తర్వాత పూజ ప్రారంభమవుతుంది. ఇంటి ముందు వేంకటేశ్వర స్వామి పటాన్ని వుంచి (గుణ్ లేదా పీట మీద) పూటదండలు వేసి, అగరబత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి పూజ చేస్తారు. తర్వాత డప్పియా డప్పువాయిస్తాడు. తండా వారందరు వచ్చేస్తారు. వండిన వంటలను వేటికి అవి ప్రత్యేంగా విస్తరాకులలో పెడతారు. ఇవి ఏ పొయ్యి మీద వండిన వాటిని ఆ పొయ్యి దగ్గరే వుంచుతారు. ముందుగా వేంకటేశ్వర స్వామికి అన్నం, పప్పు మూడు ముద్దలు కలిపి, పొయ్యిలోని నిప్పురవ్వలలో సాంబ్రాణి నెయ్యి పోస్తారు. మంటలు చెలరేగటంతో అందులో మూడు ముద్దలు వేసి, నెయ్యి పోస్తారు. తర్వాత రెండవ పొయ్యిలో హాతిరాం భావాజీకి, హనుమంతునికి ఛుర్మోను మూడు ముద్దలు కలిపి నెయ్యితో మంటల్లో వేస్తారు. మూడో పొయ్యిలో వండిన లాప్సీ (పాయసం) సేవాభాయాకు, ఇంటి పూర్వీకులు మగ, ఆడ వారి పేరు మీద

ఒక్కో ముద్ద చొప్పున సాంబ్రాణి, నెయ్యి పొయ్యిలో పోసి ముద్దలు పెడతారు. ముద్దలపై మంట వచ్చేటట్లు నెయ్యి పోస్తారు. మంటలు బాగా మండితే 'భోగ్' బాగా మండినదని, దేవుడు మనల్ని బాగా కరుణించాడని అనుకుంటారు. లేకపోతే ఏదో లోటు జరిగినట్లు భావిస్తారు. తర్వాత పొయ్యిదగ్గర ఉన్న నీళ్ళ చెంబులో నుండి కుడివైపు మూడుసార్లు, ఎడమవైపు మూడు సార్లు నీళ్ళు కుడిచేయితో చల్లుతారు. ఈ భోగ్ ఇచ్చేటప్పుడు ఒక దగ్గరి సామాన్లుకాని, నైవేద్యాలు కాని కలువకుండా ప్రత్యేకంగా ఉంచుతారు.

భోగ్ కార్యక్రమం పూర్తయ్యాక, అందరు మగవాళ్ళు అర్ధచంద్రాకారంలో చేతులు జోడించి నిలబడతారు. ఆడవాళ్ళు కూర్చొని ప్రార్ధన చేస్తారు. నిలబడి వున్నవారిలో ఒకరు (నాయకుడు లేదా ప్రార్ధనా తెలిసిన వృద్ధుడు) ప్రార్ధన చేస్తారు. ఒక్కొక్క దేవుడికి ప్రార్ధన పూర్తయ్యాక అందరూ వంగి నమస్కరిస్తారు. తర్వాత ఒక అడుగు గుడివైపుకు జరిగి మరో దేవుడికి ప్రార్ధన చేస్తారు. ఇలా ఎంత మంది దేవుళ్ళకు నైవేద్యం పెడితే అంతమంది పేరు మీద ప్రత్యేక ప్రార్ధనలు చేస్తారు.

ఈ సందర్భంలో చేసే ప్రార్ధన (పాట) :

"సాయివేస్ బాలాజీ, సాయీవేస్ బాలాజీ,
ఏక్‌దాణారో సంస్ దాణాకరేస్
దోకేన్ దూర్ కరేస్,
గావ్డా గోదార్ సాయివేస్
బాల బచ్చారో సాయివేస్
నంగర్ నామేరో సాయివేస్
సావుకారేన్ సమ్మక్ రాకాడేస్
ముట్టియ బర్కత్ దేస్
ఈ వరస దాడేరో (భోగ్) తోన పూంచ్ బాపూ"

(గంగావతు లచ్చునాయక్, వయస్సు 85 సం॥లు పెద్ద కిష్టాపురం, గార్ల మండలం)

**భావం :-** ఓ బాలాజీ దేవుడా! అందరినీ చల్లగా చూడు, ఒక గింజను చాలా గింజలు (దాన్యాన్ని) చేయీ, రోగాలను దూరంగా ఉంచూ, గొడ్డుగోదాలను, పిల్ల పాపలను, ఇల్లు వాకిళ్ళను చల్లగా చూడూ, సావుకారును ఇంటి ముందుంచు, చేతినిండా ధనాన్ని ఇవ్వు, సంవత్సరానికి ఒకసారి ఇచ్చే ఈపూజను స్వీకరించి, మాకు చల్లగా చూడమని అర్థం.

ఇదే విధంగా హాతిరాం బావాజీ, సేవాలాల్ భాయా, ఇంట్లో పూర్వులు (వశ్యానాయక్, హంజీభాయి, బాలు నాయక్) వారి వారి పేర్లు ముందు సంబోధించి ప్రార్ధన చేస్తారు. ఈ ప్రార్ధనలు పూర్తయ్యాక ఎక్కడి వారక్కడే కూర్చుంటారు. పూజించే వ్యక్తి ఉదయం నుండి ఉపవాసం ఉంటారు. కాబట్టి నైవేద్యం ముందు అతనికి పంచుతారు. అతను పొయ్యి దగ్గరే కూర్చుంటాడు. తర్వాత తండానాయకునికి, ఆ తర్వాత కుడి నుండి ఎడమకు అందరికి ప్రసాదం వడ్డిస్తారు. పూజారి ప్రసాదం తీసుకొండి అనే అంతవరకు ఎవరు ప్రసాదం తినరు. అందరు ప్రసాదం తిన్న తర్వాత ఎవరింటికి వారు వెళ్ళిపోతారు. ఆ తర్వాత తండాలో ఉన్న ఆడవాళ్ళను పిలిచి సాయంత్రం వరకు అందరికి ఆ నైవేద్యాన్ని వడ్డిస్తారు. సాయంత్రం ఇంటి ముందు ఉన్న పొయ్యిలను పూర్తిగా పూడ్చేస్తారు.

బంజారాల 'భోగ్' విధానం పూర్వం ఋషులు చేసే యజ్ఞాలను పోలి వుంది. నైవేద్యాన్ని నెయ్యితో కలిపి అగ్నికి ఆహుతినివ్వటం యజ్ఞాలకు పోలిన పూజగా పేర్కొనవచ్చు. ఈ పూజ ద్వారా పాడిపంటలు, ఇల్లు వాకిళ్ళు, పిల్లాపాపలను చల్లగా చూడమని కోరుకుంటారు.

ఈ పూజా విధానాల వల్ల బంజారులు జానపదులు, కావున వారు దేవతలను పూర్వీకులకు పూజించటం వల్ల 'ఆయురారోగ్య ఐశ్వర్యాలు' కలుగుతాయని భావిస్తారు.

## 3.1.6. భవానీ పూజ :

బంజారులు సాతీ భవానీలను (ఎడుగురు శక్తి దేవీలను) పూజిస్తారు. వీరిలో గోత్రాలను పట్టి ఒక్కొక్క దేవతను పూజిస్తారు. కాబట్టి ఎక్కువ గోత్రాలు, జాతులవారు జరుపుకునె 1) తొల్జాభవానీ పూజ, 2) మాత్రాల్ భవానీ పూజను మాత్రమే ఇక్కడ వివరిస్తున్నాను.

**1. తొల్జా భవానీ పూజ :**

బంజారులు స్త్రీ దేవతలను ఎక్కువగా ఆరాధిస్తారు. వారిలో తొల్జాభవాని ప్రధానమైంది. మిగిలినవి హింగళా, ధొళంగర్, సీత్లా, కంకాళి, మత్రాల్ మొదలైనవి. ప్రతి బంజారుల ఇంటిలో వెండి విగ్రహరూపంలో తొల్జా వెలిసి ఉంటుంది. ప్రతి రెండు మూడు సంవత్సరాల కొకసారి ఈ విగ్రహాన్ని బయటకు తీసి పూజ చేస్తారు. కుటుంబంలోని వారు ఏరుపడ్డపుడు ఈ విగ్రహాన్ని చిన్నవాడి ఇంట్లో భద్రపరుస్తారు. దీనినే 'థాపేర్ ఘర్' అంటారు. పూజా సమయంలో అందరు ఆ ఇంట్లోనే యాటపోతులు బలి ఇస్తారు.

తొల్జాభవానీ ఆలయం మహారాష్ట్రంలో షోలాపూర్ పట్టణానికి దగ్గర తోళజాపూర్ అనే గ్రామంలో కొండపైన ఉంది. ఆ ఆలయంలోని ద్వారబంధాలకు, తలుపులకు, విగ్రహాలకు బంగారం తోడుగులు చేయించి ఉన్నాయి. ఆ ఆలయం కొన్ని వందల ఎకరాలలో ఉంది. మొక్కుబడి ఉన్న బంజారులు తప్పక పోయి తమతమ మొక్కుబడులను తీర్చుకొని వస్తుంటారు. కాని ఎక్కువ మంది ఖమ్మం జిల్లా బంజారులు ఇంట్లో ఉన్న విగ్రహాలనే పూజిస్తారు. విగ్రహాలు తయారు చేయించుకోలేని వారు ఒక రూపాయి బిళ్ళను ఉంచి, దానికి పూజలు నిర్వహిస్తారు.

ఎంతటి బీదవారైనా ఈ పూజను తమ శక్తి మేరకు జరుపుకుంటారు. ఈ పూజను మే - జూన్ నెలలో ఏదో ఒక మంగళవారం నాడు చేసుకుంటారు. వారం రోజుల ముందే బంధువులకు సమాచార మందించి, రావలసిందిగా ఆహ్వానిస్తారు. ఇండ్లకు సున్నం కొడతారు. పూరిళ్ళు ఉన్నవారు ఎర్రమట్టితో గోడలు అలికి, మధ్య మధ్యలో సున్న పట్టీలు తీస్తారు. ఇంట్లో నేలను మట్టితో కాని ఆవు పేడతో కాని అలికి ముగ్గులు వేస్తారు. ఇంటి ముందు పేడ నీళ్ళతో సాన్పుచల్లి రకరకాల ముగ్గులు వేస్తారు. ఇంట్లో వారందరు కొత్త బట్టలు వేసుకొని చక్కగా అలంకరించుకొని తయారు అవుతారు.

పూజ రోజున పొద్దున తొల్జా భవానీని 'ధాపేర్ ఘర్' (కుటుంబంలో ఎవరైతే చిన్నవాడే వారింట్లో) నుంచి బయటకు తీసుకొస్తారు.

ఈ సందర్భంలో పాడేపాట :

“తోళ్జాయాడి నికళి మలక దేకెన,
జగ జగ నందియా ఝూంకరేచయే
ఓన యాలేమ దనియ ధోకరేచ
తొళ్జా తోన నీంద్ కూంకన యావరీచ
తొళ్జా తారె ఆసామి ఆవే పరబాతి
యాడి తోన నీంద్ కూంకన యావరీచ
యాడి తారె బోకడ కటె పరబాతి.
యాడి తోన నీంద్ కూంకన యావరీ చ
యాడి తోన కాణియా ధావ పరబాతి
ధ్వాళి తోన నీంద కూంకన యావరీ చ
ధ్వాళి తోన టూంటే ధావ పరబాతి
అంబ తోన నీంద కూంకన యావరీ చ
అంబ తోన వాంజువ ధావ పరబాతి”

(పాల్తియా సేవ్రిబాయి వయసు 90 సం॥లు చీమ్లా తండా, బేతంపూడి, టేకులపల్లి మండలం, ఖమ్మం)

**భావం:** తోళ్జామాత బయలు దేరినది లోకాన్ని కాపాడటానికి, ఆమెకు లోకంలోని వారందరు పూజిస్తున్నారు. తోళ్జా నీకు పూజ జరుగుతుంది. తొందరగా లేవాలి. నీకు నిదురెలా వస్తుంది అని చెప్పారు. అలాగే మిగిలిన 6గురు దేవతలను కూడా మేల్కొలుపు పాటలు పాడి నిద్రలేపుతారని అర్థం.

తొళ్జాభవానిని బయటికి తెచ్చి మేకపాలతోకాని, ఆవుపాలతోకాని అభిషేకం చేస్తారు. ఇంటి ముందు ఈశాన్యంలో గుంగటితో పాలణో (గుడారం) నిర్మిస్తారు. దీనికి తూర్పువైపు ఒక ధాన్యం సంచిని ఉంచి దాని మీద 'గోణ్' (గోగునారతో చేసిన సంచి) కప్పుతారు. దీనికి ముందు వర్తులాకారంలో అలికి ముగ్గులు వేస్తారు. దీనినే 'చ్వాకో పూరేరో' అంటారు. చ్వాకోపై సవాసేర్ (సేరుంపావు) జొన్నలు పోస్తారు. జొన్నల మీద 'ఛాంటియా' అనే గుడ్డను పరచి అందులో తోళ్జాభవాని వెండి ప్రతిమను ఉంచుతారు. తొళ్జా భవానీతో పాటు

ఏడుగురు శక్తి దేవతలకు ప్రతిరూపాలుగా రు రూపాయి బిళ్ళలను ప్రతిష్ఠిస్తారు. బంజారులు ఏడుగురు శక్తిదేవతలను భక్తి శ్రద్దలతో పూజిస్తారు. వెండి విగ్రహం లేనివారు రూపాయి బిళ్ళనే దేవి రూపంగా భావిస్తారు. భవాని ప్రతిమకు ముందు 5 నిమ్మకాయలు, 5 గవ్వలు, 5 కొబ్బరికాయలు, 5 పచ్చివక్కలను పెట్టి పూజిస్తారు. భవానీ నిలిపిన గుడారంపై ఎర్ర జెండాలను కడతారు. ఇలా ప్రతి కుటుంబంలోని చిన్న కుమారుడి ఇంటి ముందు ఈ 'పాలణో'ను నిర్మిస్తారు.

కుటుంబంలోని వారు బందువులు అందరూ అక్కడికి చేరుకొని, భవాని ముందే బెల్లం, బియ్యంపిండి, నెయ్యితో పాయసం వండుతారు. భవానికి నైవేద్యం ఇవ్వటానికి వండే ఈ పాయసాన్ని 'కడావో' అంటారు. యాటపోతులను భవానీ ముందు బలిఇస్తారు. కుటుంబంలో ఎంతమంది కొడుకులు ఉంటే అన్ని యాటపోతులు బలియిస్తారు. ఆర్థికస్తోమత లేనివారు కుటుంబం వారందరు కలిసి ఒక యాటపోతును బలి ఇస్తారు. యాటపోతులను భవాని ముందు నిలబెట్టి వాటి మీద కొంత నీళ్ళు చల్లి బొట్టు పెడతారు. అందరూ యాటపోతుల చుట్టూ అర్ధచంద్రాకారంలో నిలబడి 'ల యాడి ధడ్ ధడి' అంటు వేడుకుంటారు. 'ధడ్ధడి' ఇచ్చిందంటే (ఒళ్ళు జలదరించిందంటే) భవానికి ఈ పూజ అంగీకారమని, లేకపోతే ఇంకా ఎదో లోటు జరిగిందని భావించి, బలిఇస్తారు. యాట తలలను భవానికి ఎదురుగా పెడ్తారు. ఆ తలలను కూడా వరం అడుగుతారు. అది నోరు తెరిచితే దేవత కరుణించిందని భావిస్తారు.

బలి ఇచ్చిన యాట మాంసంలో నుండి పెద్దమూలికలను, పొట్ట, పేగు, మెత్తని మాంసాన్ని తీసి ఉడక బెడ్తారు. ఇందులో ఉప్పు, పసుపు మాత్రమే వేసి వండుతారు. దీనినే 'వకాళి' అంటారు. అదే విధంగా కాలేయాన్ని కాలుస్తారు. వండిన కడావోను, వకాళిలోని ఏడు పెద్దమూలికలను, కొంత వకాళిను, కాల్చిన కాలేయం (కార్జం)ను (దొప్పలో) దేవత ముందు ఒక విస్తరాకులో నైవేద్యంగా పెడతారు. ముందుగా కొబ్బరికాయలు కొడతారు. తర్వాత అక్కడ ఉంచిన మాంసం ముక్కలు, పాయసం తీసుకొని చేతిలో ముద్దచేసుకొని నెయ్యితో కలిపి వాటిని అగ్గిలో పెడతారు. పై నుండి నెయ్యిని పోస్తారు. ఇలా మూడు సార్లు మూడు ముద్దలు వేస్తారు. ఆ తర్వాత చెంబులో ఉన్న నీళ్ళను కుడిపక్క మూడు

సార్లు, ఎడం పక్క రెండు సార్లు చేతితో చల్లుతారు. తర్వాత అందరూ కలిసి 'వింతి' (ప్రార్థన) చేస్తారు. తర్వాత అందరూ కలిసి మగవాళ్ళు నిలబడి, నెత్తిన తలపాగ కట్టుకొని, ఆడవాళ్ళు కూర్చోని కొంగు చేతిలో పెట్టుకొని ప్రార్థిస్తారు. భవానిని ప్రార్థించే (వింతి) సమయంలో పాడే పాట :

సాయీ వేజాయేస్ యా తోళ్జాయాడి,
వశ్యానాయక్ తాండేర్ జన్ ఛా యాడి,
వరస్‌దాడేర్ తోన ధారేచ యాడి,
కచ్చా బచ్చాన సాయీ వేస్ యాడి,
ఉందేర్ ఘరేన హారో రకాడేస్ యాడి,
దొకేద్వాళేతి దూర్ కరేస్ యాడి,
ఘరే మ హాండి భరీ రకాడేస్ యాడి,
సావుకారేన సమణక్ రకాడేస్ యాడి,
కచ్చేరిన దూర్ రకాడేస్ యాడి,
సాయీ వేన్ సవాయి రకాడేస్ యాడి"

(భూక్యా సేవ్యానాయక్ 80 సంవత్సరాలు, మునుసుబు బంజారా, కామేపల్లి మండలం)

కొన్ని ప్రాంతాలలో ఈ విధంగా ప్రార్థిస్తారు.

"సాయీ వేస్ యాడి తోళ్జాభమాణి
వరస్ దాడేరో ఈ పూజ పూజరేచ యాడి
దొకే ద్వాళెన్ దూర్ కరేస్,
సావుకారేన సమణాక్, రకాడేన్
కచ్చేరిన దూర్ కరేస్
గావుడిగోదాన సాయీవేస్,
బాల బచ్చాన సాయీవేస్,
నంగరి నామేన్ సాయీవేస్,
ఈ పూజ తొన పూంచ్ యాడి"

(గంగావతు మూన్య 75సం॥లు పెద్దకిష్టాపురం, గార్ల మండలం)

**భావం :** ఓ తోళ్జాభవానీ! తండా వాళ్ళంతా నిన్ను కొలుస్తున్నారు. పిల్ల పాపలను చల్లగా చూడమని, ఇళ్ళు వాకిళ్ళను పచ్చగా ఉంచమని, రోగాలను దూరంగా ఉంచమని, ఇళ్ళలో కుండలు నిండుగా ఉంచమని, ధనవంతుణ్ణి అన్నింటికి ముందుంచమని, కాని పంచాయితీ (గొడవ)కి మాత్రం దూరంగా ఉంచి చల్లగా చూడమని వేడుకుంటారు.

ఆ తర్వాత ప్రతి ఇంటిలోను అన్నం, రొట్టెలు (జొన్నవి), మాంసం వండుకొని తింటారు. బందువులు పెద్దలకు మధ్యపానం (సారా) పోస్తారు. తండాలోని కొందరు పెద్దలు, డప్టియా కలిసి రాత్రంతా కంచు పళ్ళాలను, డప్పును వాయిస్తూ లయాత్మకంగా పాటలు పాడి భవానీకి భక్తి శ్రద్ధలతో కొలుస్తారు.

తర్వాత రోజు ఉదయం పెద్దలందరూ భక్తితో కంచు పళ్లాలు మోగిస్తూ, డప్టియా డప్పు వాయిస్తూ సాతీ (ఏడు) భవానీలకు ఏడు సార్లు ప్రార్థించి, భవాని ముందు సమర్పించిన నైవేద్యాన్ని అందరికీ పంచుతారు. సాయంత్రం మళ్ళీ ధప్కార్ ఇచ్చి భవానీని తీసి ఇంట్లో పెడతారు. బంధువులు వారివారి తండాలకు వారు వెళ్ళిపోతారు.

**2. మత్రాల్ భవానీ పూజ :**

ఏడుగురు శక్తి దేవతలలో ఒకటైన మాత్రాల్ భవానీని బంజారులు ప్రత్యేకంగా పూజిస్తారు. ఈ పూజను పాడిపశువులు చల్లగా ఉండాలని, పశువుల సంతానం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించి జరుపుకుంటారు. బంజారుల ఇండ్లలో గేదెలు కాని, ఆవులు కాని ఈనినప్పుడు, అప్పటి నుండి మత్రాల్ భవాని పూజ జరిపే వరకు పాలలో పంచదారగాని, బెల్లంగాని , మాంసంగాని కలిపి వాడరు. ఇంట్లో వాళ్ళకు తప్ప ఇతరులకు ఆ పాలను పొయ్యరు.

బంజారులు ఈ మత్రాల్ భవాని పూజ జరుపుకోవటం వెనుక ఒక విశేషం ఉంది. అందుకు హేతువుగా వారు వేల సంవత్సరాల క్రితం జరిగిన ఒక సంఘటనను కథగా చెప్పుకుంటారు.

"బంజారాల పూర్వీకులు ఒకరు పెద్ద పశువుల మందను కలిగి ఉండేవారట. ఆ మందలో పెయ్యదూడలు చాలా ఉన్నాయట. వాటిలో ఒక్కొటి కూడా ఈనటంలేదు. తన పశువుల మంద పెరగకుండా ఉన్నందుకు ఆయన

చింతిస్తూ ఉండేవాడట. ఒక రోజు అతడు తన మందను తోలుకొనిపోయి వాటిని మేపుతూ ఒక వేపచెట్టు కింద నిద్రపోయాడట. అప్పుడతనికి ఒక దేవత కలలోకి వచ్చి తనను ప్రతిష్టించి పూజించినట్లయితే అతను కోరుకున్నది జరుగుతుందని చెప్పిందట. ఆ దేవత బంజారుల శక్తి దేవతలైన మత్రాల్ భవాని అని తలంచి వెంటనే ఆయన ఒక రాయిని తెచ్చి చెట్టు కింద ప్రతిష్టించి తన పశువుల మందలోని పశువులు ఈనినట్లైతే పాలు, నెయ్యి, పాయసం నైవేద్యంగా సమర్పిస్తానని మొక్కి అక్కడ నుండి వెళ్ళిపోయాడట. కొన్ని రోజుల తర్వాత ఆవులన్ని ఈని పాలు, పెరుగు పుష్కలంగా లభించాయట. ఐతే అతడు మొక్కిన భవాని కరుణతో తనకు ఇంతటి పశుసంపద కలిగిన విషయాన్ని మరచిపోయాడట. ఓ రోజు భవాని అతని కలలోకొచ్చి 'నీవు పాలు, పెరుగు తింటున్నావు. మరి నాకేది' అని అడిగిందట. మరుసటి రోజే తన కుటుంబంతో స్నానాదులు ఆచరించి ఉపవాసంతో భవానిని ప్రతిష్టించిన ప్రదేశానికి వెళ్ళి పూజను నిర్వహించాడట." అని సూర్యాధనంజయ్ గారు నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం - జీవన చిత్రణా' అనే గ్రంధంలో పేర్కొన్నారు.

బంజారులు ఈ మత్రాల్ భవాని పూజ జరుపుకోవటం వెనుక మరో విశేషం ఉంది. అందుకు హేతువుగా మరో సంఘటనను కథగా చెప్పుకుంటారు.

"బంజారులు తమ బిడారులను, తమ గోవులను కాచుకుంటూ, నెల్లూరు జిల్లాలో ఉన్న కాలంలో, మూడ్ భీమా నాయక్ గార్కి ఒకే కుమార్తె జన్మిస్తుంది. ఆమె పేరు మంత్రిబాయి. ఆమె చిప్పటి నుండి దైవ భక్తురాలు. మంత్రిబాయికి పెద్ద అమ్మవారు వచ్చి చనిపోయింది. ఆమెను అక్కడే భూస్థాపితం చేసారు. బంజారాలలో పెండ్లికాని వారికి దహనం చేయరు భూ స్థాపితం చేస్తారు.

అలా మంత్రిబాయిని భూస్థాపితం చేసిన తర్వాత వారివారి తండా ప్రజలు గోవులను మేపుకుంటూ, నల్లమల అడవులకు వెళ్ళి, తండాలను నిర్మించుకొన్నారు. కొద్ది రోజుల తర్వాత మంత్రిబాయి సమాధి నుండి లేస్తుంది. తమ వారిని వెతుక్కుంటూ, వారు ఉన్నచోటుకి వచ్చి జరిగిన విషయం చెప్తుంది. ఆమెను నమ్మకుండా, అవహేళనే చేస్తారు.

అప్పుడు దైవ స్వరూపమైన మంత్రిబాయి ఆగ్రహించి మీ గోవులన్నియు మాయమైపోవుగాక మీరందరు మూర్ఛిల్లుదురుగాక అని శపిస్తుంది. ఆమె చెప్పినట్లే జరిగింది. అదులో కొంత మంది ఆమె మాటలు నమ్మినవారు మూర్ఛిల్లిపోలేదు. వారు ఆమె పాదాలపై పడి ఈ మూర్ఖులను క్షమించు, నిన్ను మా కులదేవతగా తరతరాల వారు పూజించేటట్లుగా వేడుకుంటాము. మీ గోసంపదను, మా వాళ్ళను అందరిని క్షమించి మమ్ములను కాపాడుము అని ప్రార్థిస్తారు." అని చీనియా నాయక్.బి గారు 'బంజారా చరిత్ర సంస్కృతి - ప్రగతి' అనే గ్రంథంలో పేర్కొన్నారు.

ఈ రెండు కథల వల్ల మత్రాల్ భవానీని బంజారులు పూజిస్తారని, బంజారుల కులదేవతగా మారటానికి గల కారణాలు తెలుస్తున్నాయి. అప్పటి నుండి తరతరాలుగా పూజిస్తున్నారు. పిల్లలు లేని వారు ఆమెను పూజించగా జన్మించిన పిల్లలకు మత్రూ, మత్రి అని పేరు పెట్టుకుంటారు.

అప్పటినుండి బంజారులు మత్రాల్ భవాని విగ్రహాన్ని స్థాపించి విశేషంగా పూజించటం ఆచారంగా మారింది. ప్రస్తుతం అంత గోసంపద లేనందున రెండు, మూడు సంవత్సరాలకొకసారి జరుపుకుంటూన్నారు. ఇది సాధారణంగా ఎండాకాలంలో ఎదో ఒక మంగళవారం సాయంత్రం జరుపుకుంటారు.

బంజారులు ఇంటి ఈశాన్య ఆవరణలో ఆవుపేడతో అలికి, ముగ్గులు వేసి దేవతను ప్రతిష్టిస్తారు. విగ్రహం వెండితో తయారు చేయించుకోలే పోయిన వారు ఒక రూపాయి బిళ్ళను భవానికి ప్రతిరూపంగా పెడతారు. బియ్యం, బెల్లం, పాలు కలిపి లాప్సీ (పాయసం) వండుతారు. మేకపోతును బలి (తొళ్జాభవాని పూజలో బలి ఇచ్చిన విధంగానే) ఇచ్చి అందులో నుండి కొంత మాంసం, పెద్ద మూలికలు, పేగులు, పొట్ట మాంసాన్ని తీసుకొని 'వకాళి' వండుతారు. ముందు కొత్త నిప్పురవ్వల మీద నెయ్యిపోసి మంటలు వచ్చాక మూడు ముద్దల పాయసాన్ని మంటల్లో పెడతారు. తర్వాత ఉడకబెట్టి వండిన మాంసాన్ని నైవేద్యంగా పెడతారు. తర్వాత అందరు కలిసి అర్దాస్ (ప్రార్థన) చేస్తారు. అర్దాస్ అంటే తమను చల్లగా చూడమని దేవతకు ఇచ్చే పిలుపు.

ఈ సందర్భంలో పాడే పాట (అర్దాస్) :

"సాయీ వేజాయేస్ మత్రాల్ యాడీ!
వర్షేదాడేర్ పాండ్గతోన్ కర్రేచా యాడీ!
వశ్యానాయకేర్ ఘరువాళ్ తోన పూంబ్రేచ యాడీ!
బాల బచ్చాన సాయీ వేస్,
నంగర్ నామేన్ సాయీవేస్,
గాప్టి గోదాన్ సాయీవేస్
ఘరేమా బర్కత్ దేస్
ఆంది అంగోళేన్ దూర్ కరేస్,
సావుకారేన సమ్నక్ రకాడేస్
ఈ వరస్ దాడేర్ పూజ తోన పూంచ్ యాడి"

(గంగావతు సక్రియా (డప్టియా) వయసు 85 సం॥లు పెద్దకిష్టాపురం, గార్ల మండలం)

**భావం**: ఓ మత్రాల్ మాతా! వశ్యానాయక్ కుటుంబం వారు నిన్ను కొలుస్తున్నారు. ఇంటిని, ఇంట్లోని పిల్లపాపలను, గొడ్డూ గోదాను సుఖంగా కాపాడు. ఇంటివారికి సంపద నివ్వు, గాలిదుమారాలను దూరం చెయ్. సావుకారును ఇంటి ముందుంచు. సంవత్సరానికి ఒక సారి జరిపే ఈ పూజ నీకు అందుగాక! అని అర్థం.

ప్రార్ధన అయిన తర్వాత తండా వాసులు, బందువులు, ఇంట్లోవారు భవానీ ముందు అర్ధచంద్రాకారంలో కూర్చొంటారు. ఇంటి యజమాని నైవేద్యం పెట్టిన దగ్గర (దేవత దగ్గర) పూజారిగా కూర్చుంటాడు. ముందు లాప్సీని ఒకరు, తర్వాత 'వకాళీ'ని ఒకరు మొదట పూజారికి, తర్వాత తండా నాయకుడికి పంచి, ఆ తర్వాత కుడి నుండి ఎడమకు అందరికి మోదుగు ఆకులలో పంచుతారు. అందరికి పంచటం పూర్తయ్యాక, నాయకుడు తినండని ఆజ్ఞాపిస్తాడు. ముందు పూజారి తిన్న తర్వాత అందరు తింటారు. పెట్టిన నైవేద్యాన్ని అక్కడే తినాలి. ఇంటికి తీసుకెళ్ళకూడదు.

సాయంత్రం పూజ అయిపోయిన తర్వాత యాటమాంసాన్ని వండుకొని, బంధువులు, ఇంటి పెద్దలందరు సారా తాగి, భోజనాలు చేస్తారు. తండా పెద్దలు

కొందరు, డప్పియా కలిసి రాత్రంతా భవాని ముందు కంచు, రాగి పళ్ళాలు, డప్పు వాయించు కుంటూ మత్రాల్ భవానీని పాటలతో ఆనందపరుస్తారు.

తర్వాత రోజు ఉదయం కొబ్బరికాయలు కొట్టి, దేవతకు పెట్టిన నైవేద్యాన్ని అందరికి పంచి ఆ దేవతను తీసి ఇంట్లో పెడతారు.

## 3.2. అప్రధాన పండుగలు :

ఖమ్మం జిల్లా బంజారులు అన్ని పండుగలు ఘనంగా జరుపుకోరు. వారి ఆచార వ్యవహారాలలో ఎక్కువ ప్రాధాన్యం లేని వాటిని వారు అంతగా జరుపుకోరు. ఉత్తరభారతం నుండి వీరు వలస రావటం వల్ల ఉత్తరభారతంలో జరిపే పండుగలలో వీరి ఆచారాన్ని చాటే పండుగలను మాత్రమే జరుపుకుంటారు. వీరు హిందువులే ఐనప్పటికి కొన్ని హిందువుల పండుగలకు అంత ప్రాధాన్యత ఇవ్వరు. అవి : (1) ఆటమ్ (ఉగాది), (2) శ్రీరామ నవమి, (3) దసరావ్ (4) కార్తీక పౌర్ణమి, (5) కోర్ల పున్నం (కోరల పౌర్ణమి), (6) సంక్రాంతి, (7) శివరాత్రి మొదలైనవి అప్రధాన పండుగలుగా పేర్కొనటం జరిగింది.

### 3.2.1 ఆటమ్ (ఉగాది) :

బంజారులు హిందూ సాంప్రదాయం ప్రకారం కొత్త సంవత్సరాది పండుగ చేస్తారు. వీరు ఈ పండుగ హిందు పండుగల లాగానే జరుపుకుంటారు. అంతగా బంజారుల ప్రత్యేకత ఈ పండుగలో కనబడదు.

బంజారులు ఉగాది పండుగలను ఘనంగా చేస్తారు. అందరు కొత్త బట్టలు ధరిస్తారు. ఇండ్లను శుభ్రం చేసి సున్నం వేస్తారు. ఇండ్లను మట్టి, ఆవు పేడ కలిపి అలుకుతారు. ద్వారాబంధాలకు, తలుపులకు, పసుపు, కుంకుమ బొట్లు పెట్టి చాలా అందంగా అలంకరించుకుంటారు.

ఉగాది ముందు రోజు బంజారులు పాత సంవత్సరానికి వీడ్కోలు పల్కుతారు. దీనినే 'ఆటమేర్ ఓరి' అంటారు. ఉగాది రోజు ఇంట్లో వారందరు స్నానాలు చేసి, కొత్త బట్టలు వేసుకొని, (లేనివారు పాతవాటినే), ఇంటి వాకిలికి మామిడి, వేప ఆకులతో పచ్చ తోరణాలు కడతారు. స్త్రీలు పూజ కొరకు పాయసం వండుతారు. రకరకాల పిండివంటలు చేస్తారు. ముఖ్యంగా "రోటా, వెల్టీ' (అరిసె,

కారంపూసలు) చేస్తారు. కొత్త మట్టి కుండలో లింబేర్ పూల్, అంబ, ఆమ్లీ, గోళ్, ఘీ, నారలేర్ పొడి, నూణ్, బూగ్గీ మొత్తం కలిపి ఉగాది పచ్చడి చేస్తారు. తమ వంటపొయ్యిని, అలికి, ముగ్గులువేసి, కుంకుమ, పసుపుతో అలంకరిస్తారు. పొయ్యిలో నిప్పులు బాగా ఉండేటట్లు చేస్తారు. నిప్పును కుప్పగా చేసి అందులో మొదట సంవత్సరాది (ఆటమ్)ను పాయసంతో నెయ్యిని కలిపి చేతిలో తీసుకొని నిప్పుపై పెట్టి పైనుండి నెయ్యి పోస్తారు. ఆ విధంగా మూడుసార్లు చేస్తారు.

అదే విధంగా పూర్వీకులు, చనిపోయిన తాతలు, ముత్తాతలు, అవ్వలు, ముత్తవ్వలు, తల్లి, తండ్రి వారి పేర్లు చెప్తూ, నిప్పుపై ముద్దలు వేసి నెయ్యి పోస్తారు. ఆ తర్వాత కొబ్బరికాయలు కొట్టి, చెంబులో ఉన్న నీళ్ళను, పూజకు కుడి పక్క మూడుసార్లు, ఎడమ పక్క రెండు సార్లు పోసి (చల్లి), ప్రార్థన చేస్తారు. తర్వాత వారు ఆ ప్రసాదం తింటారు.

దీపావళి రోజు బంజారులు తమ పనిముట్లైన వ్యవసాయు సామాగ్రిలన్నింటిని శుభ్రంచేసి, వాటికి గంధం, విబూది, బొట్టు పెడతారు. వ్యవసాయానికి ఆధారమైన నాగలి, గోర్రు, కాడి, మేడి, పలుపు, మోకు తాళ్ళు, ఎడ్లబండి మొదలైన వాటిని పూజిస్తారు. సంవత్సరం పాటు తమకు కష్టాలు కలగకుండా చూడమని వేడుకుంటారు.

ఖమ్మం జిల్లాలోని కొంత మంది ఉగాదికి యాటపోతులను కోస్తారు. తండాలోని కుటుంబాలను బట్టి, ఆ ఊరికి సరిపోయే విధంగా పోగులు పెట్టి అందరికి పంచుతారు. అందరు వండుకొని, జొన్నరొట్టెలు, భోజనాలు వండుకొని ఇంటిల్లిపాది తింటారు.

ఈ పండుగకు వీరి ఐతిహ్యంలో కాని, కథలతో కాని ఎక్కడా సంబంధం లేదు. అందుకే బంజారులు ఈ పండుగను అంతగా జరుపుకొరు. బంజారుల ఆచార వ్యవహారాల్లో ఉన్న పండుగలనే ఘనంగా నిర్వహిస్తారు.

### 3.2.2 శ్రీరామ నవమి :

బంజారులు శ్రీరామనవమి ఎక్కువగా జరుపుకోరు. కానీ ఖమ్మం జిల్లా బంజారులు ఈ శ్రీరామనవమిని ఉత్సాహంగా, ఒక పండుగలాగా

జరుపుకుంటారు. దీనికి కారణం ఖమ్మం జిల్లాలోని భద్రాద్రిలో శ్రీరామనవమి ఉత్సవాలు బ్రహ్మాండంగా జరగడమే. అదే విధంగా బంజారుల ఆరాధ్య దేవతలలో శ్రీరాముడిని కొలవటం. బంజారులు ఇద్దరు తటస్థపడినప్పుడు 'రాం రాం' అంటూ పలకరించుకొంటారు. దీనిని బట్టి రాముడంటే బంజారులకు ఎంత ఇష్టమో తెలుస్తుంది. అదే విధంగా బంజారులు ప్రతి ఒక్క దేవుణ్ణి 'రాం' అనే అంటారు. అదే విధంగా ఆకాశాన్ని కూడా 'రాం' అనే అంటారు. దేవతలందరు పై లోకంలో ఉంటారు కాబట్టి పైన వున్న ఆకాశాన్ని 'రాం' అంటారు.

భద్రాద్రిలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా సీతారాముల కళ్యాణోత్సవం రోజున ప్రతి తండాలో శ్రీరామనవమి కళ్యాణం జరుపుకుటారు. తండా నాయకుడు, నాయకురాలు కలిసి పీటల మీద కూర్చొని సీతారాముల కళ్యాణం జరిపిస్తారు. ఈ కళ్యాణోత్సవం సాధారణంగా ఆంజనేయ స్వామి ఆలయాలలో జరుపుకుంటారు.

తండాలోని వారందరు కొత్త కుండలో బెల్లంతో పానకం తయారుచేసుకొని, ఇంటికి ఒక కొబ్బరికాయ చొప్పున, అన్నం చింతపులుసు కలిపి 'పులిహార' సిద్ధం చేసుకొని కళ్యాణోత్సవానికి వెళ్తారు. భక్తి శ్రద్ధలతో భద్రాద్రిలో జరిగే విధంగానే రేడియోలో వింటూకాని, టి.వీలో చూస్తూకాని సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. కళ్యాణం పూర్తయిన తర్వాత అక్కడ అక్షింతలను నెత్తిన చల్లుకొని, కొబ్బరికాయలు కొట్టుకొని, పానకం, పులిహార అందరికి పంచి, కొంత అక్షింతలను ఇంటికి తీసుకొచ్చి ఇంట్లో కొంత చల్లి, కొంత కొత్త గుడ్డలో కట్టి దాచుకుంటారు.

సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంలో డప్పులు, దరువులు మోగిస్తూ ఆడవాళ్ళు డప్పునృత్యం చేస్తారు. మగవాళ్ళు కోలాటం ఆడతారు. ఈ విధంగా శ్రీరామనవమి సంబరాలను ఉత్సాహంగా, ఒక పండుగలాగ జరుపుకుంటారు.

### 3.2.3 దసరావ్ పండుగ :

ఖమ్మం జిల్లాలో బంజారులు దసరా పండుగను అంతగా జరుపుకోరు. దసరానే 'దసరావ్' అని పిలుస్తారు. బంజారులు హిందువులే కాబట్టి సంప్రదాయం ప్రకారం జరుపుకుంటారే కాని జరుపుకోవాలని నియమంలేదు.

దసరావ్‌ను హిందువులు జరుపున్నట్లే, ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి రోజున జరుపుకుంటారు. దసరావ్ రోజు ఇంటిని, ఇంటి సామాన్లను శుభ్రపరచుకొని బంధువులను పిలిపించుకుంటారు. దసరాకు కొన్ని ప్రాంతాలలో వారి ఇష్టదైవాలను పూజించుకుంటారు. వారి ఇష్టదైవాల కోసం యాటలను తెచ్చి బలి ఇస్తారు. ఈ విధానాన్ని మఠ్రాల్ భవానీ పూజ, తొళ్జా భవానీ పూజ విధానాన్ని వివరించిన చోట వివరించబడింది. శక్తి దేవతలను పూజించిన తర్వాత మాంసం కూర, అన్నం, జొన్న రొట్టెలు చేసుకొని, బంధువులు ఇంటివారు కలిసి భోజనం చేస్తారు. చిన్న పిల్లలకు బళ్ళకు సెలవులు ఎక్కువగా ఉండటంతో ఇంట్లో సందడి వాతావరణం కనిపిస్తుంది. వారి కోసం వారం ముందే అరిసెలు, కారంపూసలు(టోటా, వేల్డి) లాంటి పిండివంటలు చేసుకుంటారు.

ఖమ్మం జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో 'జమ్మి ధోకేరో' కార్యక్రమం నిర్వహిస్తారు. 'జమ్మిచెట్టును మొక్కుట' అని అర్థం. జమ్మిచెట్టు దగ్గరికెళ్లి కొబ్బరికాయలు కొట్టి అగరుబత్తులు వెలిగించి, పసుపు కుంకుమ చల్లి జమ్మి చెట్టుకు పూజలు చేస్తారు. ఆ తర్వాత ఆ చెట్టు ఆకులు తెంపుకొచ్చి. ఇంట్లో వాళ్ళకు బందువులకు తండా వాళ్ళకు పంచుతారు. పంచేటప్పుడు 'సోనోలేని' అంటూ పంచుతారు. సోనో అంటే 'బంగారం' అని అర్థం. ఇలా ఒకరికొకరు పంచుకున్న సోనో జమ్మిచెట్టు ఆకులను వారి ఇంట్లో లేదా ధాన్యం గుమ్మిలలో దాచుకుంటారు.

దసరా బంజారుల పండుగ కాకపోయినప్పటికి, హిందువుల ప్రభావం వల్ల, నాగరిక ప్రభావం వల్ల దీన్ని హిందువుల లెక్కనే దేవి నవరాత్రులతో ప్రస్తుత సమాజంలో ఎక్కువ ప్రాంతాలలో నిర్వహించుకుంటున్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు అంగరంగవైభవంగా జరుపుకుంటారు. ఆర్థిక స్తోమత లేనివారు అగరుబత్తులు, కొబ్బరికాయ కొట్టి తమ ఆరాధ్యదైవాలను పూజించుకుంటారు. కాబట్టి ఇది బంజారుల ప్రధాన పండుగ కాదనే చెప్పవచ్చు.

### 3.2.4 కార్తీక పౌర్ణమి :

కృతిక నక్షత్రంలో చంద్రుడు పూర్ణుడై ఉన్నమాసం కావున ఇది కార్తీక మాసం అనబడును.

ఈ కార్తీకమాసమంతయూ, శైవ, వైష్ణవ భక్తులేకాక సాధారణ భక్తులు సాయంకాలంలో దీపాలవేళలో, కార్తీక దీపారాధనలు, పూజలు జరిపి, దైవ ప్రసాదాన్ని భుజిస్తారు. ఈ కార్తీక మాస ప్రదోషకాలంలో మహేశ్వరుడు ఒకే సమయంలో రెండు రూపాలను అనగా హృదయభాగాన పార్వతీ, కుడి భాగన పరమేశ్వర రూపాన్ని ధరించి అర్ధనారీశ్వరుడిగా దర్శనం ఇస్తాడట. ఈ దర్శనం అత్యంత అరుదైన అపురూపం అనబడును.

ఖమ్మం జిల్లా బంజారులు ఈ కార్తీకపౌర్ణమి రోజు సాయంకాలం కుండలకు సున్నంరాసి, బొట్లు పెట్టి తమ పంట పొలాలో రాళ్ళమీద బోర్లిస్తారు. లేదా ఒక కర్రపాతి ఈ కర్రలో తగిలిస్తారు. రాత్రి పూట కాగానే ఇంట్లో దీపాలను, పంటపొలాలలో దీపాలను వెలిగించి తమ ఆరాధ్యదైవములకు అగరుబత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి ప్రార్ధన చేస్తారు. తమను, తమ పంటపొలాలను చల్లగా చూడాలని ఇంట్లో లక్ష్మీదేవి కళకళలాడాలని వేడకుంటారు.

ఈ పండుగను బంజారులు అంతగా జరుపుకోరని చెప్పవచ్చు. కొంత మంది వరంగల్లు జిల్లా, కురవి మండలంలో కందికొండ జాతరకు వెళ్తారు. ఆ కొండపై రాత్రిపూట దీపాలు వెలిగించి, విద్యుద్దీపాలతో అలంకరణ చేస్తారు.

### 3.2.5 కోర్ల పున్నం :

కోరల పౌర్ణమిని బంజారులు 'కోర్ల పున్నం'అని, కుక్కల పండుగ అని పిలుస్తారు. ఇది కార్తీక పౌర్ణమికి సమీపంలోనే వస్తుంది. ఈ పండుగను బంజారులు మానవుల కోరలలోని విషం పోవాలని జరుపుకుంటారు.

ఈ పండుగ బంజారులు మాత్రమే జరుపుకుంటారు. వీరు నిర్వహించే విధానం కూడా ఒక ప్రత్యేకమైనది. ఈ పండుగ ఇంట్లో సజ్జలు పుష్కలంగా వచ్చే కాలంలో జరుపుకుంటారు. ఈ పండుగ రోజు సాయంత్రం మధ్యతరగతి బంజారులు సజ్జపిండిని, ఉన్నత కుటుంబంవారు బియ్యంపిండిని బెల్లాని కలిపి నానబెట్టి కుడుములు చేస్తారు. ఆ కుడములను ఒక ఇత్తడి కుండలో కింద సజ్జచొప్ప లేద వరిగడ్డి వేసి అవి మునగకుండా కొంత నీళ్ళుపోసి, వాటి మీద ఈ కుడములు వరుసగా పరుస్తారు. తర్వాత మూతకప్పి, కాసేపు ఉడకబెడతారు.

రాత్రిపూట అందరూ స్నానాదులు చేసుకొని దీపారాధన చేసి, కుడుములు తలా రెండు తీసుకొని ఇంటి ఎదురుగా నిలబడి, వాటిని కొంత పంటితో కొరకి, ఆ తర్వాత కాళ్ళ కింద నుండి ఇంటిమీద నుంచి ఇంటి వెనుకకు పడేటట్లు మూడుసార్లు విసిరి వేస్తారు. తర్వాత నాలుగు సార్లు పంటితో కొరకి కుక్కలకు 'తీయో' అంటూ పడేస్తారు. ఆ తర్వాత ఇంట్లో వాళ్ళందరు కుడుములు తింటారు. పండ్లతో కొరకటం వల్ల కోర్ల (కోరలు) పున్నం అంటారు. కుక్కలకు విసిరేయటం వల్ల కుక్కల పండుగ అంటారు.

ఇలా చేయటానికి ఒక శాస్త్రీయ పద్ధతి ఉండి ఉండవచ్చు. ఎందుకంటే మానవులకు నవంబరు, డిసెంబరు కాలంలో పండ్లకు విషం వస్తుందని నమ్మకం. కావున ఆ విషాన్ని పోగొట్టటం కోసం ఈ ఆచారాన్ని పెట్టి ఉండవచ్చు. ప్రతి పండుగలు, పూజలు నిర్వహించటం వెనుక శాస్త్రీయ సంకేతాలున్నట్లే, దీనికి ఉ ండి వుండవచ్చు.

### 3.2.6 సంక్రాంతి :

ఖమ్మం జిల్లా బంజారులు సంక్రాంతి పండుగను ఎక్కువగా జరుపుకోరు. ఈ పండుగ జనవరి నెలలో ఎక్కువ వస్తుంది. బంజారులు ఎక్కువగా పోడు వ్యవసాయం చేస్తారు. వీరు చేసే వ్యవసాయ పంటలు ఇంకా ఈ నెలలో అందక పోవటం, అవి అన్ని కోతల సమయం కావటంలో ఈ పండుగను ఇంట్లోకన్నా పంటపొలాలల్లోనే అధికంగా జరుపుకుంటారు.

సంక్రాంతిలో భోగి, మకర సంక్రాంతి, కనుమ అని మూడు రోజులుంటాయి. కానీ బంజరులు భోగి రోజున వారి పంట పొలాలలో మూడు రాళ్ళు తెచ్చి పొయ్యిపెట్టి బియ్యం, పాలు, బెల్లంతో కలిపి పాయసం వండుతారు. ఆ పాయసంలో పంట పొలాలలో ఏ పంట వుంటే (సాధారణంగా ఈ కాలంలో జొన్నలు, కందులు, ఆనపకాయలు, అలిసిందకాయలు) వాటిని తెంపి గింజలు తీసి పాయసంతో కలిపి వండుతారు. తర్వాత ఇస్తరాకులో పాయసాన్ని పెట్టి, అగరుబత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి, పాయసాన్ని నిప్పురవ్వలలో నెయ్యితో కలిపి పెట్టి 'భోగ్' (నైవేద్యం) ఇస్తారు. ఇది తమ ఆరాధ్యదేవతల పేరు మీద పూజచేస్తారు. తర్వాత ఇంటిల్లిపాది ఆనైవేద్యాన్ని తింటారు.

రెండవ రోజు మకర సంక్రాంతి రోజు మధ్యాహ్నం తండా నాయకుని ఆధ్వర్యంలో యాటపోతులు కోస్తారు. వాటిని తండాలో ప్రతి కుటుంబానికి సరిపోయేటట్లు పొగులు పెడతారు. యాటపోతులోని మెత్తని మాంసాన్ని, పేగులు, పొట్టమాంసాన్ని తీసి, యాటరక్తాన్ని పట్టి, మాంసాన్ని బాగా ఉడకబెట్టి అందులో ఆ రక్తాన్ని ఉప్పు, చింతపండుతో కలిపి వేసి బాగా ఉడకబెడతారు. దీనినే 'సళోయి' అంటారు. ఇది కూడా అందరికి పంచుతారు. మాంసాన్ని కూరవండుకొని, జొన్న రొట్టెలు చేసుకొని, సళోయితో కలుపుకొని, బంధువులు ఇంటి వారందరు భోజనం చేస్తారు.

కనుమను బంజారులు జరుపుకోరు. భోగి, మకర సంక్రాంతి మాత్రమే జరుపుకుంటారు. ఇల్లు అంతా పంటలతో నిండి కళకళలాడుతుంటాయి. వీరివి చిన్న చిన్న గుడిసెలు, ఇళ్ళుకావటంతో ఇంట్లో ఖాళీలుండవు. కావున వీరు పంటల కోసం ప్రత్యేకంగా 'గుమ్మి'లను ఏర్పాటుచేసుకోని పంటలన్నింటిని వాటిలో తవడకుండా దాచుకుంటారు. ప్రస్తుత కాలంలో హిందువులను చూసి వీరు కూడా మూడు రోజుల పండుగను జరుపుకుంటున్నారు. బియ్యం పిండితో అరిసెలు (టోటా), శెనగపిండితో కారంపూసలు (వేల్డి) చేసుకొని పండుగ జరుపుకుంటున్నారు.

**3.2.7 శివరాత్రి :**

మహా శివరాత్రి మాఘ బహుళ చతుర్ధశినాడు జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరుపుకుంటారు. శివరాత్రి ప్రత్యేకం శివుడి పూజా, జాగారం. కానీ ఖమ్మం బంజారులు ఈ శివరాత్రి పండుగను అంతగా జరుపుకోరు.

శివరాత్రి రోజు మాములుగానే పూజచేసి, రాత్రి తమ సమీపంలో ఉన్న వరంగల్లు జిల్లా కురవి జాతరకు, ఖమ్మం జిల్లాలోని తీర్థాల (కూడేలి) జాతరకు వెళ్తారు. కురవిలో వీరభద్రస్వామి ఉంటాడు. అక్కడ రాత్రి జాగారం చేస్తారు. అక్కడకు వచ్చి బంజారులు కోరికలు కోరుకుంటారు. ఆ దేవుని పూజల వల్ల సంతానం కలిగే 'వీరన్న' అనే పేర్లు కూడా పెట్టుకుంటారు. అక్కడ రాత్రంతా సందడే, సందడి అక్కడికి వేలసంఖ్యలో ప్రజలు రావటం వల్ల రాత్రంతా జాగారం చేసినట్లే అనిపించదు. ఈ జాతరకు అధికశాతం యువకులు మాత్రమే వస్తారు.

అదే విధంగా కొన్ని ప్రాంతాల వారు ఖమ్మం జిల్లాలో తీర్థాల వద్ద జరిగే 3రోజుల కూడేలి జాతరకు వెళ్లారు. ఇక్కడ సంఘమేశ్వర స్వామి కొలువుతీరాడు. ఈ ప్రదేశాన్ని 'కూడలి' అంటారు. ఇక్కడ రెండు నదులు కలుస్తాయి. మున్నేరు నది, పాఖాల్ నది ఇక్కడ సంగమిస్తాయి. కావున 'కూడలి' అంటారు. ఇక్కడ కొలువుతీరిన శివుడికి 'సంగమేశ్వర స్వామి' అంటారు. ఈ కూడలిలోని నీటిని తీర్థంగా తీసుకుంటే, ఇక్కడ స్నానం చేస్తే పుణ్యం వస్తుందని నమ్మకం. కాబట్టి 'తీర్థాల' అని పేరు వచ్చింది.

తీర్థాల జాతర మూడు రోజులు జరుగుతాయి. కానీ బంజారులు రెండు రోజులు మాత్రమే ఈ జాతరలో పాల్గొంటారు. ఒకప్పుడు ఎడ్లబండ్లమీద, ప్రస్తుతం వాహనాల్లో వచ్చి సంఘమేశ్వర స్వామిని దర్శించుకొని, తీర్థాలలో కూడలిలో స్నానం చేసి, రాత్రంతా జాగారం చేసి పుణ్యం కట్టుకొని, తర్వాత రోజు ఇంటికి బయలుదేరుతారు. ఇంటికి వెళ్ళిన తర్వాత తండాలోని వారందరికి పేలాలు, మిఠాయిలు, కొబ్బరి కాయలు పంచి నైవేద్యంగా పెడ్తారు.

ఈ శివరాత్రిని బంజారులు అంతగా జరుపుకోరనే చెప్పవచ్చు.

ఈ విధంగా ఖమ్మం జిల్లా బంజారులు అన్ని పండుగలను ఒక్కొక్క ప్రత్యేకమైన విధానంతో జరుపుకుంటారు. ఐతే ఇందులో ఒక సాధారణ విషయం ఉంది. బంజారులు మాంసప్రియులు. కావున ప్రతి పండుగనాడు జంతుబలి చేసి మాంసం తినవలసిందే. వీరు యాటమాంసాన్ని (జంతుబలి) తినలేని పరిస్థితిలో కనీసం కోడి పుంజులను బలిఇస్తారు. వీరు దేవుళ్ళ పేరు మీద యాటపోతులు, గొర్రెపోతులు, కోళ్ళు, కోడిపుంజులను సంవత్సరాంతం పెంచి దేవుళ్ళకు, దేవతలకు వారి వారి సందర్భాలలో బలిఇస్తారు. శాఖాహారులైన దేవుళు ళ బాలాజీ, సేవాభాయా, హాతిరాం, హనుమాన్ మొదలైన దేవుళ్లకు వీరు 'చుర్మో' పాయసం బియ్యంతో వండినది 'లాప్సీ' లేదా బియ్యం పిండితో వండిన 'కడావ్'లను మాత్రమే నైవేద్యంగా సమర్పిస్తారు. దీనిని బట్టి చూస్తే వీరు చాలా భక్తి శ్రద్ధలతో ఈ పండుగలు నిర్వహించుకొంటారని స్పష్టమవుతుంది.

ఖమ్మం జిల్లాలో బంజారులు జిల్లాలో జరిగే కొన్ని జాతర్లకు ఎడ్లబండ్లు, వాహానాలు ఏర్పాటుచేసుకొని వెళ్ళి దర్శించుకుంటారు. ఇందులో హిందువుల

జాతరలు, ముస్లీంల జాతరలు, బంజారుల జాతర్లని బేదాభిప్రాయం లేకుండా ప్రాంతీయంగా జరిగే జాతర్లకు వెళ్ళి తమ మొక్కులను తీర్చుకుంటారు. దీని ద్వారా హిందుముస్లీం క్రైస్తవ భేదాభిప్రాయం లేకుండా ఐక్యంగా ఉంటారనే విషయం అవగతమవుతుంది. వీరు దర్శించుకునే జాతర్లలో ఇల్లందు సమీపంలో దసరాకు జరుపుకునే కోటమైసమ్మ జాతర, శివరాత్రి సందర్భంగా నిర్వహించే వరంగల్లు జిల్లాలోని కురవి జాతర, వరంగల్లు సమీపంలోని కోమలమ్మ జాతర, ఖమ్మం సమీపంలోని కూడేలి జాతరలు సందర్శించి, దర్శనాలు చేసుకుంటారు.

ఇవేకాక భావుసింగ్ బావ జాతర (మరిపేడ), పీర్లపండుగ జాతరలు (గొల్లచర్ల), థడోజాతర (చిన్నకిష్టాపురం), పెద్దమతల్లి జాతర (పాల్వంచ), లింగాబచ్యా (బీబీనగర్), భావుసింగ్ బావ జాతర (పొరగఢ్, మహారాష్ట్ర), సిక్కుల జాతర (నాందేడ్)లను దర్శించుకొని, అక్కడ యాటపోతులు, కోళ్ళు లేద భోగ్ (అన్నం, పప్పు) నైవేద్యంగా పెట్టి తమ మొక్కులను తీర్చుకుంటారు.

ఆయా జాతర్ల సమయంలో అక్కడ వున్న దేవుళ్లను మొక్కుకుంటారు. ఆమొక్కు తీరి సంతాన ప్రాప్తి కలిగితే ఆ దేవతల పేర్లను పెట్టుకుంటారు. అలా పెట్టిన పేర్లలో హుస్సేన్, లింగాబచ్యా, భావుసింగ్, (కొరవి) వీరన్న, కోమల, కమల, మదార్, కోటమైసమ్మ, బుచ్చమ్మ, అచ్చమ్మ మొదలైనవి.

ఈ విధానాన్ని బట్టి బంజారులలో వున్న భక్తిభావం కనిపిస్తుంది. అలాగే మూఢనమ్మకాలు కూడా కనిపిస్తాయి. వీరు జానపదులు కావటంచేత మూఢభక్తిని అధికంగా నమ్ముతారు. దొంగసాధువులను నమ్మి తమ కాపురాలను, శీలాన్ని పోగొట్టుకున్న సంఘటనలు ఎన్నో వున్నాయి. వారు ఇచ్చే మూలికలను తిలి ఆరోగ్యాన్ని పాడుచేసుకున్న వాళ్ళు వున్నారు.

బంజారులు ప్రపంచీకరణలో భాగంగా దేశ, విదేశాలలో, పట్టణాలలో ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడ్డప్పటికి, వీరిలో ఉన్న మూఢనమ్మకాలను, ఆచారాలను ఇంకా పోగొట్టుకోలేదనే చెప్పవచ్చు. ఆచార సంప్రదాయాలను నిలుపుకోవటం జాతికి మంచిదే కానీ మూఢనమ్మకాలను విడనాడకపోవటం అమాయకత్వం, అనాగరికం అవుతుంది.

# ముగింపు

బంజారులు భారతదేశంలోని 17రాష్ట్రాలలో, ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాలలో విస్తరించివున్నారు. వీరిని లంబాడీలు, సుగాలీలని కూడా వ్యవహరిస్తారు. వీరిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్ తెగగా గుర్తించింది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 33 తెగలుంటే అందులో పెద్దతెగ 29వ తెగ బంజార తెగ. అన్ని తెగలకు ప్రత్యేక లక్షణాలు - ఆచార వ్యవహారాలు ఉన్నట్లే, బంజార తెగకు కూడా ప్రత్యేక లక్షణాలు - ఆచారవ్యవహారాలున్నాయి. వీరి ఆచార వ్యవహారాలు మిగిలిన తెగకన్న ప్రత్యేకంగా కనిపిస్తాయి. దీనికి కారణం వీరు రాజపుత్ర సంతతికి చెందినవారు కావటం. బంజారులు మొదట ఉత్తరభారతదేశంలో ఉండేవారని తర్వాత దక్షిణ భారతదేశానికి వచ్చారని చరిత్రకారులు వివరిస్తారు.

బంజారుల వంశచరిత్రలను పరిశీలిస్తే వీరు రాజస్థాన్‌లోని రాజపుత్రుల వంశానికి చెందిన వారనే అభిప్రాయం బలపడుతుంది. వీరు పూర్వం రాజపుత్ర వంశీయులని కారణాంతరాల వల్ల వారి నుండి విడిపోయి వృత్తిని, వేషాన్ని, భాషను, ఆచార వ్యవహారాలను కొంతవరకు మానుకొని ప్రత్యేక తెగగా ఏర్పడినారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించారు. ఇలా విస్తరించిన వారిలో ఖమ్మం జిల్లా బంజారులు వ్యవసాయ ఆధారంగా ఖమ్మం జిల్లాలో స్థిరపడ్డారు. వీరి సమాజం ప్రత్యేకంగా వుంటుంది. వీరు తండా(సమాజం)ను నిర్మించుకొని, వాటికి ప్రత్యేక రాజకీయ వ్యవస్థను ఏర్పాటుచేసుకొని, తండాకు నాయకుడు (నాయక్), కారోభారి (కార్యదర్శి, కరణం) డష్టియా (సమాచారకుడు)ను ఏర్పాటుచేసుకొని, ప్రత్యేక కట్టుబాట్లను ఆచార వ్యవహారాలను ఏర్పాటు చేసుకున్నారు. ఆధునిక యుగంలో ఇవి అన్ని అంతరించిపోతున్నాయి.

ఖమ్మం జిల్లా బంజారులు హిందువులే అయినప్పటికీ వీరు పండుగలను జరుపుకునే విధానం ప్రత్యేకంగా కనిపిస్తారు. బంజారులు తండాలోని వారందరు కలిసి సామూహికంగా ఈ పండుగలను నిర్వహించుకొంటారు. బంజారులు తమను, తండాను, తండావాళ్ళను, పాడిపంటలను క్షేమంగా ఉంచాలని కోరుతూ ఈ పండుగలను జరపుకుంటారు. ఖమ్మం జిల్లా బంజారులు అన్ని పండుగలను

ఒకేలా జరుపుకోరు. వారికి ఇష్టమున్న వాటికి, వారి ఆచార వ్యహారాలలో భాగమైన వాటిని మాత్రమే ప్రధానంగా జరుపుకుంటారు. ఇందులో 1. సీత్లాపూజ, 2.తీజ్‌పండుగ, 3.దవాళి పండుగ, 4. హోలి పండుగ, 5.భోగ్‌పూజ, 6. భవానీ పూజలు ప్రధానమైనవి. అదేవిధంగా 1. ఆటమ్ (ఉగాది), 2. శ్రీరామనవమి, 3. దసరా, 4. కార్తీక పౌర్ణమి, 5. కోర్ల పున్నం (కోరల పౌర్ణమి), 6. సంక్రాంతి, 7. శివరాత్రి పండుగలు అప్రధానమైనవి.

ఇవేకాక తమ ఆరాధ్యదేవతలైనా శ్రీవేంకటేశ్వరసామి, హాతిరాం బావాజీ, సేవాలాల్ భాయాను ప్రత్యేక భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. అలాగే తమ పూర్వీకులైన తాతముత్తాతలను భక్తి శ్రద్ధలతో పూజించి నైవేద్యాన్ని సమర్పిస్తారు.

ఖమ్మం జిల్లా బంజారులు జరుపుకునే పండుగలలో కొన్ని ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయి. ఒకటి బంజారులు తండాలోని వారందరు కలిసి ప్రతి పండుగను సామూహికంగా జరుపుకోవటం, రెండవది ప్రతి పండుగను తండా నాయుకుని అనుమతితో నిర్వహించుకోవడం, మూడవది పండుగలకు పూజలకు బంతుబలి, మధ్యపానం తప్పనిసరి.

ఇంతటి గొప్ప బంజారా తెగ ఆధునిక యుగంలో, నాగరిక సమాజ ప్రభావంతో తన ఆచార వ్యవహారాలనూ, సంస్కృతి-సంప్రదాయాలనూ, వేషభాషలనూ, పండుగలనూ, జీవన విధానాన్ని కోల్పోతుంది. ప్రస్తుత సమాజంలో బంజారులు చదువులోనూ, ఉద్యోగ వ్యాపారాలలోనూ ముందుండినప్పటికి, చాలా శాతం బంజార ప్రజలు అభివృద్ధికి నోచుకోవటం లేదు. ప్రపంచ వ్యాప్తంగా బంజారులు స్థిరపడినప్పటికీ, తవ వేషభాషలను మార్చుకొన్నప్పటికీ వారు నిర్వహించుకునే పండుగలు మాత్రం నేటికి తమ ఉనికి కోల్పోలేదు. నగరాలలో, పట్టణాలలో స్థిరపడ్డవారుకూడా ఈ పండుగ దినాలలో తమ తండాలకు వచ్చి, ఈ పండుగలను ఘనంగా నిర్వహించుకుంటారు. తండాలకు రావటానికి సమయంలేనివారు. పట్టణాలలోనే ఈ పండుగలను నిర్వహించుకుంటున్నారు.

బంజారుల పండుగలు తరాలు మారిన కొద్ది అవి అంతరించి పోతున్నాయి. ఈతరం పిల్లలకు వేషభాషలతోపాటు ఆచార వ్యవహారాలు కూడా తెలియటంలేదు. ఇక పండుగల విషయంలో అసలు తెలియటం లేదు. దీనికి

మూడు కారణాలున్నాయి. ఒకటి నాగరికత, పట్టణ జీవనానికి అలవాటు పడటం. రెండవది క్రైస్తవ మత వ్యాప్తి. ఖమ్మం జిల్లాలో దాదాపు 30 శాతం మంది బంజారులు క్రైస్తవమతాన్ని స్వీకరించారు. మూడవది బంజార భాషకు లిపి లేకపోవటం, సాహిత్యం అందరికి అందకపోవటం.

బంజారుల పండుగలు ఈ తరంతోనే అంతరించి పోకుండా ముందు తరం వారికి అందించటానికి ఈ పరిశోధన వ్యాసాన్ని స్వీకరించటం జరిగింది. బంజారులు, బంజారేతరులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు జరిపి బంజారుల సంస్కృతి సంప్రదాయాలను కాపాడవలసిన ఆవశ్యకత ఉంది. బంజారుల మీద విభిన్న కోణాలలో పరిశోధనలు జరగాలని ఆశిస్తూ ముగిస్తున్నాను.

# ఆధార గ్రంథ సూచిక :

## I. గ్రంథాలు :


1. కుసుమకుమారి, ఆర్. 2006. బంజారా చరిత్ర ఆంధ్రలో వికాసం ప్రస్తావన. విశాఖపట్టణం. పమార్ పబ్లికేషన్స్.
2. కృష్ణమాచార్య, దాశరథి. చిల్లరదేవుళ్ళు.
3. కృష్ణనాయక్ చవాణ్, యం. 2006. బంజారా గీతామృత్ - హైదరాబాద్.
4. గంగాధరరావు, కొర్రపాటి. 1976. లంబాడోళ్ళ రాందాసు (నవల), విజయవాడ. ఛాయా పబ్లికేషన్స్.
5. గోపాలకృష్ణయ శెట్టి, నరహరి. 1872. శ్రీరంగరాజ చరిత్రము.
6. గోనానాయక్, యం. 2005. భారతదేశంలో బంజారాలు, హైదరాబాద్, తెలుగు అకాడమి.
7. గోనా నాయక్, యం. 2002 సుగాలీ సంస్కృతి భాషా సాహిత్యాలు, హైద్రాబాద్. లక్ష్మి పబ్లికేషన్స్.
8. చీనియానాయక్, బి. 1998. బంజారా చరిత్ర సంస్కృతి-ప్రగతి. అనంతపురం. హాతిరాం బాబజీ పబ్లికేషన్స్.
9. జీవలా నాయక్, నూన్సావత్. 1990. బంజారా (లంబాడీ) వంశావళి. పిడుగు రాళ్ళ. గాంధీజీ సుగాలి సేవక్ సంఘం.

10. నదీమ్ హుస్సైన్ - 2000. భారతీయ గిరిజనులు. హైదరాబాద్ - ఓరియంటల్ లాజ్మన్.
11. ప్రేమ్‌చంద్‌నాయక్, ధారావత్. 2003. గ్యానె ధ్యానేర్ గ్వారూర్ గిద్. గుంటూరు.
12. ప్రేమ్‌చంద్‌నాయక్, ధారావత్. 2001. లంబాడి గోర్‌భోలి భాష, సంకల్ప ఆఫ్‌సెట్ ప్రింటింగ్, పాల్వంచ
11. బాలాజీదాసు, రాథోడ్. 1982. బంజార వంశావళి చరిత్ర, హైదరాబాద్. బాలా సాహితి బుక్‌ట్రస్ట్.
12. మల్లికార్జున్ హిరేమత్. 2004. తాండా (నవల), హైదరాబాద్ - హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
13. మురళీకృష్ణ, దేవరకొండ. 2009. పండుగలు - ప్రాముఖ్యత, విజయవాడ. శ్రీమహాలక్ష్మి బుక్ కార్పోరేషన్.
14. వీరభద్రరావు, కొత్తపల్లి. 1986. తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావం - హైదరాబాదు.
15. వెంకటలాల్, జి. 2011. తెలుగు నవలల్లో బంజారు(లంబడీ)ల జీవన చిత్రణ - ఖమ్మం.
16. వెంకటలాల్, జి. 2011. కొర్రపాటి గంగాధరరావు నవల పరిశీలన - ఖమ్మం.
17. సిత్మానాయక్, ఎ. 2011. నల్లగొండ జిల్లా నూతనకల్లు మండలం లంబాడీల కథలు, హైద్రాబాద్. ఓరియంటల్ లాజ్మన్
18. శంకరయ్య, జనపాల. 1995. కరీంనగర్ జిల్లా - లంబాడీల ఆచార వ్యవహారాలు. ఆవునూరు - జనపాల వారి ప్రచురణలు.
19. శంకర్య, జనపాల. 2001. తెలుగు లంబాడీల గేయ సాహిత్యం, ఆవునూరు - జనపాల వారి ప్రచురణలు.
20. సత్యనారాయణ, కంభంపాటి. 1998. ఆంధ్రుల సంస్కృతి చరిత్ర-1, హైద్రాబాద్ - హైద్రాబాద్ బుక్ ట్రస్ట్.
21. సత్యనారాయణ, కంభంపాటి. 1998. ఆంధ్రుల సంస్కృతి చరిత్ర-2,హైద్రాబాద్ - హైద్రాబాద్ బుక్ ట్రస్ట్.
22. సూర్యాధనుంజయ్, డి. 2009. నల్లగొండ జిల్లా బంజారాల జీవన చిత్రణ. హైద్రాబాద్. శీతల్ పబ్లికేషన్స్.

23. సుందరం, డా॥ ఆర్వీయస్. 1993. జానపద సాహిత్య స్వరూపాలు, హైద్రాబాద్. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
24. Festivals of Banjaras. Pratap D.R - 1972. Tribal cultural Research and Training Institute. Tribal welfare Department. Hyderabad, A.P.
25. The Festival of Banjaras of Andhra Pradesh Pratp D.R - 1970. Triabl Cultural Research and Training Institue, Tribal welfare Department, Hyderabad. A.P.
26. The Banjaras of Bapunager. Pratp D.R. 1970. Triabl Cultural Research and Training Institue. Tribal welfare Department. Hyderabad. A..P
27. Census of India 1961 (Volume-1) Monograph Series (part V-B(iv)) Lambadi. office of te Registrar General. India. Ministry of Home affairs. New Delhi.

**II. పత్రికలు :**

1. గిరిజన సంఘం 4వ రాష్ట్ర మహాసభలు (సావనీర్). 2010.
2. స్తంభాద్రి సంబరాలు. ఖమ్మం (ప్రత్యేక సంచిక) జనవరి, 2007.
3. స్తంభాద్రి సంబరాలు. ఖమ్మం (ప్రత్యేక సంచిక) మార్చి, 2008.
4. స్తంభాద్రి సంబరాలు. ఖమ్మం (ప్రత్యేక సంచిక) జనవరి, 2009.
5. Hand Book of Statistics. Khammam District.2009. Khammam chief planning officer.
6. సాహితీ ప్రవంతి - సాహిత్య పత్రిక. హైదరాబాద్. అక్టోబర్ - డిసెంబర్. 2010.
7. భూమిక. మే, 2008.
8. Tribes of Andhra Pradesh (pamplate). May, 2002. Tribal Welfare Department. Hyderabad.

### III. వెబ్‌సైట్లు


1. www.google.com
2. www.wikepedia/gogle.com
3. www. goaars/of/india.org
4. www. rajasthantravelguide.com
5. www.khammamtribes/google.com
6. www.banjarafestivals/of/india.com
7. www. tribesinindia.com
8. www.tribesinandhrapradesh.com
9. www.censusof2011.com
10. www.teejfestival/of/banajara.com

## IV. విషయ సామాగ్రిని అందించిన వ్యాఖ్యాతలు :

| క్ర.సం | పేరు | వయస్సు ఊరు | మండలం |
|---|---|---|---|
| 1. నూనావత్ మోత్యానాయక్ | 85 సం॥ | మనుసబు బంజారా | కామేపల్లి |
| 2. ధారావతు భీలు నాయక్ | 80 సం॥ | మనుసబు బంజారా | కామేపల్లి |
| 3. భూక్య సేవ్యానాయక్ | 80 సం॥ | మనుసబు బంజారా | కామేపల్లి |
| 4. జర్పుల లుంబానాయక్ | 78 సం॥ | మనుసబు బంజారా | కామేపల్లి |
| 5. నూనావత్ సూర్యానాయక్ | 35 సం॥ | మనుసబు బంజారా | కామేపల్లి |
| 6. ఆజ్మీరా భద్రునాయక్ | 72 సం॥ | చీమ్లాతండా (బేతంపూడి) | టేకులపల్లి |
| 7. భూక్యా లాలునాయక్ | 80 సం॥ | చీమ్లాతండా (బేతంపూడి) | టేకులపల్లి |
| 8.పాల్తియా మంగ్యా | 75 సం॥ | చీమ్లాతండా(బేతంపూడి) | టేకులపల్లి |
| 9. పాల్తియా సేవ్రిబాయి | 90 సం॥ | చీమ్లాతండా(బేతంపూడి) | టేకులపల్లి |
| 10.బానోతు లక్ష్మణ్‌సింగ్ | 90 సం॥ | అంజనాపురం | గార్ల |
| 11.బానోతు భీక్యా | 60 సం॥ | అంజనాపురం | గార్ల |
| 12. మూడ్ బిచ్యా | 45 సం॥ | అంజనాపురం | గార్ల |
| 13.బానోతు బిచ్చాలి బాయీ | 57 సం॥ | అంజనాపురం | గార్ల |
| 14.గంగావతు మూన్యానాయక్ | 75 సం॥ | పెద్దకిష్టాపురం | గార్ల |
| 15. గంగావతు బాల్యినాయక్ | 70 సం॥ | పెద్దకిష్టాపురం | గార్ల |
| 16. గంగావతు చెన్నా నాయక్ | 60 సం॥ | పెద్దకిష్టాపురం | గార్ల |
| 17. గంగావతు సక్రియా(డప్టియా) | 85 సం॥ | పెద్దకిష్టాపురం | గార్ల |
| 18. గంగావతు వాల్యా | 75 సం॥ | సింగారం | బయ్యారం |
| 19.గుగులోతు బాల్యి | 50 సం॥ | కొత్తపేట | బయ్యారం |
| 20.గంగావతు తులసి | 60 సం॥ | పెద్ద కిష్టాపురం | గార్ల |
| 21.మాళోత్ మాన్‌సింగ్ | 72 సం॥ | బర్లగూడెం | కామేపల్లి |
| 22.అంగోతు జీజాబాయి | 55 సం॥ | చుంచుపల్లి | కొత్తగూడెం |
| 23.బానోతు ఛావళి | 70 సం॥ | ఎడ్జర్ల | కురవి (వరంగల్లు) |
| 24.వాంకుడోతు మాల్కి | 60 సం॥ | ఉప్పలపాడు | బయ్యారం |
| 25.జర్పుల సక్రి | 60 సం॥ | బొక్కల తండా | సింగరేణి |

| | | | |
|---|---|---|---|
| 26.ఇస్లావత్ హీరాణి | 62 సం॥ | గోవింద్రాల | కామేపల్లి |
| 27. ధరావతు హీరాణి | 35 సం॥ | నెమలిపురి | కామేపల్లి |
| 28.గంగావతు భద్రి | 60 సం॥ | పెదకిష్టాపురం | గార్ల |
| 29. బానోతు పార్వతి | 45 సం॥ | బర్లగూడెం | కామేపల్లి |
| 30.గంగావతు గీతాంజలి | 25 సం॥ | ఖమ్మం | ఖమ్మం |
| 31. గుగులోతు చంప్లి | 85 సం॥ | కొక్యాతండా | కూసుమంచి |
| 32. ధరావతు తావూర్యి | 75 సం॥ | గొల్లచర్ల | గార్ల |
| 33.బానోతు అచ్చమ్మ | 45 సం॥ | అంజనాపురం | గార్ల |
| 34.గంగావతు లక్ష్మోజీ | 90 సం॥ | పెద్దకిష్టాపురం | గార్ల |
| 35.పోరిక లక్ష్మీబాయి | 55 సం॥ | ఖమ్మం | |
| 36.గంగావతు దస్మాబాయి | 60 సం॥ | పెద్దకిష్టాపురం | గార్ల |
| 37.అజ్మీరా భద్రునాయక్ | 72 సం॥ | బేతంపూడి | టేకులపల్లి |
| 38.బానోతు కిషన్ | 50 సం॥ | బర్లగూడెం | కామేపల్లి |
| 39. వాంకుడోత్ కృష్ణనాయక్ | 55 సం॥ | మర్రిగూడెం | గార్ల |
| 40.గంగావతు లచ్చునాయక్ | 85 సం॥ | పెద్దకిష్టాపురం | గార్ల |
| 41.బానోతు శంకర్ నాయక్ | 68 సం॥ | బర్లగూడెం | కామేపల్లి |
| 42.భూక్యా రాంజీ నాయక్ | 90 సం॥ | సత్తుపల్లి | ఖమ్మం |
| 43. భాణావతు సూక్యా | 40 సం॥ | వి.యం.బంజర | ఖమ్మం |
| 44. మూడ్ ఈరి | 95 సం॥ | వత్సవాయి | బోనకాలు |
| 45. బానోత్ మల్చూర్ | 40 సం॥ | బోడుతండా | బయ్యారం |
| 46.ఢాలియా జాంఘడ్ | 92 సం॥ | నామాలపాడు | బయ్యారం |
| 47.మాలోత్ శంకర్ | 50 సం॥ | భాగ్యనగర్ తండా | సింగరేణి |
| 48.అజ్మీర నాన్య | 43 సం॥ | భజ్యానాయక్ తండా | కారేపల్లి |
| 49.బానోతు రాందాస్ | 25 సం॥ | జోగ్గూడెం | కారేపల్లి |
| 50. బానోతు భోజ్యా | 35 సం॥ | ఇర్సూలపురం | బయ్యారం |
| 51. భూక్యా లాలు | 57 సం॥ | నేతాజీ నగర్ | కొత్తగూడెం |

# అనుబంధం - 1

## ప్రస్తుతం భారతదేశంలో వాడుకలో ఉన్న బంజారా గోత్రాలు

1) భూక్యా / రాథోడ్

2) పమార్

3) చౌహాన్

4) బానోత్ (ఆడె)

5) వడ్తియా / జాదవ్

ఈ ఐదు గోత్రాలలో ప్రత్యేకమైన జాతులు ఉంటాయి. అవి ఇంటిపేర్లుగా పరిగణించబడుతున్నాయి.

**1) భూక్యా/రాథోడ్ (27) జాతులు**

1) ఆళోత్ 2) బానావత్ 3) బిలావత్ 4) డేగావత్ 5) దేపావత్ 6) దేవ్‌సోర్ 7) జంగావత్ 8) కానావత్ 9) కరమ్‌టోత్ 10) ఖట్రోత్ 11) ఖేతావత్ 12) ఖిలావత్ 13) కోదావత్ 14) కుమావత్ 15) మేఘావత్ 16) మేరాజోత్ 17) మేరావత్ 18) నేనావత్ 19) పాత్లోత్ 20) పితావత్ 21) రాజావత్ 22) రామావత్ 24) రాత్లా / పూల్యా 25) రానాసోత్ 26) సంగావత్ 27) సోట్కి

**2) పమార్ (12) జాతులు**

1) ఆంగోత్ 2) అయివత్ పమార్ 3) బాణ్ణి 4) ఛాయివోత్ పమార్ 5) ఇంద్రావత్ 6) ఇస్లోత్ పమార్ 7) జర్పులా 8) లూన్సావత్ / నూన్సావత్ 9) పామాడియా 10) తార్బాన్సి 11) వాంకుడోత్ 12) విస్లావత్ / ఇస్లావత్

**3) చౌహాన్ (6) జాతులు**

1) డుమావత్ / చౌరడియా 2) కేళోత్ 3) కొర్ర 4) మూడ్ 5) పాల్తియా 6) సఫావట్

**4) బానోత్ (15) జాతులు**

1) ఆడోత్ 2) ఆడే 3) భానోత్ 4) భోజావత్ 5) దానావత్ 6) ధరమ్‌సోత్ 7) ధీరవత్ 8) జాటోత్ 9) కర్ణావత్ 10) కుంటావత్ 11) లవోరి 12) ముదావత్ 13) పానావత్ 14) రూపావత్ 15) సబ్దాసోత్

## 5) వడ్తియా/జాదవ్ (32) జాతులు

1) బాదావత్ 2) బర్మావత్ 3) వడ్తియా జాజిగిరి 4) భగవాన్‌దాస్ 5) భరోత్ 6) బోడా 7) ధారావత్ 8) డుంగ్రోత్ 9) గంగావత్ 10) గోర్రామ్ 11) గుగులోత్ 12) జాదవ్ 13) జాలోత్ 14) జ్యాట్ 15) కాగ్ల 16) కున్సోత్ 17) లూకావత్ 18) లోకావత్ 19) లూనావత్ 20) మాళోత్ 21) మోహన్‌దాస్ 22) పిపావత్ 23) పుస్నామాల్ 24) సలావత్ 25) సజావత్ 26) తేజావత్ 27) టేపావత్ 28)టేరావత్ 29) టువర్ 30) వుండావత్ 31) వడేర్‌జాడ్ 32) అజ్మీర

మనం ముందు మొత్తం 4 గోత్రాలుగా చెప్పుకున్నాం కానీ పైన పేర్కొన్న 5 గోత్రాలు, 92 ఇంటిపేర్లు ప్రస్తుతం వాడుకలో ఉన్నవి. ఇందులో కొన్ని రాష్ట్రాలలో కొన్ని జాతులు ఉన్నవి, కొన్ని రాష్ట్రాలలో లేవు. భారతదేశంలో ప్రస్తుతం ఇవి ఉన్నట్లు వెబ్‌సైట్ల ద్వారా తెలుస్తుంది.

# అనుబంధం - 2

## గంగావతు వంశావళి (ఏడు తరాలు)

గమ్యా నాయక్

గంగ్యా నాయక్

సామా నాయక్

లక్ష్మా నాయక్

1) పర్తియా 2) బలరాం 3) పెద్ద సీతా 4) చిన్న సీతా 5) సోమ్లా 6) -------

1) పర్తియా - 1) రాము 2) చందు 3) వల్మా 4) సరిరామ్ 5) భీమా 6) వశ్యా

1) రాము : – బోజ్యా, నర్సింహా

2) చందు :– నర్సా, సుక్యా, దేవుజ్యా

3) వల్మా :– గన్యా, వాచ్యా, మూన్యా, కస్నా, బొందులా (రాములు)

4) సరిరామ్ :– టీక్యా, బీక్యా, చోక్లా, సామ్లా, బాల్యా

5) భీమా :– లక్ష్మోజి, క్రిష్ణ, మంగీలాల్

**6) వశ్యా నాయక్**

**బాలు,** **లాలు**

**శ్రీనివాస్, ప్రసాద్, వెంకట లాల్** (రచయిత) **తేజేశ్వర బాల మురళి క్రిష్ణ**

**జీవితేశ్**

ఈ గంగావత్ వంశము వారు పెద్ద క్రిష్ణాపురం గ్రామం, గార్ల మండలం, మహబూబాబాద్ జిల్లాలో నివసిస్తున్నారు. పేరు తెలియని 6వ కుమారుడు బలపాలలో కానీ లేదా సింగారం గ్రామంలో కాని స్థిరపడి ఉంటారని కొంతమంది బంజారా పెద్దలు తెలియజేశారు. వీరి వంశానికి నాయకుల వంశముగా పేరుంది.